


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 27-10-2024 | పేజీలు: 14 +28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 192 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి పూర్తి; నక్షత్రం: మఖ మ. 12.24 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 9.24-11.12, దుర్ముహూర్తం: సా. 4.10-4.56, అమృతఘడియలు: ఉ. 9.44-11.30, రాహుకాలం: సా. 4.30-6.00, సూర్యోదయం: 6.15, సూర్యాస్తమయం: 5.42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


విలేకరుల సమావేశంలో కంటతడి పెడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

కుమిలిపోతున్న అమ్మ..!

కన్న కొడుకే కేసు పెట్టి కోర్టుకు లాగేసరికి... ఇంకా ఎందుకు బతికున్నానా అని రోదిస్తోంది

అన్న కోసం పాదయాత్ర చేశా.. సమైక్య ఉద్యమం నడిపా

నా కోసం ఒక్క మేలైనా ఆయన చేశారా?

'నీ తర్వాత షర్మిల మేలు కోరేది నేనే' అని నాన్నతో చెప్పాడు

నా పిల్లలపై ప్రమాణం చేసి ఇదంతా చెబుతున్నా

వైవీ సుబ్బారెడ్డి ప్రమాణం చేయగలరా?: షర్మిల

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): "ఆస్తి కోసం.. కన్న కొడుకే కోర్టుకు ఈడ్చి, కేసు పెట్టడంతో అమ్మ కుమిలిపోతోంది. ఇదంతా చూసేందుకే నేను ఇంకా బతికి ఉన్నానా అని రోదిస్తోంది" అని వైఎస్ విజయలక్ష్మి కుమార్తె, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్ రద్దు అవుతుందని తల్లిపై కేసు పెట్టానని జగన్ అనడం దుర్మార్గమని, తన ప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు లాగే దౌర్భాగ్యుడు ఎవరైనా ఉన్నారా అంటూ

మిగతా 13వ పేజీలో...

సొంతానికి 'పవర్'!



'సరస్వతీ' కంపెనీ కోసం అడ్డదారులు

అడ్డగోలుగా అధికార దుర్వినియోగం

'పవర్' ఉన్నది ప్రజలకు మేలు చేసేందుకు కాదు... తన సొంత మేళ్ల కోసమే! తండ్రి అధికారంలో ఉన్నప్పుడు జగన్ చేసిందిదే! తాను అధికారంలోకి వచ్చాక జరిగిందీ అదే! దీనికి మరో ఉదాహరణ... 'సరస్వతీ పవర్' ఉదంతమే! 'సరస్వతీ పవర్' విషయంలో జగన్ స్వప్రయోజనాలే పరమావధిగా వ్యవహరించారు. ఇప్పుడు 'ఇందులో వాటాలు మీకిచ్చేది లేదు. అంతా నా సొంతం' అంటూ తల్లీ చెల్లిపై కేసు వేశారు. అసలు... సరస్వతీ పవర్ విషయంలో జరిగిందేమిటి? జగన్ అధికారంలోకి రాకముందు, ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ కంపెనీకి ఎలాంటి మేళ్లు చేశారు? అందుకోసం అబద్ధాల గోడలు ఎలా కట్టారు? ఇవీ ఆ వివరాలు...

స్వప్రయోజనాలే పరమావధిగా నిర్ణయాలు

వ్యవస్థలను పణంగా పెట్టి సొంతానికి మేళ్లు

తమ వద్ద ప్రభుత్వ భూమి లేదంటూ న్యాయస్థానం కళ్లకు అబద్ధాల గంతలు

25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేంద్రానికి పెట్టిన దరఖాస్తులో వెల్లడి

పచ్చి అబద్ధాలతో పర్యావరణ అనుమతులు

సొంత కంపెనీకి జీవితకాలం నీటి కేటాయింపు

భూమి విస్తీర్ణంలోనూ అడ్డగోలుగా సవరణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సరస్వతీ పవర్ అనేది విద్యుదుత్పత్తి కంపెనీ మాత్రమే. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకొని జగన్ దాన్ని ఇండస్ట్రీస్ రంగంలోకి దించడానికి వ్యూహం రచించారు. దీనిలో భాగంగా 2008 జూలై 15న కంపెనీ బోర్డును అత్యవసరంగా సమావేశపరిచారు. సరస్వతీ పవర్ సిమెంట్ వ్యాపారంలోకి ప్రవేశించే విధంగా

మిగతా 14వ పేజీలో...

'సరస్వతీ' భూముల్లో సర్వే


పల్నాడు జిల్లా వేమవరం రెవెన్యూ శివారులో సరస్వతీ సంస్థ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ క్షమారాణి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

పల్నాడు జిల్లాలో పరిశీలన

ప్రభుత్వ భూములు ఉన్నట్టు గుర్తించిన తహసీల్దార్

నేడు, రేపు కొనసాగనున్న సర్వే

13



ఆర్టీసీ.. నీ రూటు ఎటు?

ప్రజలకు దూరంగా ప్రజా రవాణా!

బస్సులు లేక రూట్లు, సర్వీసులు రద్దు

ఐదేళ్లలో ఒక్క బస్సూ కొనని వైసీపీ సర్కారు

తక్షణం మార్చాల్సిన బస్సులు 3,573

కొత్తగా వచ్చినవి కేవలం 630 బస్సులే

రివర్స్ టెండరింగ్‌తో అద్దె బస్సులకు రాంరాం

రోజూ 45లక్షల కి.మీ నుంచి 38లక్షలకే పరిమితం

నానాటికీ తీసికట్టుగా ఏపీఎస్ ఆర్టీసీ తీరు

12

..ముందే సజ్జలతో భేటీ

అప్పిరెడ్డి, రఘురాం, నందిగం, అవినాశ్ సమావేశమై మాట్లాడారు

వారి ఆదేశాలతోనే టీడీపీ కార్యాలయంపైకి దాడికి వెళ్లాం

అక్కడ పట్టాభి ఉంటే చంపాలనుకున్నాం

సీఐడీ విచారణలో కీలక విషయాలు వెల్లడించిన చైతన్య!

14

అనంతలో ఘోర ప్రమాదం

12

ఆరుగురు ఇస్కాన్ భక్తులు మృతి

టైరు పేలి లారీని ఢీకొట్టిన కారు


ప్రమాదంలో లారీ కిందకు దూసుకుపోయి నుజ్జు నుజ్జయిన కారు

లారీ కిందకు దూసుకెళ్లిన కారు

గవర్నర్, చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

తిరుపతి జిల్లాలో లారీని ఢీకొన్న కంటైనర్

కంటైనర్ డ్రైవర్ సజీవ దహనం

'ఇరుముడి'తోనే విమానంలోకి

అయ్యప్ప స్వాములకు ప్రత్యేక వెసులుబాటు

మకరజ్యోతి వరకు అవకాశం: రామ్మోహన్

12


తన సభ్యత్వ కార్డును చూపిస్తున్న సీఎం చంద్రబాబు

తిరగబడండి

ఇసుక దందాను సహించొద్దు

అండగా నేనుంటా.. కార్యకర్తలకు చంద్రబాబు పిలుపు

ఐదేళ్లూ విధ్వంసమే.. తిరిగి గాడిలోకి ఏపీ.. నేను 1995 సీఎంనే

ఈసారి కచ్చితంగా రాజకీయ పాలనే చేస్తా

మొన్న జరిగింది ఎన్నికలు కాదు.. అది రాక్షసులతో మనం చేసిన యుద్ధం

మన పనైపోయిందన్నవారి పనే ఐపోయింది.. టీడీపీ ఓ రాజకీయ వర్సిటీ

ఏ ముఖ్యనేతకైనా మూలాలు ఇక్కడే.. ఇసుక, మద్యంలో ఎవరూ తలదూర్చొద్దు

సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

"రాజకీయ ముసుగులో ఎవరైనా తప్పులు చేస్తే వదిలిపెట్టబోను. వ్యక్తిగత అంశాలను పార్టీ కక్షల రూపంలో తీర్చుకుంటామంటే కుదరదు. దానివల్ల ఎన్నో సమస్యలు వస్తాయి. ప్రజలకు మన పట్ల ఉన్న విశ్వసనీయతను కాపాడుకోవడం చాలా కష్టమైన పని. కానీ, దానిని పోగొట్టుకోవడానికి రెండు నిమిషాలు చాలు. మనపై ఇప్పుడు రెండు ప్రధాన బాధ్యతలు ఉన్నాయి. టీడీపీ కోసం జెండాలు మోసి, త్యాగాలు చేసిన కార్యకర్తలను కాపాడుకోవాలి. నమ్మి మనకు అధికారం కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. ఈ దిశగా మన ప్రయాణం ఉండాలి" - సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ ఆవిర్భావంతోనే తెలుగుజాతికి గుర్తింపు వచ్చిందని, టీడీపీ ఒక రాజకీయ యూనివర్సిటీ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా తొలి సభ్యత్వ కార్డును చంద్రబాబు అందుకున్నారు. సభ్యత్వ నమోదు కరపత్రాన్ని విడుదల చేశారు. వైసీపీ నేతల దాడిలో ప్రాణాలు కోల్పోయిన, దాడులకు గురైన, ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలతో ఆయన జూమ్‌కాల్ ద్వారా మాట్లాడారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే.. "అనేక సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, టీడీపీని నిలబెట్టాం. గత ఐదేళ్లలో చాలామంది టీడీపీ పనైపోయిందన్నారు. కానీ ఆ మాట అన్నవారి పనైపోయింది. టీడీపీని భావితరాల వారికి అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. మొన్నటి ఎన్నికల్లో మన శక్తి ఏంటో చూపించాం. సామాజిక సమీకరణాలతో ముందుకెళ్లి అన్ని కులాలకు ప్రాధాన్యమిచ్చాం. మొన్న జరిగింది ఎన్నికలు కాదు.. రాక్షసుడితో యుద్ధం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వ్యక్తులు (జగన్) వస్తారని ఊహించలేదు. మనస్ఫూర్తిగా చెప్తున్నా... 2024 ఎన్నికల్లో గెలుపు కార్యకర్తల విజయమే. వేధింపులు, కేసులు, అరెస్టులు, దాడులతో నాటి పాలకులు ఇబ్బందులు పెట్టినా, ఏ కార్యకర్తా

మిగతా 13వ పేజీలో...


అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్రులు

'ఏఐ'తో రాష్ట్రాభివృద్ధి రయ్ రయ్!

ప్రజా పాలనలోనూ పారదర్శకత

ప్రతి వంద రోజులకూ లక్ష్యాలు

పీ-ఫోర్ విధానంతో పేదరిక నిర్మూలన

పెట్టుబడులకు రాష్ట్రంలో సువర్ణావకాశం

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు

14

అమెరికా పర్యటనలో మంత్రి నారా లోకేశ్

శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో భేటీ

ఏపీ బ్రాండ్ పునరుద్ధరణే లక్ష్యం!

నూతన పారిశ్రామిక విధానాల అమలుకు ఉత్తర్వులు

అర్హత ఉన్న పరిశ్రమలన్నింటికీ ప్రోత్సాహకాలు

3



పీక్స్‌కు చేరిన ఫోన్ పిచ్చి!

మొబైల్ పట్టుకుంటే.. వదలరు!

గేమ్స్, రీల్స్, షార్ట్స్‌లో గంటలకొద్దీ 'బిజీ'

అన్ని వయసుల వారూ మొబైల్‌కు బానిసలే

చివరకు బాధితులుగా మారి ఆస్పత్రులకు క్యూ

కడప ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రికి ప్రతినెలా వందమందికిపైగా బాధితులు

మానసిక వ్యాధిలా మారుతున్న మొబైల్ వ్యసనం

(కడప/విశాఖపట్నం/గుంటూరు - ఆంధ్రజ్యోతి)

ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్, ఫేస్‌బుక్ స్టోరీలు.. ఇవి కావని, రకరకాల గేమ్స్! మొబైల్ పట్టుకుంటే.. వదిలే ప్రసక్తే లేదు. నిమిషాలు, గంటలూ కరిగి పోవాల్సిందే! చిన్న, పెద్దా తేడా లేదు! ఇప్పటిదాకా జూదం, మద్యం, డ్రగ్స్‌కు అలవాటుపడి చికిత్స కోసం ఆసుపత్రులకు వెళ్లేవారిని చూశాం. ఇప్పుడు 'మొబైల్ అడిక్షన్' వదిలించుకోవడానికి ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ 'మొబైల్ వల'లో చిక్కుకుపోతున్నారు. చివరికి ఇదో మానసిక సమస్యగా మారిపోతోంది. కడపలాంటి చిన్నపాటి నగరంలోనే ప్రభుత్వ మానసిక వైద్యశాలకు ప్రతినెలా సుమారు వందమంది మొబైల్ బెడద వదిలించుకునేందుకు వైద్యులను సంప్రదిస్తున్నారు. వీరిలో కొందరిని ఇన్‌పేషంట్లుగా చేర్చుకోవాల్సిన పరిస్థితి కూడా వస్తోంది. ఇంకా ప్రైవేటు ఆసుపత్రులు, ఇతర ప్రాంతాలలో చికిత్స పొందుతున్న వారు కూడా ఎందరో! మొబైల్ బాధితులో పదేళ్ల వయసు పిల్లలూ ఉండటం గమనార్హం. స్మార్ట్‌ఫోన్లు, తక్కువ ధరకే డాటా! యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్... వంటి సోషల్ మీడియా వేదికలు! వీటికి అదనంగా రకరకాల గేమ్స్! ఫోన్ తెరకు కళ్లను


మిగతా 13వ పేజీలో...



స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ బాధితుల్లో

60% 8-18 వయసువారే

30% 29-40 వయసువారే



నువ్వా.. నేనా

సుదీర్ఘంగా.. సంక్లిష్టంగా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ




- అన్ని రాష్ట్రాల మద్దతున్నవారే ప్రెసిడెంట్ కావాలనే లక్ష్యంతో ఎలక్టోరల్ కాలేజీ విధానం.. కానీ స్వింగ్ రాష్ట్రాలే కీలకం
- మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో 119 స్వింగ్ రాష్ట్రాలవే
- 2016 ఎన్నికల్లో.. ఆ ఏడు రాష్ట్రాలూ దక్కించుకున్న ట్రంప్
- 2020లో వాటిల్లో ఆరింటిని కైవసం చేసుకున్న జో బైడెన్
- ఈసారి ఆ రాష్ట్రాల్లో ట్రంప్, కమల మధ్య హోరాహోరీ పోరు

ఎన్నికలంటే.. ప్రజలే తమ ప్రభువులను ఎన్నుకునే ప్రజాస్వామ్య పండగ! అయితే, ఎన్నికలు ఒక్కో దేశంలో ఒక్కోలా జరుగుతాయి. మనదేశంలో 51 శాతం ఓట్లు వచ్చిన అభ్యర్థి విజయం సాధిస్తే.. అమెరికాలో ఒక రాష్ట్రంలో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థికి, ఆ రాష్ట్రంలోని ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు మొత్తం దఖలు పడతాయి. అలా ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువ వచ్చిన అభ్యర్థి 'అంకుల్ శామ్ (అమెరికన్లు ముద్దుగా తమ అధ్యక్షుణ్ని ఇలాగే పిలుచుకుంటారు. 'మరి ఒక మహిళ ప్రెసిడెంట్ అయితే?' అంటారా అని అడిగితే.. ఇప్పటిదాకా మహిళలెవరూ ప్రెసిడెంట్ కాలేదు కాబట్టి ఆ మీమాంస వారికి రాలేదు. ఈసారి కమలా హ్యారిస్ గెలిస్తే.. ఆ సందేహం వచ్చే అవకాశం ఉంది) అవుతారు. అసలు అధ్యక్ష అభ్యర్థిగా బరిలో ఉండడానికే అక్కడ చాలా పెద్ద తతంగం ఉంటుంది. మనదగ్గర ఎన్నికల షెడ్యూలు వెలువడగానే.. రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తాయి. కానీ.. అమెరికాలో అధ్యక్ష పదవి రేసులో ఉండడానికే సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. పార్టీ నుంచి ప్రెసిడెన్షియల్ క్యాండిడేట్‌గా పోటీ పడేందుకు ఒకరికన్నా ఎక్కువ మంది ముందుకొస్తే వారిలో ఎవరిని అభ్యర్థిగా ఎంచుకోవాలో నిర్ణయించుకునేందుకు ప్రైమరీలు, కాకస్‌లు నిర్వహిస్తారు. వీటిలో కాకస్ అంటే.. పార్టీ సభ్యులు బృందాలుగా విడిపోయి చర్చలు, ఓట్ల ద్వారా ఉత్తమ అభ్యర్థిని ఎంచుకుంటారు. ప్రైమరీలంటే.. తమకు నచ్చిన అధ్యక్ష అభ్యర్థికి బ్యాలెట్ ద్వారా ఓటు వేసి మద్దతు తెలిపే ప్రక్రియ. ఈ ప్రైమరీలు, కాకస్‌లు ముగిశాక.. ప్రతి పార్టీ అంతర్గతంగా జాతీయ స్థాయి సదస్సు నిర్వహించి తమ అభ్యర్థిని ఎంచుకుని, ప్రకటిస్తుంది. సదరు అధ్యక్ష అభ్యర్థులు.. తమ రన్నింగ్ మేట్‌ను (అంటే ఉపాధ్యక్ష అభ్యర్థిని) ప్రకటిస్తారు. అనంతరం అసలు ఎన్నికల ప్రచారం షురూ అవుతుంది. అన్ని పార్టీల అధ్యక్ష అభ్యర్థులూ దేశమంతా తిరుగుతూ ప్రజల మద్దతు పొందేందుకు ప్రచారం చేస్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, దేశ రక్షణ, విదేశాంగ విధానం, తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, విధానాలను బహిరంగంగా తెలుపుతారు. ఇందుకోసం ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మూడు ముఖాముఖి చర్చలు జరుగుతాయి. ఆ డిబేట్లలో ఆయా అభ్యర్థుల వైఖరి, వారి ఆలోచనసరళి ఆధారంగా చాలా మంది తటస్థులు తాము ఎవరికి మద్దతు ఇవ్వాలో తేల్చుకుంటారు. ఆ తర్వాత అసలు దశ.. నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం (తొలి మంగళవారం కాదు) పోలింగ్ జరుగుతుంది. ఉదాహరణకు నవంబరు 1వ తేదీ మంగళవారం అయితే.. ఆ నెలలో వచ్చే మొదటి సోమవారం 7వ తేదీ అవుతుంది. అప్పుడు.. అధ్యక్ష ఎన్నికను నవంబరు 8న నిర్వహిస్తారు. అలా ఈసారి నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం 5వ తేదీ అయ్యింది. కాబట్టి ఆరోజు ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు.

పేరుకు అధ్యక్ష ఎన్నికలేగానీ.. అమెరికా ప్రజల ఓట్లు ఎక్కువగా సాధించిన అభ్యర్థి ప్రెసిడెంట్ కారు. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువగా వచ్చిన అభ్యర్థి మాత్రమే శ్వేత సౌధానికి అధిపతి అవుతారు! అదేదో సినిమాలో డైలాగులాగా.. "జనం ఓట్లు ఎన్నొచ్చాయన్నది కాదన్నయ్యా.. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎన్నొచ్చాయనేదే లెక్క" అన్నమాట! ఉదాహరణకు.. 2016 ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ కన్నా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు 28.6 లక్షల ఓట్లు ఎక్కువ వచ్చాయి! కానీ.. ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు ఎక్కువ వచ్చిన ట్రంపే అధ్యక్షుడయ్యారు! "విన్నర్ టేక్స్ ఆల్" అనే విధానం వల్ల జరిగే మ్యాజిక్ ఇది. అమెరికాలో అధ్యక్ష అభ్యర్థిని ఎంచుకునే ప్రక్రియ కూడా చాలా సుదీర్ఘంగా ఉంటుంది. ఆ కథాకమామీషూ.. అధ్యక్ష ఎన్నికల్లో సిత్రాలపై ప్రత్యేక కథనం

ఎలక్టర్లకు ఓటు..

ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసేది నేరుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు కాదు. రిపబ్లికన్ లేదా డెమొక్రాటిక్ లేదా ఇతర, స్వతంత్ర పార్టీల ప్రతినిధులకు ఓటేస్తారు. ఆ ప్రతినిధులను 'ఎలక్టర్'లంటారు. మనదేశంలో.. జనాభా ఆధారంగా రాష్ట్రాల ఎంపీల సంఖ్య ఉన్నట్టే, అమెరికాలోని 50 రాష్ట్రాలకూ కాంగ్రెస్‌లో ఉన్న ప్రతినిధుల సంఖ్య ఆధారంగా ఎలక్టర్ల సంఖ్య ఉంటుంది. ఉదాహరణకు.. క్యాలిఫోర్నియా రాష్ట్రానికి అత్యధికంగా 55 మంది ఎలక్టర్లున్నారు. టెక్సాస్‌కు 38 మంది ఎలక్టర్లున్నారు. ఇలా 50 రాష్ట్రాలకూ కలిపి మొత్తం 538 మంది ఎలక్టర్లుంటారు. వీరిలో 270 మంది మద్దతు పొందిన వారు అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠిస్తారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేంటంటే.. మెయిన్, నెబ్రాస్కా రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాల్లో విషయంలో గెలిచిన పార్టీకే మొత్తం ఎలక్టోరల్ ఓట్లు దక్కుతాయి (విన్నర్ టేక్స్ ఆల్). ఉదాహరణకు క్యాలిఫోర్నియా ప్రజల్లో సగానికంటే ఎక్కువ మంది డెమొక్రాట్ అభ్యర్థికి ఓటు వేస్తే.. మొత్తం 55 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లూ డెమొక్రాట్ల ఖాతాలో పడిపోయినట్టే. దీనివల్ల.. ఓట్లు ఎక్కువ వచ్చినా కొందరు అభ్యర్థులు అధ్యక్షులు కాలేకపోయారు. 2000 సంవత్సరంలో అల్‌గోర్, 2016లో హిల్లరీ ఇలాగే ప్రజల ఓట్లు ఎక్కువ వచ్చినా, ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు తక్కువ రావడంతో పరాజితులుగా మిగిలిపోయారు.

కంచుకోటలు..

మనదగ్గర పార్టీలకు కంచుకోటలుగా పేరుబడిన నియోజకవర్గాలు ఉన్నట్టే.. అమెరికాలో కూడా కొన్ని రాష్ట్రాలు డెమొక్రాట్లకు, కొన్ని రాష్ట్రాలు రిపబ్లికన్లకు కంచుకోటల్లా పేరొందాయి. అలా ఏ పార్టీవైపు ఇదమిత్థంగా మొగ్గుచూపని రాష్ట్రాలు ఏడున్నాయి. వాటిని 'స్వింగ్' రాష్ట్రాలంటారు. శ్వేతసౌధంలో ఎవరు కూర్చోవాలో నిర్ణయించే ఆ ఏడు రాష్ట్రాలూ.. ఫ్లోరిడా (29), పెన్సిల్వేనియా (20), ఒహాయో (18), మిషిగన్ (16), ఉత్తర కరోలినా (15), అరిజోనా (11), విస్కాన్సిన్ (10). ఈ ఏడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 119 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. అయోవా (6) కూడా అలాంటిదే. ఈ రాష్ట్రాల్లో పోలింగ్ ఢీ అంటే ఢీ అన్నట్టుగా ఉంటుంది. దీని వల్ల అక్కడ ఓట్ల లెక్కింపు కూడా బాగా ఆలస్యమవుతుంటుంది. 2016 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడు రాష్ట్రాల్లోనూ క్లీన్‌స్వీప్ చేశారు. మిగతా రాష్ట్రాల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ గట్టి ప్రభావం చూపినా.. ఈ ఏడు రాష్ట్రాల్లోని 119 ఎలక్టోరల్ ఓట్లను కోల్పోవడం ద్వారా అధ్యక్ష పీఠానికి దూరమయ్యారు. ట్రంప్ కంటే ఆమెకు 28.68 లక్షల ఓట్లు అధికంగా వచ్చినా.. విజయానికి కావలసిన 270 ఎలక్టరల్ ఓట్లు పొందడంలో విఫలమయ్యారు. ఈసారి స్వింగ్ రాష్ట్రాల్లో కమల, ట్రంప్ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సుదీర్ఘంగా..

అధ్యక్ష ఎన్నికలు జరిగిన తీరు ఆధారంగా.. గెలిచేది ఎవరనే విషయంపై రాజకీయ విశ్లేషకులు 24 గంటల్లోనే ఒక నిర్ణయానికి వస్తారు. కానీ.. అధికారికంగా కొంత ప్రక్రియ మిగిలే ఉంటుంది. అది నవంబరు రెండోవారం నుంచి డిసెంబరు రెండోవారం దాకా జరుగుతుంది. డిసెంబరులో రెండో బుధవారం తర్వాత వచ్చే సోమవారంనాడు (ఈ ఏడాది అది డిసెంబరు 16 అయింది) ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు (ఎలక్టర్లు) తమతమ రాష్ట్రాల్లో సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులకు ఓటేస్తారు. అంటే.. అధ్యక్ష అభ్యర్థిని నేరుగా ఎంచుకునే ప్రక్రియ జరిగేది ఆ రోజన్నమాట. ఎలక్టర్లు ఓటు వేసిన 9 రోజుల లోపు ఆ ఓట్లన్నీ (సర్టిఫికెట్స్ ఆఫ్ ఓట్స్) సెనెట్ అధ్యక్షుడికి చేరాలి. జనవరి 6న.. మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ఎలక్టోరల్ ఓట్లను లెక్కించి, విజేత ఎవరో సెనెట్ అధ్యక్షుడు ప్రకటిస్తారు. జనవరి 20న అధ్యక్ష, ఉపాధ్యక్షులు బాధ్యతలు స్వీకరిస్తారు. అప్పుడు కొత్త ప్రెసిడెంట్.. 'రాజు వెడలె రవితేజములలరగ..' అన్న చందంగా సగర్వంగా శ్వేతసౌధంలోకి అడుగుపెడతారు.

- సెంట్రల్ డెస్క్

ముందస్తు ఓటింగ్

అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగేది నవంబరులో మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారమే! కానీ.. దానికి నెలన్నర ముందు నుంచే 'ఎర్లీ ఓటింగ్' పేరుతో ముందస్తుగా ఓటు వేసే అవకాశాన్ని పౌరులకు కల్పిస్తారు. ఈ 'ముందస్తు ఓటింగ్ రెండు రకాలుగా జరుగుతుంది. ఒకటి.. మెయిల్ బ్యాలెట్ల ద్వారా, రెండోది మామూలు పోలింగ్ కేంద్రాల ద్వారా. ఈసారి అక్టోబరు 20 నాటికే 2.1 కోట్ల మంది అమెరికన్లు ముందస్తుగా ఓటును వినియోగించుకోవడం విశేషం.

లోకం తీరు



అధ్యక్షుడు+ఉపాధ్యక్షుడు= టికెట్

ఇద్దరు వ్యక్తులను కలిపి చెప్పడానికి మనం 'ద్వయం' అన్నట్టే.. అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులిద్దరినీ కలిపి 'టికెట్'గా వ్యవహరిస్తారు!

కుబేరులు.. అటూ ఇటూ!

పారిశ్రామికవేత్తలు, బాగా డబ్బున్న వ్యాపారులు రాజకీయ పార్టీలకు విరాళాలు ప్రకటించడం మనకు కొత్తేం కాదు! అమెరికాలోనూ అంతే. టెస్లా, స్పేస్‌ఎక్స్ వంటి సంస్థలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అపర కుబేరుడు ఈలన్ మస్క్ రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కు మద్దతుతో పాటు ఆర్థిక సాయమూ ప్రకటిస్తే.. మరో కుబేరుడు, మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కమలకు పరోక్ష మద్దతు ప్రకటించారు. వీరే కాదు.. ఎంతోమంది బిలియనీర్లు వీరిద్దరిలో తమకు నచ్చినవారికి మద్దతుగా విరాళాలిచ్చారు. అయితే, ట్రంప్‌తో పోలిస్తే.. ఎక్కువ మంది బిలియనీర్ల మద్దతు కమలాహ్యారిస్‌కే ఉండడం గమనార్హం. ఫోర్బ్స్ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 81 మంది కోటీశ్వరుల మద్దతు కమలకు ఉండగా, ట్రంప్‌కు ఆర్థికంగా అండగా నిలుస్తున్న కుబేరులు 51 మంది దాకా ఉన్నారు. కమలకు మద్దతిస్తున్న బిలియనీర్లలో 28 మంది కనీసం 10 లక్షల డాలర్లు ఆమెకు విరాళంగా ప్రకటించారు. ఆమెకు మద్దతుగా ఉన్నవారిలో ప్రపంచ ప్రఖ్యాత సినీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బెర్గ్ కూడా ఉండడం విశేషం. ఇక ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన కోటీశ్వరుల్లో 26 మంది ఆయనకు 10 లక్షల డాలర్లు అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చారు. ఆయనకు ఈలన్ మస్క్, మిరియం అడెల్సన్, డిక్ యుహ్లీన్ అనే ముగ్గురు కోటీశ్వరుల నుంచి వచ్చిన విరాళమే 22 కోట్ల డాలర్లు కావడం గమనార్హం. అమెరికాలోని 971 మంది పెట్టుబడిదారులైన మిలియనీర్లు, బిలియనీర్లను ప్రశ్నించగా.. వారిలో 57 శాతం మంది కమల వైపు మొగ్గుచూపారు. 43 శాతం మందే ట్రంప్ కావాలన్నారు.

రూ.5,323 కోట్లు!

కమలా హ్యారిస్ ఫండ్‌రైజింగ్ కమిటీ ఇప్పటిదాకా ఆమె ఎన్నికల ప్రచారం కోసం జూలై నుంచి సెప్టెంబరు చివరినాటికి 63.3 కోట్ల డాలర్ల విరాళాలు సేకరించాయి. అంటే మన కరెన్సీలో దాదాపు రూ.5323 కోట్లు. అంతకుముందు బైడెన్ అభ్యర్థిగా ఉన్న సమయంలో వచ్చిన విరాళాలను కూడా కలుపుకొంటే ఆ మొత్తం దాదాపుగా రూ.8 వేల కోట్లు. అదే సమయంలో.. ట్రంప్ నిధుల సేకరణ 14.5 కోట్ల డాలర్లే. అంటే.. దాదాపు రూ.3,090 కోట్లే!!

వీళ్లూ ఉన్నారు

అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నవారిలో ట్రంప్, కమలా హ్యారిసే కాదు.. వేరే పార్టీలకు చెందినవారు, స్వతంత్రులు కూడా ఉన్నారు. గ్రీన్ పార్టీకి చెందిన జిల్ స్టీన్, లిబర్టేరియన్ పార్టీకి చెందిన చేజ్ ఒలివర్ వంటివారు కూడా ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ తమ్ముడి కుమారుడు రాబర్ట్ ఎఫ్ కెనెడీ జూనియర్ స్వతంత్ర అభ్యర్థిగా నిలిచారు. కానీ, ఆ తర్వాత ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు.

ఔషధం కాదు.. విషం!

- కాల్షియం, విటమిన్ డీ3, పారాసిటమాల్ మాత్రలు నాసిరకం
- 49 మందులు నాణ్యత పరీక్షల్లో విఫలం: సీడీఎస్‌సీవో

న్యూఢిల్లీ, అక్టోబరు 26: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడాల్సిన ఔషధాలు ఇప్పుడు విషంగా మారి ప్రజలు ప్రాణాలు తీస్తున్నాయి. దేశంలో నాసిరకం, నకిలీ మందులు విచ్చలవిడిగా చెలామణీ అవుతున్నాయి. జ్వరం, తలనొప్పి, ఒళ్ల నొప్పులకు సాధారణంగా వేసుకొనే పారాసిటమాల్ మాత్రల నుంచి కాల్షియం సప్లిమెంట్లు, విటమిన్ ట్యాబ్లెట్ల వరకూ నాసిరకంగానే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా సేకరించిన దాదాపు 3వేల ఔషధాల నమూనాల్లో 49 మందులు నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగా లేవని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) వెల్లడించింది. సెప్టెంబరు నెలకు సంబంధించిన క్వాలిటీ రిపోర్టును ఆ సంస్థ తాజాగా విడుదల చేసింది. నిర్ధారించిన నాణ్యతా ప్రమాణాలు లేని మందుల్లో నొప్పి నివారణకు విస్తృతంగా వినియోగించే పారాసిటమాల్ ట్యాబ్లెట్లు (కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్), మెట్రోనిడాజోల్ (హిందుస్థాన్ యాంటీబయాటిక్స్), డెంపెరిడోన్ (రెయిన్‌బో లైఫ్ సైన్సెస్) ట్యాబ్లెట్లతో పాటు ఆక్సిటోసిన్ (పుష్కర్ ఫార్మా) ఇంజెక్షన్లు ఉన్నాయి. వీటితో పాటు మెట్‌ఫార్మిన్ (స్విస్ బయోటెక్ పేరెంటరల్స్), కాల్షియం 500 ఎంజీ, విటమిన్ డీ3 (లైఫ్ మాక్స్ క్యాన్సర్ లేబొరేటరీస్), పీఏఎన్ 40 (ఆల్కెమ్ ల్యాబ్స్) మాత్రలు సైతం ఈ జాబితాలో ఉన్నాయి. ఎక్కువ మంది వినియోగించే మందులు నాణ్యతా ప్రమాణాలు అందుకోవడంలో విఫలం కావడంపై సీడీఎస్‌సీవో ఆందోళన వ్యక్తం చేసింది. నాసిరకంగా ఉన్నట్లు గుర్తించిన ఈ 49 మందులను రీకాల్ చేసినట్లు పేర్కొంది. మరోవైపు వైద్యులు సాధారణంగా సూచించే కాల్షియం సప్లిమెంట్ షెల్కాల్ 500, యాంటాసిడ్ పీఏన్ డీ, ప్రోస్టేట్ చికిత్సలో ఉపయోగించే యూరిమాక్స్-డీ, ఆస్టియోపోరోసిస్ బాధితులకు ఇచ్చే డెకా-డ్యూరబోలిన్ 25 ఇంజెక్షన్ నకిలీవని సీడీఎస్‌సీవో నివేదిక తెలిపింది.

బాంబు బెదిరింపులకు వేదికగా నిలవొద్దు

- విమానాలకు బెదిరింపుల నేపథ్యంలో సోషల్ మీడియాకు కేంద్రం సూచనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 26: విమానాలకు బాంబు బెదిరింపులు తామరతంపరగా పెరిగిపోతున్న నేపథ్యంలో సోషల్ మీడియా కంపెనీలకు కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ శనివారం పలు సూచనలు జారీ చేసింది. నకిలీ బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తమ వేదికలపై నుంచి తొలగించాలని పేర్కొంది. షేరింగ్, ఫార్వర్డ్, రీపోస్ట్, రీట్వీట్ వంటి ఆప్షన్ల వల్ల కూడా బెదిరింపులు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, కాబట్టి, ఈ తరహా సమాచారం ఇతరులకు అందుబాటులో లేకుండా చూడాలని తెలిపింది. సదరు బెదిరింపులు భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి వ్యతిరేకమైనవని, సోషల్ మీడియా ద్వారా అటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐటీ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, తమ వద్ద ఉన్న సమాచారాన్ని వీలైనంత తొందరగా (72గంటల్లోపు) దర్యాప్తు సంస్థలకు అందజేయాలని పేర్కొంది. ఖాతాదారుల పోస్టులకు బాధ్యత వహించాల్సిన అవసరం లేకుండా సోషల్ మీడియా సంస్థలకు ఐటీ చట్టం, 2021 రక్షణ కల్పిస్తున్న విషయాన్ని కేంద్రం ఈ సూచనల్లో ప్రస్తావించింది. అయితే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తున్నప్పుడు ఈ రక్షణ ఉండదని, అటువంటప్పుడు ఆయా సంస్థలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 26: కేంద్ర ప్రభుత్వం నవంబరు 26న పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబరు 26 నాటికి 75 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ ఉమ్మడి సమావేశం జరగనుంది. ఈ మేరకు శనివారం కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబరు 26న పార్లమెంటులోని సంవిధాన్ సదన్‌లో ఉభయ సభల సంయుక్త సమావేశం జరగనుందని అధికారులు తెలిపారు. 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని ఆమోదించగా 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125వ పుట్టిన రోజు 2015 ఏప్రిల్ 14 సందర్భంగా నవంబరు 26ను జాతీయ న్యాయదినోత్సవంగా కేంద్రం ప్రకటించింది.

అక్రమంగా ఉంటున్న భారతీయుల్ని వెనక్కి పంపిన అమెరికా

వాషింగ్టన్, అక్టోబరు 26: అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను ఒక చార్టర్డ్ విమానంలో భారత్‌కు పంపినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) వెల్లడించింది. అక్టోబరు 22న వీరిని వెనక్కి పంపామని, భారత ప్రభుత్వ సహకారంతోనే ఇది జరిగిందని శుక్రవారం పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1.60 లక్షలకు పైగా అక్రమ వలసదారులను డీహెచ్‌ఎస్ వెనక్కి పంపింది. అక్రమ వలసదారులను వెనక్కి పంపడానికి 145కి పైగా దేశాలకు 495కి పైగా అంతర్జాతీయ విమానాలను వినియోగించింది. భారత్‌తోపాటు కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకిస్థాన్, చైనా వంటి దేశాలకు చెందిన వారిని డీహెచ్‌ఎస్ వెనక్కి పంపింది. అక్రమ వలసలను తగ్గించడానికి అమెరికా తీసుకుంటున్న చర్యల్లో ఇదీ ఒకటిగా ఉంది.

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా అనంత్‌నాథ్

న్యూఢిల్లీ, అక్టోబరు 26: ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కారవాన్ మ్యాగజీన్ ఎడిటర్ అనంత్‌నాథ్ వరుసగా రెండోసారి ఏకపక్షంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధానకార్యదర్శిగా మాజీ ఔట్‌లుక్ ఎడిటర్ రూబెన్ బెనర్జీ, ట్రెజరర్‌గా ది ట్రిబ్యూన్ మాజీ సీనియర్ అసోసియేట్ ఎడిటర్ కేవీ ప్రసాద్ ఎన్నికైనట్లు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

నేటి నుంచి విశాఖ-బెజవాడ ఎయిర్ ఇండియా సర్వీసులు

గోపాలపట్నం(విశాఖపట్నం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి విజయవాడకు ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.35 గంటలకు విశాఖ నుంచి బయలుదేరే విమానం 10.35 గంటలకు విజయవాడ(గన్నవరం)కు చేరుతుంది. తిరిగి విజయవాడలో రాత్రి 7.55 గంటలకు బయలుదేరి 9గంటలకు విశాఖ చేరుతుంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతుల మీదుగా ఆదివారం ఈ విమాన సర్వీస్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం విశాఖ నుంచి విజయవాడకు ఇండిగో సర్వీస్ నడుస్తోంది.

ఇజ్రాయెల్ ప్రతీకారం

- ఇరాన్‌పై 100 యుద్ధ విమానాలతో దాడి
- ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ ధ్వంసం
- ఇద్దరు సైనికులు మృతి.. ప్రతిదాడి తప్పదు: ఇరాన్

టెహ్రాన్, టెల్‌అవీవ్, బీరుట్, అక్టోబరు26: ఈ నెల ఒకటిన 180కిపైగా భారీ బాలిస్టిక్ క్షిపణులతో తమపై విరుచుకుపడిన ఇరాన్‌పై ఇజ్రాయెల్ 25 రోజుల తర్వాత ప్రతీకారం తీర్చుకుంది. సుమారు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్‌లోని 20 లక్ష్యాలపై వైమానిక దాడులతో విరుచుకుపడింది. శనివారం రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుఝామున 5 గంటల వరకూ మూడు గంటల పాటు వంద యుద్ధవిమానాలతో ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు ఇలం, ఖుజెస్థాన్‌లలోని క్షిపణి, డ్రోన్ తయారీ, ప్రయోగ కేంద్రాలు, సైనిక స్థావరాలపై అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమానాలతో బీభత్సం సృష్టించింది. తొలుత ఇరాన్ రాడార్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను దెబ్బతీసి ఆ తర్వాత క్షిపణి తయారీ కర్మాగారాలపై ఏకధాటిగా బాంబులు కురిపించిన విమానాలు తిరిగి సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి. అనంతరం ఇరాన్‌పై తమ 'డేస్ ఆఫ్ రెపెంటెన్స్' ఆపరేషన్ ముగిసిందని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డానియల్ హగరి ప్రకటించారు. ఇరాన్ ప్రతిదాడి చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రతిదాడి చేస్తామన్న ఇరాన్

గాఢనిద్రలో ఉండగా ఇజ్రాయెల్ ఒక్కసారిగా జరిపిన దాడులతో ఇరాన్ ఉలిక్కిపడింది. ఇంతలోనే తేరుకుని.. ఇజ్రాయెల్ వైమానిక దాడులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అడ్డుకోవడం వల్లే నష్టం పరిమిత స్థాయిలో జరిగిందని తెలిపింది. దాడుల్లో తమ దేశానికి చెందిన ఇద్దరు సైనికులు అమరులయ్యారని ఇరాన్ ప్రకటించింది. ఇజ్రాయెల్‌పై ప్రతిదాడి తప్పదని, సరైన సమయంలో దాడి చేస్తామని తెలిపింది. కాగా, ఇరాన్‌లోని చమురు క్షేత్రాలు, అణు స్థావరాల జోలికి పోకుండా ఇజ్రాయెల్ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కేవలం సైనిక స్థావరాలు, క్షిపణి, డ్రోన్ తయారీ కేంద్రాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించింది. అమెరికా ఎన్నికల వేళ కావడంతో ఇజ్రాయెల్ చమురు క్షేత్రాలను లక్ష్యం చేసుకోలేదని చెబుతున్నారు. చమురు క్షేత్రాలను లక్ష్యంచేసుకుంటే చమురు ధరలు పెరిగి అమెరికా, యూరప్ దేశాలకు సంకటంగా మారే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి ఇజ్రాయెల్ సంయమనం పాటించిందని చెబుతున్నారు.



ఇరాన్‌పై దాడిలో పాల్గొన్న ఇజ్రాయెల్ మహిళా పైలట్లు

'ఆపరేషన్ ఒపేరా'ను గుర్తు చేసిన తాజా దాడి

ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడిని ఇరాక్‌పై 1981లో జరిపిన 'ఆపరేషన్ ఒపేరా'ను గుర్తు చేసింది. 1981 జూన్ 7న ఇరాక్‌లో 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒసిరాక్ న్యూక్లియర్ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ ఎఫ్-16ఏ యుద్ధ విమానాలు ధ్వంసం చేశాయి. జూన్ 7న సాయంత్రం 4 గంటలకు ఆపరేషన్ ప్రారంభించి ఐదున్నరకల్లా టార్గెట్‌ను ధ్వంసం చేసి ఎదురుదాడిని తప్పించుకుని సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి. ఇరాన్‌పై తాజా దాడిని కూడా ఐడీఎఫ్ అత్యంత చాకచక్యంగా నిర్వహించింది. 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్ లక్ష్యాలపై ఎఫ్-35 యుద్ధ విమానాలు 3 గంటల పాటు బాంబుల వర్షం కురిపించి సురక్షితంగా ఇజ్రాయెల్ చేరుకున్నాయి.

ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి నేపథ్యంలో హెజ్‌బొల్లా కన్నెర్ర చేసింది. ఇజ్రాయెల్ హైఫా సమీపంలోని క్రయోట్‌లో ఉన్న జనావాసాలపై రాకెట్ల వర్షం కురిపించింది.

ఇజ్రాయెల్ దాడిపై దేశాల మిశ్రమ స్పందన

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడిపై ప్రపంచదేశాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. దాడిని కొన్ని దేశాలు ఖండించగా మరికొన్ని సమర్థించాయి.

అన్ని వర్గాలు సంయమనం పాటించాలి. చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కారానికి యత్నించాలి - భారత్

తమ పౌరుల ఆత్మరక్షణార్థం దాడి జరిపేందుకు ఇజ్రాయెల్‌కు హక్కు ఉంది. తాజా ఆపరేషన్‌లో మేము పాల్గొనలేదు. ఇరాన్ ప్రతిదాడి జరపకపోవడమే మంచిది - అమెరికా

ఇరాన్ దురాక్రమణనుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. ఇరాన్ ప్రతిదాడి ఆలోచనలు చేయవద్దు - బ్రిటన్

ఉద్రిక్తతలను పెంచే చర్యలు ఇరాన్ చేపట్టవద్దు. అప్పుడే మధ్యప్రాచ్యంలో శాంతియుత పరిస్థితులు నెలకొంటాయి - జర్మనీ

ఉద్రిక్తతలు పెరగకుండా అన్ని పక్షాలూ సంయమనం పాటించాలి - ఫ్రాన్స్

దాడి ఆందోళన కలిగిస్తోంది. అన్ని వర్గాలు సంయమనం పాటించాలి - రష్యా

మధ్య ప్రాచ్యంలో ఘర్షణలు తీవ్రతరం కావడాన్ని ఆమోదించబోం - సౌదీ అరేబియా

దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇజ్రాయెల్ చర్యలు ఈ ప్రాంతాన్ని యుద్ధంలోకి నెట్టేశాయి - టర్కీ

ఉద్రిక్తతలు తగ్గించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలి - ఈజిప్ట్

మధ్యప్రాచ్యంలో సుస్థిరత కోసం అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకోవాలి. గాజా, లెబనాన్‌లో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలి - ఇరాక్

తాజా ఉద్రిక్తతలకు ఇజ్రాయెలే కారణం. వెంటనే ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశం ఏర్పాటు చేసి మధ్యప్రాచ్యంలో శాంతి, సుస్థిరతల కోసం చర్యలు తీసుకోవాలి - పాకిస్థాన్

ఇజ్రాయెల్ దాడి ద్వారా ఇరాన్ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగింది - హమాస్

గళమెత్తిన బంగ్లా హిందువులు



చిట్టగాంగ్‌లో వేలాదిమందితో భారీ ర్యాలీ

- మైనారిటీల హక్కుల రక్షణకు ఆందోళన
- తాత్కాలిక ప్రభుత్వానికి 8 డిమాండ్లు

ఢాకా, అక్టోబరు 26: రాజకీయ సంక్షోభంతో అధికారం చేతులు మారిన బంగ్లాదేశ్‌లో.. హిందువులు గళమెత్తారు. షేక్ హసీనా ప్రభుత్వం అనంతరం తొలిసారి భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది శుక్ర, శనివారాల్లో చిట్టగాంగ్‌లోని వీధుల్లోకి వచ్చారు. మైనారిటీల హక్కులను పరిరక్షించాలని నినాదాలు చేశారు. సనాతన జాగరణ మంచ్ ఆధ్వర్యంలో సాగిన ఈ ఆందోళనలో మొహమ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వానికి తమ భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు సహా 8 డిమాండ్లు విధించారు. మైనారిటీలపై దాడులకు పాల్పడినవారిని త్వరగా శిక్షించేందుకు ట్రైబ్యునల్ ఏర్పాటు, అల్లర్ల బాధితులకు పరిహారం, పునరావాసం కల్పన, మైనారిటీల రక్షణ చట్టం, విద్యా సంస్థలు, వసతి గృహాల్లో మైనారిటీలు ప్రార్థనలు-పూజలు చేసుకునేందుకు ప్రత్యేక వసతులు, హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ సంక్షేమ ట్రస్ట్‌ల బలోపేతం బంగ్లా మైనారిటీల ప్రధాన డిమాండ్లు. దుర్గా పూజ ఉత్సవాలకు ఐదు రోజుల సెలవు, సంస్కృతం, పాలీ విద్యల బోర్డును ఆధునీకరించాలని కోరుతున్నారు. కాగా, ఆగస్టు 5న హసీనా ప్రభుత్వం పడిపోయాక ఆందోళనకారులు బంగ్లాదేశ్‌లోని మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. చర్యలు తీసుకుంటామని తాత్కాలిక ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఇటీవలి కాలంలో ఆస్తుల లూటీతో పాటు భౌతిక దాడులూ పెరిగిపోయాయి. కాగా, బంగ్లా హిందువులు అక్కడి నుంచి పారిపోకూడదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే అన్నారు. వారి రక్షణకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బంగ్లా హిందువుల భద్రతకు ఐక్యరాజ్యసమితి హామీ ఇవ్వాలని కోరారు



2గేట్లు ఎత్తి.. సాగర్ నుంచి

నీటి విడుదల

ఎగువ నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 64,755 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. శనివారం సాగర్ రెండు క్రస్ట్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. రెండు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16,096 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి మట్టం 589.50 అడుగులు ఉండగా, 310.55 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఔట్‌ఫ్లో 64,755 క్యూసెక్కులుగా ఉంది. కాగా, శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం జూరాల నుంచి 78,527, సుంకేసుల నుంచి 26,070 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.80 అడుగులకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,952 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,600 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. శుక్రవారం రెండు గేట్ల ద్వారా నీటిని కిందికి విడుదల చేయగా.. శనివారం మూసివేశారు.

- ఆంధ్రజ్యోతి, మాచర్ల రూరల్, శ్రీశైలం

ఏపీ బ్రాండ్ పునరుద్ధరణే లక్ష్యం!

నూతన పారిశ్రామిక విధానాల అమలుకు ఉత్తర్వులు

- విధివిధానాలతో విడివిడిగా జీవోలు విడుదల
- అర్హత ఉన్న పరిశ్రమలన్నింటికీ ప్రోత్సాహకాలు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన నూతన పారిశ్రామిక విధానాలను అమలులోకి తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పారిశ్రామిక అభివృద్ధి విధానం-4.0_ 2024-29, 'ఒక కుటుంబం -ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో తీసుకువచ్చిన ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌డెవలప్‌మెంట్ పాలసీ, అదేవిధంగా 'ప్లగ్ అండ్ ప్లే' ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో రాష్ట్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన ప్రైవేటు పారిశ్రామిక పార్కుల విధానం అమలుకు సంబంధించిన విధివిధానాలతో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ శనివారం విడివిడిగా జీవోలను విడుదల చేశారు. ప్రపంచ వేదికపై ఏపీ బ్రాండ్‌ను తిరిగి నిలబెట్టి, పారిశ్రామికంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూపొందించిన పారిశ్రామికాభివృద్ధి విధానం(4.0)లో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది. పెట్టుబడులపై మూలధన రాయితీ, పీఎల్ఐ సబ్సిడీపై టాప్ అప్ సబ్సిడీ, ఉపాధి రాయితీ, విద్యుత్ అదనపు సబ్సిడీలతోపాటు మొట్టమొదటిసారిగా డీకార్బనైజేషన్ సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించింది. ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌సీఐ)లో ప్రకటించిన 75 శాతం ప్రోత్సాహకాలు పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధిలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అనేక విధానపరమైన కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఐదు సంవత్సరాలు లేదా కొత్త పాలసీని ప్రకటించే వరకు అమలులో ఉంటుంది. అవసరమైతే ఈ పాలసీని ప్రభుత్వం పొడిగించవచ్చు. రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేవారితోపాటు ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలకు కూడా ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

'ప్లగ్ అండ్ ప్లే' పద్ధతిలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధి

ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో పారిశ్రామిక వసతులు కల్పించి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన పాలసీని అమలులోకి తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు పెరుగుతున్నందున ప్రైవేటు పారిశ్రామిక పార్కులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఒక ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించి అమలు చేయాలని నిర్ణయించింది. ఏపీఐఐసీ ద్వారా ప్రైవేటు పారిశ్రామిక పార్కులలో రోడ్లు, నీటి వసతితోపాటు మూలధన మద్దతు, డీశాలినేషన్ ప్లాంట్లు, ఇతర సామాజిక మౌలిక అవసరాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రైవేటు పారిశ్రామిక పార్కుల్లో పరిశ్రమలు నెలకొల్పేవారికి ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో కనీసం 50 శాతం రాయితీలు ప్రకటించింది.

ప్రైవేటు పారిశ్రామిక పార్కుల లక్ష్యాలు ఇవే..

- రాష్ట్రంలో ప్రైవేటు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు రైతుల నుంచి భూమిని పూలింగ్ చేయడానికి వీలుగా ఫ్రేమ్‌వర్క్ రూపకల్పన.
- 10 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు పక్కపక్కనే ఉన్న భూభాగంలో నానో లేదా చిన్న పార్కుల ఏర్పాటు.
- ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ప్రపంచస్థాయి పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసి ప్రారంభించడం.
- రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించి భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు పెంచడం.
- వివిధ రంగాలవారీగా నిర్దిష్టమైన పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి ప్రోత్సాహించడం.
- ప్రైవేటు పారిశ్రామిక పార్కులలో రహదారులు, డ్రైనేజీలు, వీధిలైట్లు, నీటివసతి, విద్యుత్, గ్యాస్, కమ్యూనికేషన్ సౌకర్యాల కల్పన.

'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త'

'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' నినాదంతో కొత్తగా తీసుకువచ్చిన ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ(4.0)ని అమలులోకి తీసుకువస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ఎంఈ రంగంలో పోటీతత్వాన్ని పెంచడం ద్వారా తయారీ రంగంలో గణనీయమైన వృద్ధిని సాధించడమే లక్ష్యంగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. మూలధన పెట్టుబడిపై 75 శాతం రాయితీలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అదనపు మూలధన రాయితీలను కల్పించనున్నట్లు తెలిపింది. అర్హత ఉన్న పరిశ్రమలన్నింటికీ ప్రోత్సాహకాలు అందించనున్నట్లు పేర్కొంది.

కేంద్ర జలశక్తి కమిటీలో ఎంపీ పుట్టా మహేశ్

న్యూఢిల్లీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా సీఆర్ పాటిల్ వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కేంద్రం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం కింద నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఎంపీ మహేశ్ ఇప్పటికే ఇంధన, సహజ వాయువు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

విదేశీ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఛైర్మన్‌గా ఏర్పాటైన 'కన్సల్టేషన్ కమిటీ ఫర్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్' సభ్యుడిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎంపికయ్యారు. ఈ కమిటీకి 10 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలు ఎంపికవగా.. వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి వేమిరెడ్డి ఒక్కరే స్థానం సంపాదించారు. విదేశాంగ విధానాలు, కార్యక్రమాలు, పథకాలపై ఈ కమిటీ చర్చిస్తుంది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి వేమిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తుల కోసం ఎంవోయూలా?

- జగన్ వైఖరి అందరికీ తెలిసిపోయింది: మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల కోసం కుటుంబంలో ఎంవోయూ జరగడం తాను గతంలో ఎన్నడూ చూడలేదు, వినలేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జగన్ వ్యవహారంతో ఇప్పుడు తనతోపాటు ప్రజలందరికీ తెలిసిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. 'జగన్ వైఖరి ప్రపంచానికి అర్థమైంది. మనది కుటుంబ వ్యవస్థను గౌరవించే దేశం. కానీ తల్లి, చెల్లిని కూడా ఆస్తి కోసం కోర్టుకు ఈడ్చిన వ్యక్తి జగన్ మాత్రమే' అని నిమ్మల ఎద్దేవా చేశారు. జైల్లో ఉన్న సమయంలో తల్లిని, చెల్లిని ఉపయోగించుకున్న జగన్.. ఇప్పుడు ధన దాహంతో ప్రవర్తిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వాళ్లు.. రాష్ట్రానికి ఏం చేస్తారని ప్రశ్నించారు. జగన్ బెయిల్ రద్దుకు కూటమి కుట్ర చేస్తోందని వైసీపీ అనడం సరికాదని, వారి కుటుంబ గొడవలతో తమకేం సంబంధం అన్నారు.

టెక్నాలజీ సహాయంతో మెరుగైన సేవలు అందించాలి

- దంత వైద్యులకు మంత్రి డోలా సూచన

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన సేవలు అందించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి దంత వైద్యులకు సూచించారు. శనివారం ఒంగోలులో నిర్వహించిన డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్(ఐడీఏ) 43వ రాష్ట్రస్థాయి సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

10 వేల కోట్లు కావాలి

- సాగునీటి ప్రాజెక్టులపై జల వనరుల శాఖ నివేదన
- ఇందులో రూ.2,309 కోట్లు బకాయిలకే
- ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వని జగన్
- ఐదేళ్లలో గేట్లకూ మొండిచేయి

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల కోసం సుమారు 10 వేల కోట్లు అవసరమని రాష్ట్ర జలవనరుల శాఖ అంచనా వేసింది. పోలవరం ప్రాజెక్టుకు రూ.4,000 కోట్లు, చింతలపూడి ఎత్తిపోతలు-350 కోట్లు, గోదావరి-పెన్నా అనుసంధానం-879 కోట్లు, వెలిగొండ-248 కోట్లు, హంద్రీ-నీవా-182 కోట్లు, వంశధార ఫేజ్2 స్టేజ్2-రూ.92 కోట్లు, విదేశీ సహాయ (ఈఏపీ) ప్రాజెక్టులు-259 కోట్లు, వరద నివారణ పనులు-రూ.1,000 కోట్లు, ఆపరేషన్-నిర్వహణకు రూ.574 కోట్లు.. మొత్తంగా 7,609.31 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించింది. అలాగే జగన్ పెట్టిపోయిన బకాయిలు రూ.2,309.31 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపింది. గత ఐదేళ్లలో ప్రాజెక్టు పనులకు నిధులివ్వని ఆయన.. చేసిన కొద్దిపాటి పనులకు కూడా బిల్లులు చెల్లించలేదు. పోలవరం ప్రాజెక్టుకు రూ.1,090 కోట్లు, చింతలపూడి-76.64 కోట్లు, వెలిగొండ-23.67 కోట్లు, హంద్రీ-నీవా-573 కోట్లు, వంశధార-36 కోట్లు, వంశధార ఫేజ్-2. స్టేజ్-2-రూ.36 కోట్లు, ఈఏపీ పథకాలు-139 కోట్లు, యాజమాన్య నిర్వహణకు రూ.410 కోట్లు బకాయిలు ఉన్నాయని జలవనరుల శాఖ తెలిపింది. జగన్ సర్కారు యాజమాన్య నిర్వహణ నిధులనూ బకాయిపెట్టింది. ఐదేళ్లలో కాలువలన్నీ పూడుకుపోయాయి. భారీ వర్షం కురిస్తే నదీ పరివాహక ప్రాంతాలన్నీ మునిగిపోతున్నాయి. పోలవరం విధ్వంసానికి గురైంది. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయింది. గేట్ల నిర్వహణకూ పైసా ఇవ్వలేదు. పులిచింతల గేట్లు తెగిపోయాయి. తుదకు శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు కూడా నిధులివ్వలేదు.

పీడిస్తున్న ఇంజనీర్ల కొరత

జలవనరుల శాఖను ప్రస్తుతం ఇంజనీర్ల కొరత పీడిస్తోంది. గత ఐదేళ్లలో జగన్ సర్కారు నియామకాలే చేపట్టలేదు. ఈ శాఖలో 3,425 పోస్టులకు అనుమతులు ఉన్నాయి. ఇందులో సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులు 2,569, సహాయ ఇంజనీర్ (ఏఈ) పోస్టులు 856 ఉన్నాయి. ప్రస్తుతం ఏఈఈ పోస్టులు 185, ఏఈ పోస్టులు 360 ఖాళీగా ఉన్నాయని బుధవారం నాటి సమీక్ష సందర్భంగా అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. తలో వంద చొప్పున భర్తీ చేసుకునేందుకు ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. కానీ ఆర్థిక శాఖ అడ్డుపుల్ల వేసింది. గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఇంజనీర్ల సేవలను వినియోగించుకోవాలని ఆయన సమక్షంలోనే ఉచిత సలహా ఇచ్చింది. ఇక రాష్ట్ర స్థాయిలో జల వనరుల శాఖకు దిశానిర్దేశం చేసే మూడు ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. ప్రాజెక్టుల ఈఎన్‌సీ, పరిపాలనా ఈఎన్‌సీ, కమిషనర్ ఆఫ్ టెండర్స్ బాధ్యతలు నిర్వర్తించే ఈఎన్‌సీ పోస్టులకు రెగ్యులర్ నియామకాల్లేవు. గతంలో రిటైరై ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఎం.వెంకటేశ్వరరావు, సీఈగా ఉన్న కుమార్, ఆచార్యులు ఈఎన్‌సీలుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే 19 చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులకు అనుమతి ఉంటే.. కేవలం రెండు పోస్టుల్లోనే రెగ్యులర్ సీఈలు ఉన్నారు. ఏకంగా 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్ఈ పోస్టులు 38, ఈఈ-126, డీఈఈ పోస్టులు 130 ఖాళీగా ఉన్నాయి. ఇన్ని పోస్టులను ఖాళీగా ఉంచి.. 45 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంపై సాగునీటి నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

నాపై అవినీతి ఆరోపణలపై విచారణ కోరా

- సీఎం చంద్రబాబు, పార్టీ పెద్దలకు లేఖ రాశా
- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి, తాను దోషిగా తెలితే చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు పార్టీ పెద్దలకు లేఖ రాశానని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మాచర్ల పట్టణంలోని 7వ వార్డులో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని మేజరు కాలువలకు ఐదేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో అడవులను తలపిస్తున్నాయని, చివరి భూములకు నీరు అందే పరిస్థితి లేదని అన్నారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేస్తున్నట్లు చెప్పారు. మీడియా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో మేజరు కాలువలను పరిశీలించి ఏవైనా లోటుపాట్లు ఉంటే తెలియజేస్తే సరిచేస్తామన్నారు. తనపై ఆరోపణల వెనుక ఎవరున్నా, సొంత పార్టీ వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పూర్తిస్థాయి విచారణ జరగాల్సిందేనని ఎమ్మెల్యే అన్నారు. తనపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టించిన వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జనవరి 5న విజయవాడలో హైందవ ధర్మ శంఖారావం: శివస్వామి

- ఆలయాలను దేవదాయ శాఖ పరిధి నుంచి తప్పించాలి

తుళ్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పరిధి నుంచి హిందూ దేవాలయాలను తప్పించేందుకు విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావానికి పిలుపునిచ్చింది. దీనిపై గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీఠాధిపతి శివస్వామితో పాటు పలు చోట్ల నుంచి వచ్చిన స్వామీజీలు పాల్గొన్నారు. ఇతర మతాలలో ఎలాగైతే స్వేచ్ఛగా దైవ కార్యక్రమాలు చేసుకుంటున్నారో ఆ విధంగానే చేసుకునే విధంగా దేశవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలను ధర్మ కమిటీలకు, ధార్మిక సంస్థలకు అప్పజెప్పాలని కోరారు. అందుకు జాతీయ స్థాయిలో హైందవ ధర్మ శంఖరావం విజయవాడలో జనవరి 5న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి సంఘాల వారు, స్వామీజీలు, పీఠాధిపతులు పాల్గొంటారని తెలిపారు.

రూ.1500 కోట్లకు కుచ్చుటోపీ!

- ధన్వంతరీ ఫౌండేషన్ బాధితుల ఫోరం

మంత్రాలయం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన ధన్వంతరీ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ పంతాంగి కమలాకర్‌శర్మ రూ.1500 కోట్లు కుచ్చుటోపీ పెట్టారని, తమకు న్యాయం చేయాలని ధన్వంతరీ ఫౌండేషన్ బాధితుల ఫోరం సభ్యులు కోరారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్ శర్మ, సభ్యులు శేషగిరిరావు, రంగారావు, రాజ్యలక్ష్మి విలేకరులతో మాట్లాడారు. 2004లో బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం హైదరాబాదుకు చెందిన ధన్వంతరీ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థను మరికొందరితో కలిసి కమలాకర్‌శర్మ ఏర్పాటు చేశారని చెప్పారు. ఇందులో దాదాపు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుకు చెందిన 400 మంది బ్రాహ్మణులను సభ్యులుగా చేర్చి 15 నుంచి 20 శాతం వడ్డీ ఇస్తామని ఆశ చూపి రూ.లక్ష నుంచి రూ.3 కోట్ల వరకు తీసుకున్నారని ఆరోపించారు. ఇచ్చిన రెండేళ్ల వరకు కొంతమందికి చెప్పిన ప్రకారం వడ్డీ ఇచ్చారన్నారు. అయితే 2023 నుంచి కమలాకర్ శర్మ తప్పించుకు తిరుగుతూ దాదాపు రూ.1,500 కోట్లు మోసం చేశారన్నారు. 2024లో ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం ఏర్పాటు చేసుకుని కమలాకర్‌శర్మ కోసం వెతుకుతున్నామని చెప్పారు.

ఆశ్వయుజ పౌర్ణమి మొదలుకొని దీపావళి తరువాత రెండు రోజుల వరకు గోండు గ్రామీణులు తమ తమ వెసులుబాటు, స్తోమత, ఉత్సాహాన్ని బట్టి ఐదు నుంచి పదిహేను రోజుల వరకు జరుపుకునే దండారి పండుగే గుస్సాడి నృత్యోత్సవాలు. ఈ పండుగ సందర్భంలోనే గోండులు తమ ఇళ్లను, తమను బాగా అలంకరించుకోవడం పరిపాటి. గోండుల అందాలను చూడాలన్నా, వారి గ్రామ సౌందర్యాలను చూడాలన్నా అందుకు దండారి పండుగ సమయమే సరైనది. ప్రకృతిలోని జీవ లయను అనుకరిస్తూ పరమేశ్వరునిపట్ల భక్తిపూర్వక ఆరాధనా భావాన్ని వ్యక్తం చేసే గుస్సాడి నృత్యాలు గోండుల సామూహిక జీవన సౌందర్యానికి ప్రతిబింబాలు.

ప్రకృతి, పరమేశ్వరుడు, గుస్సాడి నృత్య లయ

హిందువులు ఆశ్వయుజ మాసం (అక్టోబర్)లో దసరా, దీపావళి పండుగలను జరుపుకుంటే ఇవే పండుగలను గోండు గిరిజనులు 'దివాడి' మాసంలో జరుపుకుంటారు. హిందువుల పండుగలకు, గోండుల పండుగలకు మధ్య చాలా భిన్నత్వం ఉంది. హిందువుల దీపావళి పండుగలో భాగంగా మొదటి రోజు భోగి కాల్చడం, తరువాత రోజున నరక చతుర్దశి పేరున దీపాలు వెలిగించి, టపాసులు, బాణాసంచా కాల్చడం ప్రధాన అంశాలు కాగా... గోండులు దీపావళి పండుగ జరుపుకునే మాసానికే 'దివాడి' అని పేరు పెట్టుకొని భోగి, దివాడి, దివాడి అనంతర రోజులలో 'దండారి పండుగ' పేరిట 'గుస్సాడి నృత్యోత్సవాలు' జరుపుకుంటారు. గుస్సాడి నృత్యాలు తెలంగాణలో ఇంకా వైభవంగా వర్ధిల్లుతున్నాయి. తెలుగు ప్రజలు అందరూ, ముఖ్యంగా నర్తకులు ఆ వైభవ విశేషాలను, ప్రత్యేకతలను తెలుసుకోవడం చాల అవసరం.

దండారి పండుగను పద్ధతి ప్రకారమైతే ఐదు రోజులు జరుపుకుంటారు. మొదటి రోజైన భోగినాడు గుస్సాడీ నర్తకులు, వారి సహాయకులైన పోరిక్‌లు వేషధారణ చేసుకుంటారు. గుస్సాడీలు నటరాజ శివుడిలాగా, పోరిక్ (మగపిల్లలే ఆడపిల్లలుగా అభినయించడం)గా తయారవుతారు. వీరందరు నృత్యం చేయాలి కాబట్టి వారికి నృత్య పద్ధతులను (చాల్‌లు) సూచించే 'కోల వెహె' కూడా ఆ రోజే తయారవుతాడు. ఈయన మాత్రం తెల్లగుడ్డను తల చుట్టూ చుట్టుకొని వెనుక వైపు ముడి వేసుకుంటాడు.

వీరందరూ ఆ రోజు నుంచి స్నానం చేయకుండా పండుగ అయిపోయే వరకు నిష్ఠగా ఉండాలి. అలా ఉంటామని 'కుద్ద తిరివల్' పేరిట ప్రమాణం చేయాలి. అంటే... గోండు పటేల్ (తెగ పెద్ద) ఇంటి ముందర పందిరి కింద తవ్విన బద్ది (రంధ్రం)లో ఒకరి తరువాత ఒకరు తమ కుడి కాలు మడమ పెట్టి తమ చుట్టు తాము ఒకసారి తిరగాలి. అదొక విజయ ఘట్టం, పవిత్ర సూచన కాబట్టి ఇతర గోండులు కుద్ద తిరిగిన వారికి అభినందనలు తెలుపుతారు.

విశేషమేమిటంటే ఈ భోగి దినాన్ని మాత్రం ఒక్కో గోండు గ్రామవాసులు ఒక్కోలాగ నిర్ణయించుకుంటారు. అంటే అందరికీ భోగి ఒకే రోజు ఉండదు. ఎవరి అనుకూలతలను బట్టి వారు నిర్ణయించుకుంటారు. దండారి పండుగను జరిపే గ్రామాలు మరో గ్రామానికి ఆతిథ్యం ఇస్తారు, ఇంకో గ్రామానికి అతిథులుగా వెళ్తారు. మరి కొందరు గోండు గ్రామస్థులు గోదావరి ఒడ్డున ఉన్న పద్మల్పురి కాకో వంటి దేవతల దర్శనానికి వెళ్తారు. ఇలాంటి పలు అంశాలను దృష్టిలో పెట్టుకొని భోగి రోజును ఒక్కో గ్రామ వాసులు ఒక్కో రోజుగా నిర్ణయించుకుంటారు.

భోగినాడు గుస్సాడీలు, పోరిక్‌లు ధరించే ఆహార్యం, వాయిద్యాలను కలిపి 'ఏత్మసూర్' (ఆత్మ దైవం) పేరిట పూజించి, 'పాతి భోజనం' పేరిట ఒక పెద్ద తలె (ప్లేట్)లో గుస్సాడీలు, పోరిక్‌లు కలిసి 'సహ' విందు భోజనం చేసిన తరువాత అందరూ కలిసి రాత్రి వరకు ఉత్సాహంగా నృత్యం చేస్తారు. రెండవ రోజు నుంచి ఒక గ్రామ గుస్సాడీల బృందం తమను ఆహ్వానించిన ఆతిథ్య గ్రామానికి దండుగా వెళ్తారు. కాబట్టి ఈ పండుగను 'దండారి' అంటారు. గుస్సాడీలను పవిత్రులు, దైవ సమానులుగా భావిస్తారు కాబట్టి వారికి కావలసిన ఏర్పాట్లు చేయడానికి 'డియ్యూర్'లు అనే బృంద సభ్యులను నియమిస్తారు. వీరు దండారి ఊరికి వెళ్ళే ముందు కుద్దు తిరుగుతారు. అలా తిరిగిన తరువాత వీరు కూడా పండుగ ముగిసే వరకు స్నానం చేయకుండా నిష్ఠగా ఉండాలి. మగవారు దండారి పోవడం దీపావళికి ముందే జరగాలి.

ఈ పండుగలో నర్తించే 'డియ్యాన్'లు అనే స్త్రీలు మాత్రం దివాడికి ముందు కుద్దు తిరుగరాదు, దండారికి పోరాదు. దివాడి తెల్లారి కుద్దు తిరుగవచ్చు. నృత్యం చేయవచ్చు. అయితే ఈ స్త్రీలు కుద్దు తిరిగిన తరువాత దండారి పండుగ అయిపోయే వరకు స్నానం చేయకుండా నిష్ఠగా ఉండాలి. మధ్యలో బహిష్టు / ముట్టు అయినా కూడా స్నానం చేయకుండా అలాగే ఉండాలి.

ఒక రోజు ఒక గ్రామం వారు మరో గ్రామానికి వెళ్తే మరో రోజు ఇంకో గ్రామం వారిని అతిథులుగా తమ గ్రామానికి ఆహ్వానిస్తారు. డియ్యూర్‌లు అతిథులకు మర్యాదలు చేస్తారు.



భోజనాలు అయిన తరువాత అతిథులుగా వచ్చినవారు, ఆతిథ్యం ఇచ్చిన వారు అందరూ కలిసి రాత్రంతా గుస్సాడీ నృత్యం చేస్తారు. స్త్రీలు వలయాకారంలో 'డియాన్' నృత్యం చేస్తుండగా వారికి వెలుపల గుస్సాడీలు నర్తిస్తూ తిరుగుతుంటారు. నర్తకులు, ప్రత్యేకించి యువకులు అందరు తమ తమ నృత్య ప్రావీణ్యతలను ప్రదర్శిస్తారు. తద్వారా అతిథి గ్రామ అమ్మాయిల మనసును దోచుకోగలిగితే తదనంతరం వారి పెద్దలు వరసైనవారికి పెండ్లి చేస్తారు. అర్ధరాత్రి సమయానికి గుస్సాడీ నృత్యాలు బాగా ఊపందుకుంటాయి. సాధారణంగా పద్ధతి ప్రకారం నర్తించే గుస్సాడీలు అకస్మాత్తుగా ప్రేక్షకుల మధ్యలోకి దూసుకొచ్చి తమ చేతిలో ఉన్న 'రోకల్' అనే కట్టెతో పొడుస్తూ ప్రేక్షకులకు గిలిగింతలు కలిగిస్తారు. అలాంటి ఊహించని చర్యలకు కొందరు ప్రేక్షకులు భయపడడం కద్దు.

గుస్సాడీ నృత్యాన్ని మాత్రం ఒక క్రమ పద్ధతి ప్రకారమే ప్రదర్శిస్తారు. గుస్సాడీ నృత్యంలో 'ఏడుం చాల్' (ఏడు రకాల నృత్యాలు) ఉంటాయి. మొదటి నృత్యాన్ని 'సూర్ చాల్' అంటారు. అంటే ప్రారంభ (షురూ) నృత్యం అని. ముగ్గురు నలుగురు డప్పులను 'చుంచనకుం చుంచనకుం...' అంటూ మంద్ర గతిలో వాయిస్తుండగా గుస్సాడీలు రెండు మూడు వరుసలలో నిలబడి తమ చేతుల్లో 'గంగరాం సోట' (సన్నటి రోకలి కర్ర)ను ముందుకు, ఆ పక్కకు, ఈ పక్కకు చూపుతూ ఎగురుకుంటూ ముందుకు వస్తారు. ఇది నమస్కార పూర్వక నృత్యం.

'గుస్సాడి చాల్' అనే రెండవ నృత్యంలో 'డినడిడ్డనకనక డినడిడ్డనకనక...' అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా వరుసలుగా ఉన్న గుస్సాడీలు కొద్దిగా వంగి తమ కుడి చేతిలోని రోకల్‌ను, తమ కుడి కాలును ఒకేసారి అటూ ఇటూ మారుస్తూ నర్తిస్తారు. 'మహదేవన చాల్' అనే మూడవ నృత్యంలో 'జన్ జన్ జజ్జనక, జన్ జన్ జజ్జనక...' అనే డప్పు దరువుకు అనుగుణంగా నృత్యం చేస్తారు. సూర్ చాల్, గుస్సాడీ చాల్, మహదేవన చాల్ అనే ఈ మొదటి మూడు నృత్యాలు శివారాధన నృత్యాలు కాగా తరువాతి మూడు నృత్యాలు పశుపక్ష్యాదుల అనుకరణ నృత్యాలు.

నాల్గవ నృత్యమైన 'ఉరుం చాల్'లో గుస్సాడీలు ఉడుము ఆటను ప్రదర్శిస్తారు. ముందుగా డిప్సీలు తీస్తున్నట్లు అరచేతులను, కాళ్ళ మునివేళ్ళను భూమి మీద ఆనించి 'డడ్డనకుంఢం డడ్డన కుంఢం...' అనే డప్పు శబ్దాలకు స్పందిస్తూ అదే స్థితిలో పైకి ఎగిరి ఒకసారి తలను ఎడమ వైపు, మరోసారి కుడి వైపు తిప్పుతూ నర్తిస్తారు. ఈ నృత్యాన్ని ప్రదర్శించేందుకు గుస్సాడీలకు చాలా శక్తి, ప్రావీణ్యం ఉండాలి.'హెడ్డ్ చాల్' అనే ఐదవ రకపు నృత్యంలో గుస్సాడీలు వరుసల్లో నిల్చుని ఎడమ చంకలో రోకల్ పెట్టుకొని వంగి 'డంనకడంచిక డంనకడంచిక...' అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా ఎలుగుబంటి వలె ఎగురుతూ ముందుకు కదుల్తుంటారు. 'మల్సూరి చాల్' అనే ఆరవ రకపు నృత్యంలో వరుసల్లో నిల్చున్న గుస్సాడీలు తమ కుడిచేత రోకల్ పట్టుకుని కొద్దిగా వంగి 'రఘినకరధింకన రఘినకరధింకన...' అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా ఓసారి కుడి వైపునకు, మరోసారి ఎడమ వైపునకు 'నెమలి' వలె గెంతుతారు. 'స్కాక్రి చాల్' అనేది గుస్సాడీ నృత్యాల్లో ఏడవది, చివరిదీనూ. దీనికంటే ముందటి నృత్యాలలో క్రమంగా వేగాన్ని పెంచుకుంటూ వస్తారు. ఈ చివరి నృత్యంలో నృత్య వేగాన్ని పరాకాష్ఠకు చేరుస్తారు. వరుసల్లో నిల్చున్న గుస్సాడీలు కొంచెం వంగి రెండు చేతులతో రోకల్ పట్టుకొని దానిని ముందుకు చూపుతూ 'చుంచనక చుంచనక...' అనే డప్పు శబ్దాలు వేగంగా ధ్వనించగా వాటికి అనుగుణంగా అంతే వేగంగా తిరుగుతూ నర్తిస్తారు. అలా కొంతసేపు నర్తించిన తరువాత 'నకరనకర డంటనకర నకరనకర డంటనకర...' అనే డప్పు శబ్దాలకు అనుగుణంగా మరింత వేగంగా గొలుసు (ఇంగ్లీషు అక్షరం ఎస్) ఆకారంలో తిరుగుతూ నర్తిస్తూ చివరిగా వచ్చే పెద్ద 'ఢం' శబ్దానికి స్పందనగా పైకి ఎగిరి దూకి నృత్యాన్ని ఆపేస్తారు.

ఇలా దండారి పోయి, దండారిని ఆహ్వానించి అందరూ కలిసి ఆడుకున్న తరువాత, కొత్త గుస్సాడీలకు, పోరిక్‌లకు, డియ్యూర్‌లకు, డియాన్‌లకు నృత్యాలు నేర్పించిన తరువాత, సుమారుగా దివాడి తెల్లారి అందరూ కలిసి గోండు పటేల్ ఇంటికి, ఆ తరువాత గ్రామంలోని ప్రతి గోండు ఇంటింటికి వెళ్ళి మాన్ కోల (ఆహ్వానం), సార్ కోల (వీడ్కోలు) నృత్యాలు చేసి, మధ్య మధ్యలో ఇతర నృత్యాలు చేసి, ఏత్మసూర్ పేన్, జంగుబాయి పేన్, ఆకి పేన్, అవ్వల పేన్ మొదలైన దేవతలకు భక్తితో పాటలు పాడి హారతులిస్తూ ప్రతి ఇంటి నుంచి వడ్లను స్వీకరించి, వాటిలో కొన్నింటిని ఇచ్చినవారికే దేవుడి ప్రసాదంగా ఇస్తారు. ఈ కార్యక్రమాన్ని 'హారతులు జమచేయడం' అంటారు. చివరి ఐదవ రోజున 'కోలబోడి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ రోజు కూడా అందరూ మనస్ఫూర్తిగా ఆడుకున్న తరువాత ఏత్మసూర్ పేన్‌కు అర్పణగా కోడిని కోసి అందరూ మొక్కుకొని పండుగను ముగిస్తారు.

ఆశ్వయుజ పౌర్ణమి మొదలుకొని దీపావళి తరువాత రెండు రోజుల వరకు గోండు గ్రామీణులు తమ తమ వెసులుబాటు, స్తోమత, ఉత్సాహాన్ని బట్టి ఐదు నుంచి పదిహేను రోజుల వరకు దండారి పండుగను జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంలోనే గోండులు తమ ఇళ్లను, తమను బాగా అలంకరించుకుంటారు. కాబట్టి గోండుల అందాలను చూడాలన్నా, వారి గ్రామ సౌందర్యాలను చూడాలన్నా అందుకు దండారి పండుగ సమయమే సరైనది.

• డా. ద్యావనపల్లి సత్యనారాయణ

(ఈ వ్యాసరచనకు సహకరించిన సిడాం అర్జు మాస్టర్, కనక సుదర్శన్‌లకు కృతజ్ఞతలు)

అధునాతనం ఈ సనాతనం!

ఇప్పటి సంగతి తెలియదు కానీ, ఓ నలభై యాభై ఏళ్ల కిందట చాలా మంది యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ముఖ్యంగా తెలుగు ప్రొఫెసర్లు, సంప్రదాయవాదులుగానే ఉండేవాళ్లు. క్లాసుల్లో పాఠాలు కూడా అట్లాగే చెప్పేవాళ్లు. అటువంటి ఒక తెలుగు ఆచార్యుడు, ఏదో పాఠం చెబుతూ కారల్ మార్క్స్ పేరు ఎత్తుకున్నారు. ఆశ్చర్యకరంగా, ప్రశంసించడం మొదలు పెట్టారు. ఇంతకీ ఆయన మార్క్స్‌లో కనిపెట్టిన గొప్ప గుణం ఏమిటంటే, నూటాయాభై ఏళ్ల పాతవాడవడం. అంత పూర్వపు కాలంలోనే, అంత గొప్పగా చదువుకుని కొత్త సిద్ధాంతం చెప్పాడు అని మార్క్స్‌ను మెచ్చుకున్నారు. ఆ అధ్యాపకుడి తన్మయం, సిద్ధాంతం గురించి కాదు, మార్క్స్ ప్రాచీనత గురించి.

పాతకు ఎప్పుడూ అటువంటి ఫాలోయింగ్ ఉంటుంది. అట్లాగని, ఎప్పుడూ ఒకే 'పాత' ఉండదు. ఎప్పటికప్పుడు కొత్త 'పాత' కూడా ఏర్పడుతుంది. హాయిగా ఉండేదనిపించే గతం మీద మనిషికి బెంగగా ఉంటుంది. వర్తమానం మీద విసుగ్గా ఉంటుంది. గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్ అనాలనిపిస్తుంది. కొత్తొక వింత పాతొక రోత అని వెక్కిరించాలనిపిస్తుంది.

పాతను ప్రేమించాలంటే, గడచిన యుగాల గురించి, చరిత్ర గురించి పెద్దగా తెలియనక్కరలేదు. గతించిపోయిన విలువలు తిరిగి రావాలని ఉంటుంది కానీ, అలనాటి జీవనసరళి యథాతథంగా కావాలని అందరూ కోరుకోరు. ఆధునిక ప్రయాణసాధనాలూ, యంత్ర సదుపాయాలూ లేని కాలంలోకి వెళ్లాలంటే, విశ్వనాథ సత్యనారాయణకు కూడా విముఖతే ఉంటుంది. తంత్రిలో విద్యుత్ ప్రవహింపజేసిన మహాశక్తి ఏది వంటి ఎదురు ప్రశ్నలేవో వేశారు కానీ, ఆయన కరెంటును కాదనలేదు.

ఛాందసవాదుల్లో అతి కొద్దిమంది మాత్రమే అరచేతులు అడ్డుపెట్టి మార్పును ఆపాలని, గడియారాన్ని వెనక్కు తిప్పాలని గట్టిగా ప్రయత్నం చేస్తారు. అత్యధికులు మాత్రం, గతాన్ని ఒక భావనగా మార్చేసి, ఆరాధిస్తూ, ప్రచారం చేస్తూ, భౌతిక జీవితంలో వర్తమానపు పోకడలోనే వ్యవహరిస్తుంటారు. ఎవరి వల్ల సమాజానికి ఎంత నష్టం, ఎంత లాభం అన్నది ఆసక్తికరమైన చర్చ. కానీ, గతారాధకులందరినీ, ఛాందసులుగా లెక్కగడితే మాత్రం తప్పులో కాలువేసినట్టే.

సనాతనవాదం ఈ మధ్య చాలా వార్తలలోకి వచ్చింది. ఈ సనాతనం అంటే నికార్సయిన నిర్వచనం ఏమిటో ఎవరికీ తెలియదు. మార్పులేనిది, నిరంతరమైనది, శాశ్వతమైనది అని అర్థాలున్న 'సనాతనం', దేన్ని సూచిస్తున్నదన్న విషయంలో ఒక స్థిరమయిన ఏకాభిప్రాయం ఏర్పడలేదు. కానీ, సనాతనాన్ని విమర్శించేవారు మాత్రం, సనాతనులంటే, గతించిపోయిన చెడుగులను అన్నిటినీ తిరిగి తేవడానికి ప్రయత్నిస్తున్నవారిగా చిత్రిస్తున్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను, అంటరానితనాన్ని, సతీసహగమనాన్ని, బాల్యవివాహాలను తిరిగి సమాజంలోకి తేవాలనుకుంటున్నారా అని సనాతనవాదులను ప్రశ్నిస్తున్నారు.

సనాతనవాదులకు తామెందుకు సనాతనాన్ని సమర్థిస్తున్నదీ పెద్దగా తెలియదు. భారతదేశంలో హిందూ మతం ప్రాచీనమైనదని, ఆ మతధర్మం సహస్రాబ్దాల పరీక్షకు నిలిచిందని, దానికి ప్రమాదం వస్తే తాము నొచ్చుకుంటామని, ఆగ్రహిస్తామని సనాతనవాదులు చెబుతుంటారు. ఘర్షణాత్మక సంవాద సందర్భాల్లోనే వారికి సనాతనవాదం స్ఫురణకు రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణ సందర్భాలలో ఎవరూ సనాతనవాదాన్ని బోధించి, ప్రచారం చేయడం పెద్దగా చూడము. ఎందుకంటే, ఏయే అంశాలు సనాతనం అవుతాయో, హిందూమతం కీలకసారాంశం ఏమిటో చెప్పమంటే వారు సరైన సమాధానం ఇవ్వగలగడం కష్టమే. నిజానికి, ఒకే రకమైన సమాధానం ఇంకా రూపొందలేదు. ధర్మం అనే మాట వేదాల్లోనే ఉంది కానీ, 'సనాతన ధర్మ' అనే జంట పదాల ప్రయోగం బౌద్ధంలోనే మొదలు. బౌద్ధం ప్రకారం, సత్యమే సనాతనధర్మం. మహాభారతంలో అనేక చోట్ల సనాతన ధర్మం అనే మాటలు కనిపిస్తాయి. సత్యం అనే అర్థంతో పాటు, ఇంకా అనేక సందర్భాలలో వేరు వేరు అర్థాలలో ఆ ప్రయోగం చూడవచ్చు. వేరు వేరు సనాతన ధర్మాలున్నాయన్న ప్రస్తావన కూడా భారతం ఆదిపర్వంలో ఉన్నది.

ఏ సాంస్కృతిక జీవనంలో అయినా ఒక అంతస్సూత్రం ఉండవచ్చు. అనేక కాలాల గుండా కొనసాగే ఒక సారాంశ విలువ ఉండవచ్చు. ఆ అర్థంలో సనాతన ధర్మం అనే మాట వాడడంలో తప్పేమీ లేదు. కానీ, చారిత్రకంగా చూసినప్పుడు, ఇప్పుడు హిందూమతంగా పిలుస్తున్నది ఒకనాడు వైదిక ధర్మంగా, అనంతరం అనేక ఆరాధనాశాఖలుగా, భక్తిమార్గాలుగా కొనసాగి, వలసపాలనలో ఏకీకరణ చెందింది. బ్రిటిష్ హయాంలోనే, భారతదేశానికి ఒక ఉమ్మడిగతాన్ని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. ఆ ఉమ్మడి గతాన్ని సనాతన ధర్మం లేదా సనాతన సంస్కృతిగా పిలవడం మొదలయింది. ఈ చారిత్రక ప్రయాణాన్ని పక్కన బెడితే, ప్రస్తుతం సనాతన ధర్మం అనేది సాంస్కృతిక మత జాతీయవాదానికి పునాదిభావనగా పరిణమించింది. ఇతరాన్ని నిర్వచించడం ద్వారా తనను నిర్వచించుకుంటున్నప్పుడు, ఒక తన్మయ, సగర్వ భావం కలిగించగలిగే గతానికి చెంది ఉండడం ఒక అవసరం అవుతుంది. దానికేమీ ప్రత్యేక నిర్వచనాలుండవు. ప్రస్ఫుటంగా కనిపించే భిన్నత్వాన్ని కొనసాగించే ప్రేరణ ఇవ్వడమే ఈ భావన ప్రయోజనం. నిజానికి సనాతనవాదం పేరుతో ఒక సమూహాన్ని ఎవరూ సమీకరించలేదు కానీ, ఒక దశాబ్దంగా భారతదేశంలో ఉన్న ప్రత్యేక సాంస్కృతిక పరిస్థితుల్లో రూపొందిన తీవ్ర జాతీయవాదులను, వారి సానుభూతిపరులనే సనాతనవాదులుగా అంతా పరిగణిస్తున్నారు.



ప్రగతిశీలురు, హేతువాదులు పొరబడుతున్నట్టు, ఈ సనాతనవాదులు ఆధునికతకు, ఆధునిక జీవనసరళికి వ్యతిరేకులు కారు. నిజానికి ఈ సనాతన భావనే ఆధునికమైనది. సనాతనవాదులెవరూ తమ పిల్లలను ఆధునికవిద్యకు, విదేశీ ఉద్యోగాలకు ఎడం ఉంచడం లేదు. ఎవరూ సాంప్రదాయిక దుస్తులు మాత్రమే ధరించడం లేదు. ప్రత్యేక సందర్భాలలో తప్ప మతపరమైన చిహ్నాలు ధరించడం లేదు. మొత్తం సమాజంలో ఎంత మేరకు ఉన్నదో వారిలో అంత మాత్రమే కులతత్వం ఉన్నది. అయినా, వారిలో కూడా కులాంతర వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. దురాచారాల సంస్కరణకు వారు విముఖంగా లేరు. ఆధునిక శాస్త్రవిజ్ఞానం దాని మిత్రులకు ప్రయోజనం ఉన్నది కనుక, ఆ వివాదాన్ని కొనసాగిస్తూ పోయారు. అంతిమంగా అది భావాల, విలువల పోరాటంగా కంటె, ఒక రాజకీయ పోరాటంగా పరిణమించింది.

సనాతనవాదాన్ని వ్యతిరేకించాలనుకునే వివిధ సిద్ధాంతవాదులు ఎవరైనా, ఎదుటివారిని, వారి మొత్తం రాజకీయార్థిక, సాంస్కృతిక వర్తమాన విధానాలకు విమర్శించాలి తప్ప, వారేదో ఆదిమయుగంలోకి సమాజాన్ని నడిపించే వారన్నట్టు వాదనలు నిర్మించడం మానుకోవాలి. సనాతనవాదాన్ని గాఢంగా నమ్మడం, ఆధునిక జీవనంలోని ప్రగతిశీల మార్పులను మందగింపజేయడమో, నిరోధించడమో చేసేమాట నిజమే. మొత్తంగా సామాజిక, రాజకీయ ప్రయాణాన్ని గుణాత్మకంగా ప్రభావితం చేస్తుంది కూడా. అంతేతప్ప, అది తిరిగి అస్పృశ్యతను, రాచరికాన్ని తిరిగి తీసుకురాదు. అంతర్గత సంస్కరణలను కూడా అడ్డగించదు. అయితే, అమెరికాలో రిపబ్లికన్ల వలె ఒకటి రెండు అంశాల్లో సాంప్రదాయికతను ప్రతీకాత్మకంగా బలవంతంగా కొనసాగించవచ్చు. అన్ని రకాల ఆధునిక వ్యవస్థలను, శాస్త్ర ప్రగతిని అనుభవించే రిపబ్లికన్లు గర్భస్రావ హక్కు విషయంలో పట్టింపుగా ఉంటారు. అలాగే, ఇతరుల కంటె ఎక్కువ వర్ణవివక్ష చూపుతారు.

ఒక పరంపర నిరంతరాయంగా ఉంది అనుకోవచ్చును కానీ, అది ఏ మార్పూ లేకుండా యథాతథంగా కొనసాగుతూ వచ్చిందని చెప్పలేము. ప్రపంచంలో ఏ మతమూ మార్పులు లేకుండా సాగలేదు. ఏ సమాజమూ విలువలలో మార్పులు చేర్పులు లేకుండా ప్రయాణించలేదు. శాశ్వతమైన విలువ ఏదైనా ఉందంటే అది మార్పు మాత్రమే. ఒక సుస్థిర ప్రాచీన ధర్మం ఉన్నదనీ, దానికి తాము చెంది ఉన్నామని, దానిని కాపాడుకోవాలనీ భావించడం ఒక సాంస్కృతికరాజకీయ అవసరం. వర్తమానంలోని వాస్తవికతకు చెంది ఉండడంలోని అసౌకర్యాన్ని, పరాయితనాన్ని తొలగించగలిగితే, మనిషికి ఈ పారంపరిక అగత్యం ఉండకపోవచ్చు. అంతేకాదు, పరంపర ఏకైకం కాదు. గతం నుంచి కొనసాగింపు ఒకే కోవలో ఉండదు. వర్తమాన ప్రత్యామ్నాయాలు మాట్లాడేవారు, గతంలోని ప్రత్యామ్నాయాలను కూడా అన్వేషించాలి. ఆలింగనం చేసుకోవాలి. అనేక మార్గాల మధ్య స్పర్థ, ఘర్షణ సనాతన చరిత్రలో భాగమే.

> **ఏ సాంస్కృతిక జీవనంలో అయినా ఒక అంతస్సూత్రం ఉండవచ్చు. అనేక కాలాల గుండా కొనసాగే ఒక సారాంశ విలువ ఉండవచ్చు. ఆ అర్థంలో సనాతన ధర్మం అనే మాట వాడడంలో తప్పేమీ లేదు. కానీ, చారిత్రకంగా చూసినప్పుడు, ఇప్పుడు హిందూమతంగా పిలుస్తున్నది ఒకనాడు వైదిక ధర్మంగా, అనంతరం అనేక ఆరాధనాశాఖలుగా, భక్తిమార్గాలుగా కొనసాగి, వలసపాలనలో ఏకీకరణ చెందింది. బ్రిటిష్ హయాంలోనే, భారతదేశానికి ఒక ఉమ్మడిగతాన్ని నిర్మించవలసిన అవసరం ఏర్పడింది. ఆ ఉమ్మడి గతాన్ని సనాతన ధర్మం లేదా సనాతన సంస్కృతిగా పిలవడం మొదలయింది.**

వారు కూడా అధ్యయనం చేస్తున్నారు. ఆలోచనల్లో అపసవ్యత, అన్య మతస్థుల విషయంలో అసహనం పాలు ఎక్కువ ఉండవచ్చును కానీ, తక్కిన అన్ని విషయాల్లోనూ వారు సాధారణ ఆధునిక జీవనులే.

ఉదయనిధి స్టాలిన్ సనాతనవాదాన్ని నిర్మూలించాలన్నప్పుడు సంచలనం కలిగినమాట నిజమే కానీ, తమిళనాడు క్షేత్రంలో ఆ మాటకు ఉండే అర్థం, ప్రాసంగికత వేరు. బ్రాహ్మణాధిక్యానికి, ద్రావిడ వ్యతిరేకతకు గుర్తుగా సనాతనాన్ని ఉదయనిధి చూశారు. భారతీయ జనతాపార్టీ కానీ, దాని సహచర సాంస్కృతిక సంస్థలు కానీ ఆ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించాయి. కానీ, సనాతనవాదంలో సమర్థించవలసిన అంశాల గురించి వాదనలు చేయలేదు. ఉదయనిధి వంటి వారి వాదనలు, దాని ప్రతివాదనలు ప్రజలలో భావాల రీత్యా తీవ్ర విభజనను కలిగిస్తాయి, అందులో బీజేపీకి,

సనాతనవాదాన్ని రాజకీయంగా, సైద్ధాంతికంగా వ్యతిరేకించాలనుకునేవారు, ఆ పనిని తప్పుడు ప్రాతిపదికల మీద చేయకూడదు. ప్రత్యర్థుల ఆలోచనా విధానాన్ని, రంగం మీదకు వచ్చిన సాంస్కృతిక భావనలను డీకోడ్ చేయడంలో విఫలం కావడం యుద్ధరంగంలో ఒక బలహీనత.

▪ కె. శ్రీనివాస్

వారి చరిత్ర 'తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో'...

ఐరోపా సందర్శకులకు అనేక నగరాల్లో కథెడ్రల్స్, మ్యూజియంలతో పాటు తప్పకుండా చూడాల్సిన టూరిస్టు ఆకర్షణల్లో యూదులు నివసించిన కాలనీలు, వాళ్ళ ప్రార్థనా స్థలాలు, వారి స్మశానాలు ఉంటాయి. ముఖ్యంగా మధ్య యూరోప్ నగరాలయిన ప్రాగ్, బుడాపెస్ట్, వియెన్నా, జెర్మనీలోని పలు పట్టణాల్లో వాటిని సందర్శించటం అనేకమంది యూరోపియన్లకు, యూదులకు, ఇతర తెల్లజాతి ప్రజలకు దాదాపు ఒక పుణ్య కార్యం. ఐరోపా దేశాలు ప్రపంచవ్యాప్తంగా అనేక ఖండాల్లో జరిపిన లెక్కలేనన్ని హింసాకాండల్లో తాము యూదులపై జరిపిన నరమేధానికి చాలా ప్రత్యేక స్థానం ఇస్తారని వలస దేశాల నుండి వెళ్లే నల్లజాతి ప్రజలకి కొట్టొచ్చినట్టు అర్థమవుతుంది. వాటిని సందర్శించినప్పుడే పోలాండ్, ఆస్ట్రియా, హంగేరి, చెకోస్లోవేకియా లాంటి ఎన్నో దేశాలు తమ దగ్గరి యూదులను హిట్లర్‌కు అప్పగించి తమ చేతులకి మట్టి అంటకుండా అతని మారణహోమంలో తమ వంతు సహాయం చేశాయని, పారిశ్రామిక పద్ధతుల్లో నిర్వహించిన ఆ జాతి సంహారాన్ని సాధ్యమయినంత సులభతరం చేశాయని కూడా తెలుస్తుంది. కొంచెం లోతుకి వెళ్లి చూస్తే యూదుల పట్ల ద్వేషం అనేక శతాబ్దాలు యథేచ్ఛగా కొనసాగిందని మనకి అర్థమవుతుంది. హిట్లర్ పెద్ద ఎత్తున చేసాడు కాబట్టి ప్రపంచ చరిత్రలోకి ఎక్కింది తప్ప యూదులని వేధించటం అతడు కొత్తగా కనిపెట్టింది కాదని స్పష్టమవుతుంది.

> **ఐరోపా దేశాలలో ఒకప్పుడు యూదులు నివసించిన కాలనీలు, వాళ్ళ ప్రార్థనా స్థలాలు, వారి స్మశానాలు సైతం ప్రధాన పర్యాటక ఆకర్షణలుగా ఉన్నాయి. వాటిని సందర్శించటం అనేక మంది యూరోపియన్లకు, యూదులకు, ఇతర తెల్ల జాతి ప్రజలకు దాదాపు ఒక పుణ్య కార్యం! యూరోపియన్లు ప్రపంచ వ్యాప్తంగా జరిపిన లెక్కలేనన్ని హింసాకాండల్లో తాము యూదులపై జరిపిన నరమేధానికి చాలా ప్రత్యేక స్థానం ఇస్తారని వలస దేశాల నుండి వెళ్లే ప్రజలకి అర్థమవుతుంది.**



జర్మనీలోని తురింగియా రాష్ట్రంలో, బెర్లిన్‌కు సమీపంలో ఉన్న ఎర్ఫర్టు అనే చారిత్రక పట్టణంలో ఫెలోషిప్‌పై ఉండటానికొచ్చిన నాకు ఈ చరిత్ర గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి ఒక అవకాశం లభించింది. నేనుండే హాస్టల్ పక్కనే ఆల్ట్ సినగాగ్ యూరోపులోనే ఇప్పటికీ నిలిచి ఉన్న అత్యంత పురాతన యూదుల ప్రార్థనా స్థలం. 11వ శతాబ్దంలో దీన్ని నిర్మించారు అంటే అంతకు ముందు నుండే ఇక్కడ యూదు సమూహం ఉండేదని అర్థమవుతుంది. ఈ పట్టణం, మధ్య ఐరోపాలో మత పరంగా, వ్యాపార పరంగా ప్రాముఖ్యత కలిగి, స్వతంత్ర ప్రతిపత్తితో ఏ రాజ్యంలో భాగం కాకుండా ఉండేది కాబట్టి ఐరోపాలో అనేక కట్టుబాట్ల మధ్య బ్రతికిన యూదుల సమూహం తమ జీవనం కోసం ఇక్కడ స్థిరపడ్డానికి చాలాసార్లు ప్రయత్నించారు. జర్మనీలోని మొదటి విశ్వవిద్యాలయం 1300ల్లో ఈ పట్టణంలోనే ఏర్పాటయింది. ప్రధానంగా వివిధ చర్చిలలో సభ్యులయిన మగ విద్యార్థులు ఆ విశ్వవిద్యాలయంలో చదువుకునేవాళ్ళు. ప్రొటెస్టెంట్ సంస్కర్త మార్టిన్ లూథర్ ఇక్కడే చదివి చాలా కాలం ఈ పట్టణంలోనే నివసించారు. వివిధ చర్చీల్లో ఆయన ప్రబోధాలు చేసేవాడు. ఎర్ఫర్టు ప్రొటెస్టెంట్ సంస్కరణలో భాగమై క్రైస్తవ మత ప్రజాస్వామ్యీకరణ జరిగిన పట్టణాల్లో బహుశా ఒకటని చెప్పుకోవచ్చు.

మిగతా నగరాలతో పోలిస్తే ఇక్కడి యూదు సమూహం పెద్దదిగా ఉండేది. కొంత తక్కువ కట్టుబాట్లతో బ్రతికిందని అంటారు. వారి అవసరం పట్టణ వాసులకి ఉండటంతో కొన్నిసార్లు వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించి ఇక్కడ ఉండేలా చేశారు. అయితే ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే వాళ్ళు బ్రతకాలి. మిగతా చోట్ల కంటే భిన్నంగా ఇక్కడ నగరం మధ్యలో కొంత ప్రాంతాన్ని వీరికి కేటాయించారు. పరిశోధకులు కూడగట్టిన వివరాల ప్రకారం ఆ స్థలం చిన్నది. క్రైస్తవుల ఇళ్లతో పోలిస్తే యూదుల ఇళ్ళు చిన్నవిగా ఉండేవి. వాళ్ళు నగరంలో ఏ చేతి పని గిల్డ్‌ల్లో భాగం అవ్వటం నిషేధం. కేవలం అప్పులివ్వటం, ఫైనాన్స్ చేసుకోవటానికి మాత్రమే వారికి పర్మిషన్ వుండేది. అనేకసార్లు వాళ్ళని ప్రత్యేక బ్యాడ్జి పెట్టుకోవాలనే నిబంధన తెచ్చారు. యూదులపై ప్రత్యేక పన్నులు ఉండేవి. అప్పుడప్పుడు కొన్ని పనులు చేసుకునే వెసులుబాటు ఇచ్చేవాళ్ళు. ఇక్కడ ముద్రణ, మాంసం కోసి అమ్ముకోవటం, బేకర్లుగా కొంత మంది యూదులు పనిచేసుకుని సంపాదించుకోవచ్చని పర్మిట్ ఇచ్చారు. తమ మత ఆచారాల ప్రకారం ఒక జంతువు నుండి కోషెర్ మాంసం కోసుకున్న తర్వాత మిగిలిన మాంసాన్ని ప్రత్యేక స్థలాల్లో మాత్రమే అమ్మాలి. ఎర్ఫర్ట్‌లో వాళ్లకి కేటాయించిన ఒక చిన్న గల్లీని పరిశోధకులు గుర్తించారు. అయితే క్రైస్తవులు వాళ్ళని యూదులని గుర్తించే విధంగా ప్రత్యేక టోపీలు పెట్టుకుని ఆ మాంసం అమ్ముకోవాలనే నిబంధన ఉండింది. ఎప్పుడు ఎవరు తరుముతారో తెలియక తమ దగ్గరున్న ధనాన్ని భూమిలో దాచి పెట్టుకుంటే, అది ఈ మధ్యనే బయటపడింది. అనేక అందమైన ఆభరణాలు, వందలాది వెండి ఫ్రెంచి నాణాలు సినగాగ్‌లో భద్రపరిచిన ఈ ఎర్ఫర్టు నిధిలో భాగం.

వివిధ నిబంధనలు, వివక్షలు, కట్టుబాట్లతో పాటు యూదులను మూడుసార్లు ఇక్కడి నుండి వెళ్లగొట్టడం జరిగింది. 1221లో మొదటిసారి ఒక క్రైస్తవుణ్ణి చంపి రక్తం తాగారనే నెపంతో క్రూసేడర్లు దాడుల్లో 22 మంది చనిపోయారు. యూదు మతాన్ని వదిలి క్రైస్తవాన్ని తీసుకోవాలని తెచ్చిన ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది తమని తామే చంపుకున్నారు. 1349లో ప్లేగు వ్యాధి భయాలు ప్రబలిన సమయంలో యూదులే బావుల్లో విషం కలిపారని దానివల్లే ప్లేగు వ్యాధి ప్రబలుతోందని దాడి చేసినప్పుడు దాదాపు 900 మంది హతమయ్యారు. కొంత మంది సినగాగ్‌లో పోరాడుతూ చనిపోతే, మరికొంత మంది ఆత్మాహుతి చేసుకుని చనిపోయారు. 1450ల్లో ప్రొటెస్టెంట్ సంస్కరణ ఉద్యమం, దానికి వ్యతిరేక ఉద్యమం వల్ల యూదులపై వివక్ష, పన్నులు తీవ్రం చెయ్యటంతో పాటు, వారికి ఉండే ప్రత్యేక రక్షణని వెనక్కి తీసుకోవటంతో ఇక్కడి నుండి మళ్ళా అందరూ తూర్పు ఐరోపాకి, లేకుంటే గ్రామీణ ప్రాంతాలకి పారిపోయారు. మళ్ళా 300 ఏళ్ల తర్వాత 1800ల మొదట్లో, ఫ్రాన్సు ఈ నగరాన్ని ఆక్రమించుకున్నప్పుడు మాత్రమే తిరిగొచ్చారు. 1800 చివర్లో వాళ్లకి కొన్ని హక్కులు లభించాయి. అయితే హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత 1938లో ప్రార్థనా మందిరాన్ని ధ్వంసం చేసి దాన్ని ఒక సామాన్ల కొట్టుగా మార్చారు. 1940ల్లో తురింగియాలోని అన్ని ప్రాంతాల యూదులతో పాటు ఎర్ఫర్ట్ నుంచి కూడా 500 మంది యూదులను మృత్యు శిబిరాలకు పంపించారు.

క్రైస్తవులు ఎన్ని దాడులు చేసి ఎంత మంది యూదులను చంపినా సరే, వాళ్లకి ఏ శిక్షలు పడలేదు. ఇక్కడే కాదు, ఎక్కడా పడినట్లు దాఖలా లేదు. వారు యూదులకు బాకీలు ఉన్న అప్పులు అన్నీ మాఫీ చేసే వాళ్ళు, ఇరుగు పొరుగువాళ్ళు పారిపోయిన యూదుల ఇళ్ళూ సామాన్లూ నాశనం చేసింది చెయ్యగా, మిగిలింది దోచుకునేవాళ్ళు. అలా ఈ పురాతన ప్రార్థనా స్థలం దూలాలు, ముక్కలు కూడా ఎర్ఫర్ట్‌లోని ఇళ్లల్లో కనిపించాయి. అయితే, ఈ శతాబ్దాల హింసకి 1945లో హిట్లర్ చనిపోయిన తర్వాత మొదటిసారి విరామం లభించింది. ఇక్కడికి ఒక అతి చిన్న యూదు సమూహం తిరిగొచ్చి పడిపోయిన ప్రార్థనా స్థలాన్ని తిరిగి కట్టించి, సామాన్ల కొట్టుగా మార్చిన ఇంకొక ప్రార్థనా స్థలాన్ని మ్యూజియంగా మార్చి యునెస్కో మాన్యుమెంట్‌గా గుర్తింపు తెచ్చేందుకు అర్జీ పెట్టుకున్నారు. పరిశోధనకు డబ్బిచ్చి అన్ని విషయాలూ తవ్వి తీయించారు. వీటిల్లో అనేక డాక్యుమెంట్లు బయటపడ్డాయి. మధ్య ఐరోపాలోనే అతి పెద్ద సుందరమైన హీబ్రూ బైబిళ్ళు, పవిత్ర యూదు గ్రంథమైన తోరా అరుదయిన కాపీలు నాలుగయిదు బయటకొచ్చాయి.

ఇది కేవలం ఎర్ఫర్ట్ చరిత్ర మాత్రమే కాదు. దాదాపు తురింగియా రాష్ట్రంలో 60కి పైగా పట్టణాలు, గ్రామాల్లో పరిశోధకులు తవ్వి తీసిన వివరాలు చూస్తే అన్ని చోట్లా ఇదే చరిత్ర చిన్న చిన్న మార్పులతో మనకి కన్పిస్తుంది. అన్ని చోట్లా 200 ఏళ్ల నుండి 1000 ఏళ్ల పాటు యూదులు బ్రతికిన ఆనవాళ్లు ఉన్నాయి. ప్రతి చోటా క్రైస్తవ సమాజం వారిని అనేక కారణాలతో వేధించి, అనేకసార్లు బహిష్కరించి, తీవ్రమైన పన్నులు వేసి, వివక్ష చూపటం, అప్పుడప్పుడూ భౌతికంగా నిర్మూలించటం, తరిమేయటం ఇదే జరిగింది. అప్పిచ్చే వ్యాపారం చెయ్యటం వల్ల యూదులు వందల సార్లు తరమబడినా మళ్ళా నిలబడ్డారు కానీ ప్రధానంగా తమకంటూ ఒక చోటు లేకుండా శతాబ్దాల పాటు తిరిగారు. ఒక రాజ్యం బహిష్కరిస్తే ఇంకో చోటికి పారి పోవటం, పట్టణాలు బహిష్కరిస్తే గ్రామాలకి పారిపోవటం చేశారు. ఆస్తులు, ఇళ్లు, సమాధి స్థలాలు, విద్యాలయాలు, పవిత్ర గ్రంథాల ప్రతులు, ప్రార్థనా స్థలాలు అన్నింటినీ అనేకసార్లు పోగొట్టుకున్నారు. వాటిని క్రైస్తవ అధికారులు, పట్టణ అధికారులు, ఇరుగు పొరుగు వాళ్ళు స్వాహా చేసుకున్నారు. అనేకసార్లు నిందించబడ్డారు. ఆత్మహత్యలు చేసుకున్నారు. చివరికి హిట్లర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మృత్యు శిబిరాలకు లక్షల సంఖ్యలో పంపించబడ్డారు.


మధ్య ఐరోపాతో సహా అనేక ప్రాంతాల్లో కూడా ఇదే రకమైన చారిత్రక జ్ఞాపకాలు దొరుకుతాయి. ప్రాగ్, బుడాపెస్ట్, వియెన్నాలలో కొంత వెనకా ముందూ ఇదే పరిస్థితి ఉండేదని టూరిస్టు గైడ్లు మనకి చూపిస్తారు. ఎవరెవరు ఎక్కడెక్కడ నుండి ఎట్లా పారిపోయారు, ఎట్లా చంపబడ్డారో అనే సూక్ష్మ చరిత్రలు కూడా చాలా రాయబడి వున్నాయి. ప్రాగ్ నగరంలో కాఫ్కా నివసించిన చిన్న ఇల్లు, ఆ నగరంలో 500 గజాల స్థలంలో 10,000 మందికి పైగా సమాధులు, ఖాళీ అయిన ఇళ్ళు... ఇవన్నీ ఎన్నెన్నో విషాద చరిత్రలను జ్ఞాపకం చేస్తాయి. యూరోపు అంతా ఏదో విధంగా నిండిన ఈ జ్ఞాపక చిహ్నాలు చూసి, వాటి గురించి చదువుతున్నప్పుడు, తెలుసుకుంటున్నప్పుడు మనలో అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూదులకు సమాన హక్కులు ఇచ్చినా ఐరోపా నుండి వారు ఎందుకు వెళ్లిపోయారు? ప్రజాస్వామిక, ఉదారవాద జాతి రాజ్యాలుగా ప్రసిద్ధి పొందిన ఐరోపా దేశాలు, అమెరికా యూదులకు అటువంటి రక్షణ కల్పిస్తామనే భరోసా ఇచ్చి తమ సమాజాలలోనే వారిని ఎందుకు నిలుపుకోలేదు? అసలు యూదులు ఐరోపా నుండి వెళ్లిపోవటం అంటేనే ఐరోపా దేశాలన్నీ క్రైస్తవ రాజ్యాలని మళ్ళా నిరూపించటమే కదా? అన్నింటి కన్నా ముఖ్యంగా, ఐరోపాలోని తమ తోటి తెల్ల జాతి క్రైస్తవుల చేతుల్లో అమానుష హింస అనుభవించిన యూదులు తమని ఏ హింసకు గురిచెయ్యని, తమతో ఏ సంబంధం లేని అరబ్బు పాలస్తీనా ప్రజల పట్ల క్రూరమైన పీడకులుగా ఎట్లా మారారు?



> **ఐరోపాలో సర్వత్రా ఉన్న యూదుల జ్ఞాపక చిహ్నాలు చూసినప్పుడు మనలో అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. ప్రజాస్వామిక, ఉదారవాద జాతి రాజ్యాలుగా ప్రసిద్ధి పొందిన ఐరోపా దేశాలు సంపూర్ణ రక్షణ కల్పిస్తామనే భరోసా యూదులకు ఇచ్చి తమ సమాజాలలోనే వారిని ఎందుకు నిలుపుకోలేదు? అసలు యూదులు ఐరోపా నుండి వెళ్ళిపోవటం అంటేనే ఐరోపా దేశాలన్నీ క్రైస్తవ రాజ్యాలని మళ్ళా నిరూపించటమే కాదూ? తెల్ల జాతి క్రైస్తవుల చేతుల్లో అమానుష హింస అనుభవించిన యూదులు తమని ఏ హింసకు గురిచెయ్యని, అరబ్బు పాలస్తీనా ప్రజల పట్ల క్రూరమైన పీడకులుగా ఎట్లా మారారు?**

◆ ఎ.సునీత

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్-76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు-70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033.





అహో.. ఆక్టోపస్ కమాండో..



సూర్యాస్తమయం వేళ నవలంక

నవలోకం

ఆకట్టుకుంటున్న నాగాయలంకలోని నవలంక తీరం

- వరదల వల్ల ఏర్పడిన అద్భుత ఇసుక తిన్నెలు
- ఆశ్చర్యపరుస్తున్న సముద్రపు జీవుల ఆనవాళ్లు
- సుమనోహరంగా సూర్యకిరణాలు

8



దుర్గమ్మకు పుస్తక నీరాజనం

- కనకదుర్గ వైభవాన్ని అక్షరబద్ధం చేసిన దుర్గగుడి ఈవో రామారావు

6లో



ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసు కమాండోలు

సాయుధం.. ఆయుధం..

ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీస్ ఓపెన్ హౌస్‌కు విశేష స్పందన

ఉగ్రమూకల దాడులకు చాకచక్యంగా చెక్‌పెట్టే 'ఆక్టోపస్ శాట్ కాంబోట్ వింగ్'.. శత్రువులపై సునాయాసంగా దాడిచేసే డ్రోన్ 'ఆక్టోపస్ నేత్ర'.. బాంబులను సైతం తేలిగ్గా తీసిపడేసే 'ఆక్టోపస్ ఎమ్మార్వో' వంటివే కాకుండా.. ఏకే 47.. 9ఎంఎం కోల్ట్.. లేజర్ గన్.. బాంబు లాంచర్.. వంటి ఎంతో విలువైన ఆయుధ బాంఢాగారాన్ని ప్రజల ముందుంచారు నగర పోలీసులు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఏఆర్ గ్రౌండ్స్‌లో శనివారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. నిత్యం కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచే ఈ ఆయుధాలను ఒక్కసారిగా చూసి విద్యార్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయుధాల ప్రత్యేకతలు, విలువ అడిగి మరీ తెలుసుకున్నారు.

8

భారీగా బాణసంచా

జిల్లాలో దీపావళి సందడి మొదలైంది. రెండు నెలల కిందటే శివకాశి నుంచి భారీగా సరుకు దిగుమతి కాగా, గోడౌన్లలో ఉన్న బాణసంచాను వ్యాపారులు బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భారీ ట్రేడర్ల నుంచి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా, నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో స్టాళ్ల ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి.



గన్నవరంలో ఏర్పాటవుతున్న స్టాళ్లు

శివకాశి నుంచి జిల్లాకు దిగుమతైన సరుకు

నగర శివారుల్లోని గోడౌన్లలో నిల్వ

- ట్రేడర్ల నుంచి హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల కొనుగోళ్లు
- 16 మండల కేంద్రాల్లో ప్రైవేట్ స్టాళ్ల ఏర్పాటుకు అనుమతి
- నగరంలోని నాలుగు అర్బన్ మండలాల పరిధిలోనూ..
- జిల్లావ్యాప్తంగా మొదలైన దీపావళి హంగామా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దీపావళి సమీపిస్తుండటంతో జిల్లావ్యాప్తంగా బాణసంచా పెద్ద ఎత్తున దిగుమతైంది. హోల్‌సేల్, రిటైల్‌గా అమ్మకాలు సాగించటానికి వీలుగా వ్యాపారులు సరుకును సిద్ధం చేసుకుంటున్నారు.

మొదలైన కోలాహలం

జిల్లావ్యాప్తంగా 235కు పైగా లైసెన్స్‌డ్ బాణసంచా వ్యాపారులున్నారు. వీరంతా రెండు నెలల కిందటే శివకాశి నుంచి పెద్ద ఎత్తున సరుకు దిగుమతి చేసుకున్నారు. లైసెన్స్‌డ్ వ్యాపారుల్లో కూడా బడా ట్రేడర్లు, మధ్య, చిన్న వ్యాపారులున్నారు. వీరంతా కూడా ఈ దీపావళి వ్యాపారంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నెల రోజులుగా వాతావరణం బాగోకపోవటం, పండుగ ముందు తుఫాను హెచ్చరికలు రావటంతో నిన్న మొన్నటి వరకు వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. దానా తుఫాను పక్కకు తప్పుకోవడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని బడా ట్రేడర్లు ఇప్పటికే సరుకును గోడౌన్లలో సిద్ధం చేసుకున్నారు. ఒక్కొక్కరూ పదికి తగ్గకుండా గోడౌన్లలో నిల్వ చేశారు. వీటిలో 80 శాతం పైగా సరుకును ఇతర బాణసంచా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. విగిలిన 20 శాతం విక్రయించటానికి సిద్ధమవుతున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే స్టాళ్ల నిర్వాహకులు బాణసంచాను పెద్ద ఎత్తున ట్రేడర్ల నుంచి కొన్నారు. గొల్లపూడి, మైలవరం, తిరువూరు, గన్నవరం మండలాల పరిధిలో ఈ సరుకు సిద్ధంగా ఉంది. ఇక్కడి నుంచి హోల్‌సేల్‌గా ఇతర వ్యాపారులు కొంటున్నారు. రెవెన్యూ, పోలీసుల అనుమతితో శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేసే స్టాళ్లను పాడుకునే వారు కూడా పెద్ద ఎత్తున ట్రేడర్స్ నుంచి సరుకును దిగుమతి చేసుకుంటున్నారు.

బాణసంచా స్టాళ్లు ప్రారంభం

జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల్లో బాణసంచా స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతులతో కొంతమంది రిటైల్ వ్యాపారులు దుకాణాలకు అనుమతులు తీసుకుని, వాటికి వేలం నిర్వహించి వ్యాపారులకు కేటాయిస్తున్నారు. ఒక్కో స్టాల్ ఖరీదు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంది. నలుగురైదుగురు వ్యాపారులు కలిసి ఓ స్టాల్‌ను నిర్వహిస్తున్నారు. వ్యాపారం పూర్తయ్యాక వీరంతా లాభాలను పంచుకుంటారు. జిల్లావ్యాప్తంగా 16 మండల కేంద్రాల్లో స్టాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. అమ్మకాలకు తేదీని ప్రకటించగానే, ఒకరోజు ముందే సరుకును సిద్ధం చేసుకుంటారు. నగరంలోని నాలుగు అర్బన్ మండలాల పరిధిలో కూడా పెద్ద ఎత్తున స్టాళ్ల నిర్వహణకు అనుమతులు లభించాయి.

గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయాలు ప్రారంభం

గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో బాణసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడి హోల్‌సేల్ లైసెన్స్‌డ్ వ్యాపారులు పెద్ద ఎత్తున సరుకు దిగుమతి చేసుకున్నారు. వీరి నుంచి ప్రైవేట్ లైసెన్స్‌డ్ వ్యాపారులు కూడా కొన్నారు.

తప్పించుకుంటున్నారు

ఆటోనగర్ బస్ డిపో అధికారుల నిర్వాకం

- ఈనెల 22న డిపో గ్యారేజీలో మహిళా స్వీపర్ మృతి
- పార్కింగ్ డ్రైవర్ కాకుండా అప్రంటీస్‌తో బస్సును నడిపించటం వల్లే..
- తప్పును కప్పిపుచ్చుకునేందుకు విఫలయత్నాలు
- గ్యారేజీ లీడింగ్ హ్యాండ్‌పై నెపంమోపే ఆలోచనలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తప్పును కప్పి పుచ్చుకునేందుకు ఆటోనగర్ బస్ డిపో అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఈ డిపో పరిధిలో ఈనెల 22న జరిగిన ఘటనే ఇందుకు కారణం. ఆటోనగర్ బస్ డిపో గ్యారేజీలో బస్సులను పక్కన పెట్టడానికి హెవీ వెహికల్ లైసెన్స్‌డ్ డ్రైవర్ సేవలు అందించాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా చాలాకాలంగా ఒక అప్రంటీస్‌తో విధులు చేయిస్తున్నారు. ఈ నెల 22వ తేదీన బస్సును పక్కన పెట్టే క్రమంలో ఆ బస్సు ఓ అవుట్‌సోర్సింగ్ మహిళా స్వీపర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చనిపోయింది. అప్రంటీస్‌తో బస్సును పక్కన పెట్టించడం వెనుక ఆటోనగర్ బస్ డిపో మేనేజర్, సూపర్‌వైజర్ల పాత్ర ఉంది. గ్యారేజీలో హెవీ వెహికల్ లైసెన్స్ కలిగిన పార్కింగ్ డ్రైవర్‌ను ఇందుకు ఉపయోగించాలి. పార్కింగ్ డ్రైవర్ కావాలని స్థానికంగా ఉన్న లీడింగ్ హ్యాండ్ చాలాకాలంగా అడుగుతున్నా.. ఇప్పటి వరకు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తమ నిర్వాకం ఎక్కడ బయటపడుతుందోనన్న ఉద్దేశంతో లీడింగ్ హ్యాండ్‌ను బలి పశువును చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో కూడా పీఎన్‌బీఎస్‌లో బస్సు దూసుకెళ్లిన ఘటనలో ఇదే అధికారులు తీవ్ర ఆరోపణలను ఎదుర్కొన్నారు. బస్సులను బాగు చేయించమని చెప్పినా, లాగ్ బుక్‌లో రాసినా చర్యలు తీసుకోలేదు. బస్సు ప్రమాదం జరిగి అమాయకులు మృతిచెందితే తప్ప వాటి జోలికి వెళ్లలేదు. ఆ ఘటనలో కూడా తమ తప్పును అమాయకులపై వేసి చేతులు దులుపుకొన్నారు. తాజా ఘటనలో కూడా అదే చేస్తున్నారు. ఈ అంశంపై తక్షణం ఉన్నతాధికారులు విచారణ జరపాల్సిందిగా ఆటోనగర్ బస్ డిపో ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



8లో

శుభారంభం

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం భవానీపురం 40వ డివిజన్‌లో జరిగింది. ఎంపీ కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైద్యుల నిర్లక్ష్యం.. గుండెపోటుతో వ్యక్తి మృతి

సకాలంలో వైద్యం అందించని జీజీహెచ్ వైద్యులు



ఆది పవన్ కుమార్ మృతదేహం

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి ఓ నిండుప్రాణం బలైంది. సకాలంలో సేవలందించాల్సిన వైద్యులు సరిగ్గా పట్టించుకోకపోవడంతో ఓ కుటుంబం దిక్కులేనిదైంది. ఈ ఘటన శనివారం కొత్త ప్రభుత్వాసుపత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామర్రు మండలం జుజ్జవరం గ్రామానికి చెందిన గార్లపాటి ఆది పవన్‌కుమార్ (35) తాపీపని చేస్తుంటాడు. శుక్రవారం గ్రామంలో పనిలో నిమగ్నమైన అతనికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం శనివారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. తెల్లవారుజామున 4.30 గంటలకు జీజీహెచ్‌కు తీసుకురాగా, 5 గంటల వరకు వైద్యులు స్పందించలేదు. గుండెపోటుతో ఉన్న వ్యక్తికి ఎమర్జెన్సీలో వార్డులో కాకుండా జనరల్ వార్డులో చికిత్స చేశారని, అదేమని ప్రశ్నిస్తే ఐసీయు ఖాళీ లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని, ఫలితంగానే పవన్ చనిపోయాడని ఆరోపిస్తూ బంధువులు ఆందోళన చేశారు. ఆసుపత్రిలో బీపీ, ఆక్సిజన్ మిషన్లు కూడా పనిచేయడం లేదని వారు మండిపడ్డారు.



మద్యం.. అభ్యంతరం



చల్లపల్లి మండలం రామానగరంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తున్న మహిళలు

మద్యం షాపులు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలపై ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. చల్లపల్లి మండలం రామానగరం వరల కంపెనీ, డోకిపర్రులో వేంకటేశ్వరస్వామి గుడికి సమీపంలో, ముస్తాబాద ఫ్లైవోవర్ వద్ద మద్యం దుకాణాలు పెట్టవద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థినులు, భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం షాపుల ఏర్పాటు ప్రదేశాలపై ఫిర్యాదులు

- జేసీని కలిసి వినతి పత్రం ఇచ్చిన రామానగరం మహిళలు
- డోకిపర్రు, ముస్తాబాదలోనూ స్థలం మార్చాలని విజ్ఞప్తి
- గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో నూతన మద్యం షాపుల ఏర్పాటు అంశం చిలికి చిలికి గాలీవానగా మారుతోంది. గృహాల మధ్య షాపులు పెడుతున్నారని, తాగిన మైకంలో గొడవలు చేసే అవకాశం ఉందని, వేరేచోట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. చల్లపల్లి మండలం రామానగరం వరల కంపెనీ వద్ద గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారు. ఇది వివిధ ప్రాంతాలకు వెళ్లే కూడలి కావడంతో మహిళలు, విద్యార్థినులు ప్రయాణాల నిమిత్తం బస్సులు, వ్యాన్లు, ఆటోల కోసం ఇక్కడ ఎదురుచూస్తూ ఉంటారని, ఇటువంటి ప్రదేశంలో మద్యం షాపు వద్దని పలువురు మహిళలు కలెక్టరేట్‌కు వచ్చి జేసీకి ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులకు ఇక్కడ మద్యం దుకాణం వద్దని వినతిపత్రం ఇచ్చామని, వారు ఈ ప్రాంతాన్ని పరిశీలించి శ్మశానానికి సంబంధించిన స్థలంలో మద్యం షాపు ఏర్పాటు చేయకూడదని కూడా చెప్పారని మహిళలు అర్జీలో పేర్కొన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు వల్ల గొడవలు జరుగుతాయని, విద్యార్థినులు రాత్రిపూట ట్యూషన్‌కు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. మద్యం షాపు ఏర్పాటుపై అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో షాపు నిర్వాహకులు కొందరు స్థానికులను రెచ్చగొట్టి గొడవలు సృష్టించారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వేరే ప్రాంతంలో మద్యం దుకాణాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. మళ్లీ వరల కంపెనీ వద్దనే మద్యందుకాణం ఏర్పాటు చేస్తారనే ప్రచారం విస్తృతంగా జరుగుతుండటంతో స్థానికులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు.

గుడికి వచ్చే భక్తులకు ఇబ్బందే..

గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో

మిగతా 6లో..



మునేటిపై డ్రోన్‌తో పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కదిలిన యంత్రాంగం

ఉచితం మాటున అనుచితం కథనానికి స్పందన

6లో

- మూడు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ల ఏర్పాటు
- మునేరు, కృష్ణా రీచ్‌లలో డ్రోన్లతో తనిఖీలు

ఇంకా సాయమందలే

- కంచికచర్ల మండలంలోని తొవి ష్మది గ్రామాలకు విడుదల కాని వరద సాయం
- బాధితుల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

6లో

జగన్మాత కనకదుర్గమ్మ ప్రాశస్త్యాన్ని భక్తులకు మరింత చేరువ చేసేందుకు, అమ్మవారి ప్రాభవాన్ని వివరించే పలు పుస్తకాలను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ముద్రిస్తోంది. ఈవో కేఎస్ రామారావు పుస్తకాల ముద్రణకు చొరవ తీసుకున్నారు. పుస్తకాలను ప్రచురించడమే కాకుండా, తానే సంకలనకర్తగా వ్యవహరిస్తున్నారు. అమ్మవారి వైభవం పట్ల పూర్తి అవగాహన ఉన్న ఆయన, పండితులతో చర్చించి పలు పుస్తకాలను వెలువరించారు. ఇవీ పుస్తక విశేషాలు..

- (ఆంధ్రజ్యోతి-వన్‌టౌన్)



అమ్మవారి ప్రాభవాన్ని చాటిచెప్పే పుస్తకాలను చూపుతున్న ఈవో రామారావు, సృష్టి లక్ష్మీ సీతారామాంజనేయశర్మ

దుర్గమ్మకు పుస్తక నీరాజనం

కనకదుర్గ వైభవాన్ని అక్షరబద్ధం చేసిన దుర్గగుడి ఈవో రామారావు

కనకదుర్గా వైభవం

దుర్గమ్మ ప్రాభవాన్ని వివరిస్తూ రూపొందించిన పుస్తకమే కనకదుర్గా వైభవం. కనకదుర్గ ఉపాసనాపరమైన విషయాలను భక్తులకు అందించాలన్న తపనతో ఈవో కేఎస్ రామారావు ఈ పుస్తకాన్ని రూపొందించారు. సృష్టి లక్ష్మీ సీతారామంజనేయశర్మ పరిశోధన చేసి వెలిబుచ్చిన అనేక విషయాలను పొందుపరుస్తూ కనకదుర్గావైభవం పుస్తకాన్ని తీసుకొచ్చారు. ఈ పుస్తకంపై శృంగేరీ పీఠాధిపతి భారతీతీర్థ స్వామి, ఉత్తర పీఠాధిపతి విదుశేఖర భారతీ, విద్యానారాయణతీర్థులు, స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సర స్వతి తమ శ్రీముఖాలను అందించారు. ఈ గ్రంథ రచనలో కోడూరు వెం కట గోపాలకృష్ణశర్మ, హేమ దంపతులు, టి.లక్ష్మీనాగపద్మావతి, లక్ష్మీమాధురి, వేదాంత విశారద సృష్టి లక్ష్మీ ప్రసన్నాంజనేయశర్మ, సృష్టి లక్ష్మీనరసింహం, సృష్టి లక్ష్మీధరశర్మ, ఆవంచ శారదావరప్రసాద్ దంపతులు, మంతెన భారతి, మంతెన యోగేంద్ర కుమారవర్మ, దేవస్థానం వేద పండితులు విరూపాక్షం శ్యావాస్వ మహర్షి, శంకర శాండిల్య శర్మ తదితరులతో పాటు కనకదుర్గ ప్రభ సంపాదకుడు గంగాధర్, సైదా, తదితరులు గ్రంథ రచనలో తమ సహకారాలను అందించారు. ఇందులో కనకదుర్గాదేవికి సంబంధించిన అనేక స్తోత్రాలు, అష్టోత్తరాలు, శ్లోకాలు, దుర్గాసప్తశ్లోకి, ఇంకా అనేకమైన ఉపాసనా విధానానికి సంబంధించిన విశేషాలను రాసుకొచ్చారు. మహిషాసురమర్దినిగా అవతరించి దుర్గా రూపంలో భక్తులను కాపాడుతున్న దుర్గమ్మ గురించి ఈ పుస్తకంలో అనేకానేక అంశాలు ఉన్నాయి. శరన్నవరాత్రుల్లో అమ్మవారి అలంకారాలను ఇందులో స్పష్టంగా వివరించారు.

అపౌరుషేయమ్

అపౌరుషేయమ్ పేరిట సంస్కృతంలో శ్రీమహాభాగవతాన్ని రాశారు. దీనిని తెలుగులో నేషనల్ కల్చరల్ రీసెర్చ్ శిక్షణ కేంద్రం(ఎన్‌సీఆర్టీ) అనువదించింది. అమ్మవారి అనుగ్రహ చరిత్ర, అమ్మవారిని ఆరాధించే విధివిధానాలతో పాటు మొత్తం 81 అధ్యాయాలతో విశేష గ్రంథంగా ఇది భక్తులకు అపారమైన భక్తి సంపదను అందిస్తోంది. సతీవివాహ వర్ణన, నందికి ప్రథమాధిపత్యం ఇవ్వడం, దక్షయజ్ఞ విశేషాలు, దక్షయజ్ఞ ధ్వంస వర్ణన, కామరూపాది వర్ణన, గంగాదేవి ఆగమనం, గంగా వివాహం ఇలా అనేక అంశాలను ఇందులో జోడించారు.

శ్రీదుర్గా సౌందర్యలహరి

శ్రీదుర్గా సౌందర్యలహరిని మహా శతావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ గానం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నాగఫణిశర్మ గానం చేసిన సౌందర్యలహరిని దుర్గగుడి అధికారులు పుస్తకరూపంలో తీసుకొచ్చారు. దుర్గమ్మను తలచిన భక్తులు ఎవరూ దుర్గతుల పాలు కారంటూ ఆపదలో ఉన్నవారు అమ్మవారిని స్తుతిస్తే తక్షణమే ఆమె ఆపదలను తీరుస్తుందని పేర్కొంటూ ఈ శ్రీదుర్గా సౌందర్యలహరి పుస్తకం రూపొందింది.

సౌభాగ్యమస్తు..

సౌభాగ్యమస్తు పేరిట ఒక పుస్తకాన్ని తీసుకొచ్చారు. ప్రముఖ పండితుడు కన్నడ, ఆంధ్ర అవధాని అనంతపురానికి చెందిన జోస్యుల సదానంద శాస్త్రి ముందు మాట రాసిన ఈ పుస్తకంలో వివాహ వ్యవస్థను గురించి, దానిలో ఉండే అనేక ప్రక్రియల విశేషాలను వివరించారు. దుర్గగుడిలో అమ్మదర్శనం చేసుకున్న నూతన దంపతులకు అమ్మవారి పసుపు, కుంకుమలతోపాటు ఈ పుస్తకాన్ని ప్రసాదంగా అందిస్తున్నారు. వివాహ సమయంలో పురోహితులు చదివే మంత్రాలు, వివాహతంతులోని అర్థాన్ని అందరూ అర్థం చేసుకునేందుకు వీలుగా దీనిని రూపొందించారు. ఈవో రామారావు ఆలోచనలను సదానంద శాస్త్రి అక్షర రూపంలోకి తీసుకొచ్చారు. ఈ పుస్తకంలో వధూవరుల పెళ్లిచూపుల నుంచి కన్యావరణం, నిశ్చితార్థం, స్నాతకం, వివిధ హోమాలు, ఏడడుగులు వేయడం, అరుంధతిని చూపించటం, వాటి వెనుక ఉన్న పరమార్థాన్ని ఇందులో వివరించారు.

ఆలయ విజ్ఞానం

ఆలయ విజ్ఞానం పేరిట డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రాసిన పుస్తకాన్ని ఈ ఏడాదే ప్రథమ ముద్రణ చేశారు. దీనికి దేవస్థానం ప్రచురణ బాధ్యతలు నిర్వహించింది. ఆలయాలకు వెళ్లేటప్పుడు ఏం చేయాలి, భక్తులు ఎలా ఆలయానికి వెళ్లాలి..ఎందుకు వెళ్లాలి, ఆలయాల వైభవం ఏమిటి? ఆలయాల్లో వినియోగించే వివిధ వాహనాలు, వాటి విశేషాలు, ఆలయంలో ఉండే బలిపీఠం విశిష్టత, ఆలయ ప్రాంగణంలో ఉండే అనేకానేక విశేషాలను ఇందులో వివరించారు. ఆలయ ధ్వజస్తంభం, ముఖద్వారం, అంతరాలయం, ద్వారపాలకులు, గోపురాలు వంటి ఎన్నో విశేషాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

శ్రీదుర్గాభవానీ సంకీర్తన నామావళి

దుర్గానామ సంకీర్తన పరిశోధకుడు డాక్టర్ సృష్టి లక్ష్మీ సీతారామాంజనేయ శర్మ రూపొందించిన దుర్గాభవానీ సంకీర్త నామావళిని పుస్తక రూపంలో తీసుకొచ్చారు. గరికపాటి వెంకట ప్రభాకర్ స్వరకల్పన, గానం అందించారు. ప్రధాన సంపాదకుడిగా కేఎస్ రామారావు వ్యవహరించారు. 41 రోజుల పాటు భవానీదీక్షలు తీసుకునేవారు, భక్తుల అమ్మవారి కృపకు పాత్రులయ్యేందుకు జయదుర్గా జయజయ దుర్గా, జయభవానీ, జయజయ భవానీ అంటూ మొదలైన 41 నామావళిలను పుస్తకరూపంలో తీసుకొచ్చారు. దుర్గాదేవికి నమస్కరిస్తూ 41 రోజులపాటు 41 శ్లోకాలను కీర్తన చేయటం వల్ల మేలుకలుగుతుందని దీనిని పుస్తకం, సీడీ రూపంలోనూ తీసుకొచ్చారు. సంకీర్త నామావళిని గిరిప్రదక్షిణ సమయంలోనూ మైక్‌లో వినిపిస్తున్నారు.

శ్రీ కనకదుర్గా స్తోత్ర లహరి

శ్రీకనకదుర్గా స్తోత్ర లహరి గ్రంథాన్ని సృష్టి లక్ష్మీసీతారామాంజనేయ శర్మ సంకలనం చేయగా, రామారావు దానికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. పంచశక్తి స్వరూపాల్లో దుర్గాదేవికి అత్యంత ప్రాధాన్యం ఉందని వేదాలు, ఉపనిషత్తులు, ఆగమాలు, దుర్గాదేవి మహాత్యాన్ని అనేక సూక్తాలతో ప్రతిపాదించాయని పేర్కొన్నారు. వేద, ఉపనిషత్తు ఆగమసార భూతమైన దుర్గాదేవి తాత్విక స్వరూపాన్ని భగవంతుడైన వేదవ్యాసుడు దేవీభాగవతం, బ్రహ్మాండ పురాణం, స్కంద పురాణం, మార్కండేయ పురాణాల్లో జగన్మాత వైభవాన్ని వర్ణించారని పేర్కొన్నారు. అమ్మవారిని స్తోత్రప్రియ అంటారని ఎవరైతే స్తోత్రం చేస్తారో వారిపై అమ్మవారి వాత్సల్యం ఉంటుందని, అందుకే స్తోత్రాలను, వైభవోపేత సంఘటనలను అమ్మవారి వైశిష్ట్యాన్ని తెలియజేసేందుకు పుస్తకాలరూపంలో తెస్తున్నట్లు రామారావు చెప్పారు.

శ్రీశైలేశ తీర్థ సారం

శ్రీశైలేశ తీర్థసారం గ్రంథాన్ని 1957లో తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి సంస్కృతంలో రాశారు. తర్వాత శ్రిష్టి సీతారామాంజనేయ శర్మ తెలుగులో అనువదించారు. శివాలయాలు, కనకదుర్గమ్మ వైభవాలను పొందుపరిచారు. కృష్ణవేణి నదీమతల్లి విశేష పరమ పావన చరిత్రను రాశారు. ఇంద్రకీలాద్రికి ఆ పేరు ఎలా వచ్చింది? పురాణ విశేషాలు, దుర్గమ్మ గుడిలో శరన్నవరాత్రి ఉత్సవాలు, దుర్గా ఉపాసనలతో పాటు నవదుర్గా స్వరూపిణి కనకదుర్గాదేవి అంటూ నవదుర్గల వైభవం, ప్రాభవంపై ఈ పుస్తకంలో రాశారు.

ఇప్పటికీ సాయమందలే!

- కంచికచర్ల మండలంలోని తొమ్మిది గ్రామాలకు విడుదల కాని వరద సాయం
- బాధితుల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

మండలంలో కృష్ణానది వరద ముంపు గ్రామాల బాధితులకు ఇంకా ప్రభుత్వ సాయమందలేదు. అధికారులు తొమ్మిది గ్రామాల్లో రీ ఎన్యూమరేషన్ చేసి, నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. అయినప్పటికీ ప్రభుత్వ సాయం రాకపోవటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల మండలంలో కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాలు ఒకవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద ముంపునకు గురయ్యాయి. గ్రామాలు ద్వీపాలుగా మారాయి. కిలోమీటర్ల దూరం వరద పోటెత్తడంతో అధికారులు పడవల ద్వారానే ముంపు గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లోని పలు ఇళ్లల్లోకి రెండు నుంచి ఐదు అడుగుల మేర వరద నీరు చేరింది. బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లి అప్పట్లో తలదాచుకున్నారు. ధాన్యం తో పాటు తిండిగింజలు, గృహోపకరణాలు, విలువైన వస్తువులను నష్ట పోయారు. పక్కనే ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లోని బాధితులకు ఒక్కో ఇంటికి రూ.25 వేల వంతున ప్రభుత్వం సాయమందించింది. పక్క మండలంలో అంది తమకు సాయమందకపోవడంతో బాధితుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. రీఎన్యూమరేషన్ జరిగి నెల కావస్తున్నప్పటికీ సాయం రాకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెవిటికల్లుకు చెందిన పలువురు మహిళలు గురువారం కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సాయం అందించాలంటూ నినాదాలు చేశారు.

రీ ఎన్యూమరేషన్ చేసి నెల కావస్తున్నా..

బాధితులకు జరిగిన అన్యాయం గురించి 'మాకు సాయం చేయరా?' అంటూ సెప్టెంబరు 27న ఆంధ్రజ్యోతిలో కథనం రావటంతో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పందించారు. అప్పటి కలెక్టర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారయంత్రాంగంలో కదలిక వచ్చింది. 28వ తేదీ నుంచి తొమ్మిది గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రీ ఎన్యూమరేషన్ చేశారు. గ్రామాలవారీగా వరద ముంపు బాధితుల జాబితాలను తయా రుచేసి, ఉన్నతాధికారులకు నివేదించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం సాయం విడుదల కాలేదు.

సీఎంకు విన్నవించిన బాధితులు

చెవిటికల్లుకు చెందిన కొంత మంది మహిళలు శనివారం ప్రజాదర్బార్‌లో విన్నవించేందుకు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. వరద సాయం అందలేదని వివరిస్తూ..సీఎంకు విజ్ఞాపన పత్రం అంద జేశారు. సమస్యను పరిష్కరించి, న్యాయం చేస్తానని సీఎం హామీ ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు.



కాపీలను దహనం చేస్తున్న సీపీఎం నేతలు

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

- సీపీఎం రాష్ట్ర నేతలు బాబూరావు, కాశీనాథ్

ధర్నాచౌక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పిందని సీపీఎం రాష్ట్ర నేతలు విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ పాపాలను ప్రజల పాలిట శాపాలుగా కూటమి ప్రభుత్వం మారుస్తోందని మండిపడ్డారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. విద్యుత్ సర్దుబాటును నిరసిస్తూ ధర్నాచౌక్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6072 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు సీహెచ్.బాబురావు, దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 4నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని ధ్వజమెత్తారు. పార్టీ నేతలు బోయి సత్యబాబు, బి.రమణరావు, పి.కృష్ణ, కే.దుర్గారావు, టి.ప్రవీణ్ పాల్గొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



నందిగామలో మునేటిని తనిఖీ చేస్తున్న సీఐ ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి

కదిలిన యంత్రాంగం

- ఉచితం మాటున అనుచితం కథనానికి స్పందన
- మూడు టాస్క్‌ఫోర్స్ టీమ్‌ల ఏర్పాటు
- మునేరు, కృష్ణా రీచ్‌లలో డ్రోన్లతో తనిఖీలు

(ఆంధ్రజ్యోతి-నందిగామ, కంచికచర్ల, పెనుగంచిప్రోలు)

అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఇసుక దందాపై ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'ఉచితం మాటున అనుచితం' కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. కృష్ణా, మునేరు నదుల నుంచి నిత్యం వంద లారీలకు పైగా ఇసుకను టీడీపీ నాయకులు తరలిస్తున్నారని, రెవెన్యూ, పోలీస్ అధికారులపై అధికార దర్పం ప్రదర్శిస్తూ అనధికార రవాణా చేస్తున్నారని ఆధారాలతో ప్రచురించడంతో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు విజయవాడలో అత్యవసర సమీక్ష నిర్వహించారు. మూడు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటుచేశారు. నందిగామ, కంచికచర్ల, పెనుగంచిప్రోలు మండలాల్లోని మునేరు, కృష్ణా నదులపై డ్రోన్ల సహకారంతో తనిఖీలు చేశారు. ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లున్న ప్రాంతాలు, డంప్‌లను గాలించారు.

డ్రోన్ల విహారంతో అక్రమార్కుల్లో కలవరం

ఇసుక రీచ్‌ల వద్ద శనివారం డ్రోన్ల ఆకస్మిక విహారం కలకలరం రేపింది. టాస్క్‌ఫోర్స్ సీఐ ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఎనిమిది మంది సభ్యుల బృందం మునేటిపై నందిగామ, కంచల, పెండ్యాల, వేములపల్లి, కృష్ణానదిపై మోగులూరు, మున్నలూరు గ్రామాల్లో డ్రోన్‌తో తనిఖీలు చేశారు. ఎస్బీ సీఐ సతీష్ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ బృందం పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల్లో తనిఖీలు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమణ ఆధ్వర్యంలోని మరో బృందం లింగాల వద్ద మునేటి పరివాహక ప్రాంతంతో పాటు కృష్ణానదిపై ముక్త్యాల తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఒక్కసారిగా డ్రోన్లు, పోలీసుల హడావుడితో అక్రమార్కుల్లో కలవరం మొదలైంది. అప్రమత్తమైన అక్రమార్కులు తమ అనుయాయులను డ్రోన్ సర్వే జరుగుతున్న ప్రాంతాలకు పంపి, అక్కడి సమాచారం తమ వద్దకు తెప్పించుకున్నారని తెలిసింది.

దందా తీరిది..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుంచి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల టీడీపీ నాయకులు అనధికార మైనింగ్‌కు తెరలేపారు. మునేరు, కృష్ణానదులతో పాటు గత ప్రభుత్వ హయాంలోని డంప్‌లను కూడా దోచేశారు. కీసర, మోగలూరు డంప్‌ల నుంచి కోట్లాది రూపాయల విలువైన ఇసుకను దోచారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దోపిడీ జరిగినట్లు నిర్ధారించి కొద్దిరోజుల క్రితం ఆరెండు డంప్‌లను సీజ్ చేశారు. అయినా అధికారం చేతుల్లో ఉండగా అధికారులు తమనేమి చేస్తారని షాడో నేత దోపిడీని కొనసాగించారు. రాత్రివేళల్లో నిత్యం వందలాది లారీల ద్వారా ఇసుకను తరలించారు. సీజ్ చేసిన ఇసుకను కూడా ఊడ్చేశారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా స్పందించలేని స్థితిలో అధికారులు ఉండిపోయారు. షాడో ఎమ్మెల్యేకు ఎదురు చెప్పే ధైర్యం లేక చేష్టలుడిగి చూస్తుండిపోయారు.

సీఎం హెచ్చరించినా ఆగలేదు

ఇసుక అక్రమ రవాణాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమీక్షలో ఇసుక దందాలు సహించబోనని ఎమ్మెల్యేలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. సీఎం హెచ్చరించినా కంచికచర్ల మండలంలో ఒక్క రోజు కూడా ఇసుక అనధికార రవాణా ఆగలేదు. పెండ్యాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ముఖ్యమంత్రి హెచ్చరికలనే లెక్కచేయని అక్రమార్కులు టాస్క్‌ఫోర్స్‌లను, డ్రోన్లను లెక్క చేస్తారా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

200 లారీల లోడింగ్‌కు సన్నాహాలు

శుక్రవారం రాత్రి రెండు వందల లారీలకు ఎస్కవేటర్ల సాయంతో ఇసుకను లోడింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక్కో లారీకి సైజు మేరకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ధర నిర్ణయించారు. ఇసుక లోడింగ్ జరుగుతున్న సమయంలో కంచికచర్ల స్టేషన్‌కు చెందిన ఆరుగురు కానిస్టేబుళ్లు అక్కడికి వెళ్లారు. వారు అక్కడ ఉండగానే ముప్పై వాహనాలకు లోడింగ్ చేసి బయటకు పంపినట్లు తెలిసింది. అక్రమార్కులు అధికార పార్టీ నాయకులు కావడంతో పోలీసులు మిన్నకుండి పోవాల్సి వచ్చింది. ఈతరుణంలో విజయవాడ నుంచి టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు బయలుదేరినట్లు సమాచారం రావడంతో అక్కడి నుంచి జారుకున్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గంలోనూ..

శనగపాడు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, ముక్త్యాల రీచ్‌ల నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. తెలంగాణ సరిహద్దున ఉన్న అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాల నుంచి మధిర, ఖమ్మం ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. పెద్దల కనుసన్నలలో జరిగే ఈ ఇసుక దందాను టాస్క్‌ఫోర్స్ ఏమేరకు కట్టడి చేయగలదో వేచిచూడాలి.

ముస్లిం మైనార్టీల ఉనికిని

దెబ్బతీసేందుకే వక్ఫ్ సవరణ చట్టం

- ఎంఏఏ అధ్యక్షుడు మొహమ్మద్ జవహర్ అలీ



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నేతలు

ధర్నాచౌక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్నామని ఇటీవల ముస్లిం మైనార్టీలపై దాడులు చేయడం వారి ఉనికిని దెబ్బతీయాలని చూస్తున్నారని ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ జవహర్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా గాంధీనగర్‌లోని ఐలాపురం హోటల్‌లో ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ (ఎంఏఏ) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపాలని తీర్మానించారు. నవంబర్ 3న జమాతే ఇస్లాం ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మతీన్, ఖలీలుల్లాహ్, మాజీ ఎమ్మెల్సీ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే గఫూర్, జమాత్ సంఘాలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు, లే అవుట్ల

అనుమతుల జారీ నిలిపివేత

- 4వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం లేదు
- సర్వర్, డేటా మైగ్రేషన్ కారణంగా తాత్కాలిక ఇబ్బందులు తప్పవు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: భవన నిర్మాణాలు, లే అవుట్లకు అనుమతుల పోర్టల్ సేవలను తాత్కాలికంగా కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్ నిలిపేసింది. పట్టణాభివృద్ధి సంస్థలు, కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో భవన నిర్మాణాలకు చెందిన అనుమతుల కోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవడం శనివారం వీలు పడలేదు. దీంతో భవన నిర్మాణదారులు ఆందోళన చెందారు. దీనిపై కంట్రీ అండ్ ప్లానింగ్ విభాగం తాత్కాలికంగా పోర్టల్ సేవలను నిలిపేసినట్టు ప్రకటించింది. పోర్టల్ సర్వర్, డేటా మైగ్రేషన్‌కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థ సర్వర్, ఆ సంస్థ దగ్గరుండే డేటాను ప్రభుత్వ సర్వర్, డేటా సెంటర్‌కు మార్చేందుకు చర్యలు చేపట్టింది. అందుకే ప్రస్తుత పోర్టల్‌ను తాత్కాలికంగా నిలిపేశారు. నవంబరు 4 వరకు అంటే 9 రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉండవు. ప్రస్తుతం భవనాలు, లే అవుట్ల అనుమతులకు డీపీఎంఎస్ వెబ్‌పోర్టల్ ద్వారా జారీ చేస్తున్నారు. ఈ పోర్టల్ సర్వర్, డేటా అంతా ప్రైవేటు సంస్థ అమెజాన్ వెబ్ సర్వీస్‌లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఈ పోర్టల్‌ను స్టేట్ డేటా సెంటర్ నుంచి నిర్వహించాలని నిర్ణయించింది.

మద్యం.. అభ్యంతరం

(5వ పేజీ తరువాయి)

వెంకటేశ్వరస్వామి గుడికి సమీపంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాన్ని నడిపారు. గతంలో ఈ మద్యం దుకాణం కారణంగా గుడికి వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బందుల పాలయ్యారు. మళ్లీ అక్కడే ప్రైవేటు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో స్థానికులు మద్యం దుకాణాన్ని గుడికి దూరంగా ఏర్పాటు చేయించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడి పినచోట మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మీకు ఇబ్బంది ఏమిటని ప్రశ్నిస్తూ అక్కడే మద్యం దుకాణం పెట్టే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రయాణికులతో గొడవలు

గన్నవరం మండలం ముస్తాబాద ఫ్లై ఓవర్‌కు దిగువ ప్రాంతంలో మద్యం దుకాణం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు బోర్డు పెట్టారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిపేవారు. ఇక్కడ మద్యం మత్తులో మందుబాబులు దారిన పోయే వారితో గొడవలకు దిగి వీరంగం సృష్టించేవారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ మద్య దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దని స్థానికులు కృష్ణా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరావు దృష్టికి తీసుకువెళితే షాపు ఏర్పాటు చేయకుండానే మీకెందుకు తొందరంటూ ఆయన ఎదురు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

షాపులకు దరఖాస్తులు తీసుకునే సమయంలోనే వసూళ్లు ?

జిల్లాలోని 123 మద్యం దుకాణాలకు 2,942 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తులకు సంబంధించిన వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని ఎక్సైజ్ స్టేషన్‌లలో ఒక్కో దరఖాస్తుకు రూ.5 వేల చొప్పున వసూలు చేశారని దరఖాస్తులు సమర్పించిన వారు చెప్పకనే చెబుతున్నారు. మద్యం దరఖాస్తులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మేం చూసుకుంటామని చెప్పి ఈ నగదు వసూలు చేశారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. అయితే ఎక్సైజ్ అధికారులు ఇక్కడో నీతిని పాటించారు. ఒక దరఖాస్తుదారుడు ఒకటికి మించి షాపులకు దరఖాస్తు చేసుకుంటే, ఒక దరఖాస్తునకు మాత్రమే నగదు తీసుకుని మిగిలిన వాటికి మినహాయింపు ఇచ్చారని మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసిన సిండికేట్ లీడర్లు చెప్పడం గమనార్హం. ఈ నెలాఖరుకు మద్యం దుకాణాలకు పూర్తిస్థాయి లైసెన్సులు మంజూరు చేస్తారని, అప్పటికి ఎక్సైజ్ అధికారులు ఎలాంటి ఇండెంట్‌లు పెడతారోనని మద్యం షాపులు దక్కించుకున్న వారు హైరానా పడుతున్నారు.

మార్క్‌ఫెడ్ రుణానికి

ప్రభుత్వ గ్యారెంటీ

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ మార్కె టింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ అవసరాలకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి రూ.1,800కోట్లు రుణం తీసుకునేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం గ్యా రెంటీ ఇచ్చింది. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసిం ది. ఇప్పటికే రూ.3,200కోట్ల రుణానికి అను మతి ఇచ్చిన ప్రభుత్వం.. తాజాగా మరో రూ. 1,800కోట్లు రుణం పొందేందుకు గ్యారెంటీ ఇచ్చింది. ధాన్యం అమ్మిన రైతులకు ఈ నిధు లతో సొమ్ము చెల్లించనున్నారు. రాష్ట్రంలో ధాన్యం సేకరించే పౌరసరఫరాల సంస్థకు మార్క్‌ఫెడ్ అదనపు సేకరణ ఏజెన్సీగా పని చేస్తోంది.

ఏఈవోల స్థాయి

తగ్గించొద్దు

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) స్థాయిని తగ్గించవద్దని ఏపీ ఏఈవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణు మాధవరావు కోరారు. హేతుబద్ధీకరణ పేరు తో రికార్డు అసిస్టెంట్ స్థాయి గల గ్రామ వ్యవసాయ సహాయకులు, సూపరింటెండెం ట్ స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ విస్త రణ అధికారులు ఒకే కేడర్ పనిచేసేలా వ్యవ సాయ శాఖ చర్యలు చేపట్టడం సరికాద న్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల్లో పని చేస్తున్న గ్రామస్థాయి సహాయకులను రైతు సేవా కేంద్రాల్లో నియమించాలని ప్రభుత్వా నికి సూచించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

రొమ్ము కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

మొగల్రాజపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల కేన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందని ప్రముఖ కేన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ కేవీ రంగనాథ్ చెప్పారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మా కళాశాలలో శనివారం ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌సీజీ కేన్సర్ సెంటర్ సహకారంతో రొమ్ము కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొమ్ము కేన్సర్ సోకిందో లేదో ఇంటి వద్దే తెలుసుకునే విధానాన్ని వివరించారు. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం వల్ల నయం చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, డాక్టర్ ఘంటా విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యయుతంగా నడిచేది టీడీపీనే

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



కొప్పుల శ్రీనివాస చౌదరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రాణిగారితోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య యుతంగా నడిచే ఏకైక పార్టీ టీడీపీ అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. రాణిగారితోట 17,18 డివిజన్లలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు వైసీపీ నాయకుడు కొప్పుల శ్రీనివాస్ చౌదరి టీడీపీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతి సంవత్సరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేది ఒక్క టీడీపీయే అని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం తర్వాత కింది స్థాయి నుంచి పార్టీ నాయకుడిని ఎన్నుకుంటామని తెలిపారు. కొప్పూరి శ్రీనివాస చౌదరి టీడీపీలోకి రావడం చాలా ఆనందంగా ఉందని, ఆయన సేవలు పార్టీకి ఎంతో అవసరం అని అన్నారు. హత్యలు చేయించే మనస్తత్వం చంద్రబాబుకు లేదని, రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనే ఉంటుందని అన్నారు. అటువంటి మంచి మనిషి, నాయకుని వద్ద ఎమ్మెల్యేగా పనిచేయడం తన అదృష్టం అని అన్నారు. విజయవాడ, గుంటూరు నగరాలను కలిపి మహానగరంగా తీర్చిదిద్దుతామని, అమరావతి నగరం అభివృద్ధి చెందితే ముందుగా అభివృద్ధి చెందేది రాణిగారితోట అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ శ్రీను, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, పీరుబాబు, ముని పోలిపల్లి, పల్లా సాగర్, ఆదిబాబు పాల్గొన్నారు.

'చలో అమరావతి సచివాలయం' విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణస్వరూప్

ధర్నాచౌక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా డిసెంబరు 19న నిర్వహించే 'చలో అమరావతి సచివాలయం'లో దళితులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు, ఎస్సీఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేషనల్ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. కార్యక్రమ కరపత్రాన్ని స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు చేస్తే ప్రభుత్వంపై సామాజిక తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీకే బాబు, జాతీయ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మాదే సుజాత, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండి ఈశ్వర్, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ ఆవులు ప్రవీణ్, డీబీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ సమాజానికి అన్యాయం చేసేందుకే వర్గీకరణ

- అఖిల భారత మాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ధర్నాచౌక్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కృత్రిమమైందని, రాజకీయంగా ప్రయోజనం పొందాలని కేంద్రం కుట్ర పన్నిందని అఖిల భారత మాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ ఆరోపించారు. జేఏసీ ఆధ్వర్యంలో వర్గీకరణ చిచ్చు- దళితుల ప్రత్యేక హక్కులపై నిర్వహించే బహిరంగ సభల వాల్‌పోస్టర్‌ను గాంధీనగర్‌లోని ఐలాపురం హోటల్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు వర్గీకరణ పై ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధం, అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడవటమేనన్నారు. ఎస్సీ సమాజానికి అన్యాయం చేసేందుకే వర్గీకరణ కుట్ర పన్నారన్నారు. నవంబరు 26న భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా వర్గీకరణ ఉద్యమ బలాన్ని ప్రభుత్వానికి, రాజకీయ నేతలకు చూపిస్తామన్నారు. మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్‌కుమార్, మాల మహానాడు సంఘాల ప్రతినిధులు అన్నవరపు కిషోర్, పంతగాని రమేష్, తుమ్మల ఫ్రాన్సిస్, దాసి జయప్రకాష్ కెనడీ పాల్గొన్నారు.

నలంద కాలేజీలో విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రోగ్రామ్

లబ్బీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నలంద కళాశాలలో శనివారం బజాజ్ ఫిన్‌సర్వ్ సీపీబీఎఫ్‌ఐ సర్టిఫికెట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ తెలిపారు. విద్యార్థులకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేలా 100 గంటల ప్రోగ్రామ్‌తో పాటు ఇంటర్వ్యూ స్కిల్స్ పెంపొందేలా మాక్ ఇంటర్వ్యూ నిర్వహించామని తెలిపారు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా వివిధ నైపుణ్యాలను పెంపొందించేలా ఈ ప్రోగ్రామ్ నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశామని, అర్హత సాధించిన విద్యార్థులకు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సెక్టార్లకు సంబంధించి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. తమ కళాశాలలో 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, మేనేజ్‌మెంట్ హెచ్‌వోడీ వై.శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఉన్నా...ఎండలోనే నిరీక్షణ

- బెంజిసర్కిల్ వద్ద ఎత్తులో నిర్మాణం
- మెట్ల సదుపాయం లేక ప్రయాణికుల ఇబ్బందులు



ఎండలో రోడ్డు మీద నిలబడిన ప్రయాణికులు

(పటమట, ఆంధ్రజ్యోతి)

అది బెంజిసర్కిల్ వద్ద పేరెన్నికగన్న పెద్దబస్టాప్. అక్కడ ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించారు. కానీ ఆ బస్‌షెల్టర్ ప్రయాణికులకు ఉపయోగపడేది మాత్రం శూన్యం. ఈ బస్టాప్ నుంచి మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, ఉయ్యూరు, అవనిగడ్డ, చల్లపల్లి, భీమవరం వైపు వెళ్లే బస్సులు, పోరంకి, పెనమలూరు, కంకిపాడు వెళ్లే సిటీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో కార్పొరేట్ కళాశాలల విద్యార్థులు ఈ బస్టాప్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యమున్న ఈ బస్టాప్‌లో నిర్మించిన బస్‌షెల్టర్‌లోకి వెళ్లడానికి సరైన మెట్ల సదుపాయం లేదు. బస్టాప్ రోడ్డు నుంచి బస్‌షెల్టర్ ఎక్కువ ఎత్తులో ఉండటంతో వృద్ధులు, మహిళలు పైకి ఎక్కలేక ఎండకు, వానకు తడుస్తూ బస్‌షెల్టర్ బయటే నిలబడుతున్నారు. అందంగా తీర్చిదిద్దిన బస్‌షెల్టర్ ఉన్నా ఎవరికీ ఉపయోగపడటం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బస్‌షెల్టర్‌లోకి వెళ్లటానికి మెట్లు లేదా ర్యాంపు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆరో డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యువనేత గద్దె క్రాంతి కుమార్

భారతీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అన్ని వేళలా కార్యకర్తలకు అండగా వుంటుందని రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్, టీడీపీ యువనేత గద్దె క్రాంతి కుమార్ అన్నారు. తూర్పు పరిధి 6వ డివిజన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ టీడీపీని మరింత బలోపేతంగా చేయటమే లక్ష్యంగా తెలుగు తమ్ముళ్లు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. గతంలో రూ.2లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గుమ్మడి గురుప్రసాద్, డివిజన్ నాయకులు పి. మోహన్‌రావు, అమీర్నేని కరుణ, వడ్డేపల్లి కేశవ్, నూతక్కి బ్రహ్మం సీర ప్రసాద్, మోకార గురునాథం, పటాన్ మదర్ బి, తదితరులు పాల్గొన్నారు.



చిన్నపిల్లల్లో డయేరియాను నిర్లక్ష్యం చేయెుద్దు

చిన్నపిల్లల వైద్య నిపుణులు రాజా



మాట్లాడుతున్న డాక్టర్ రాజా

పటమట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):

చిన్నపిల్లల్లో నీళ్ల వీరేచనాలను ఎట్టి పరిస్థితుల్లోనే నిర్లక్ష్యం చేయకూడదని ప్రముఖ చిన్నపిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ కె. రాజా పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో పిల్లల్లో నీళ్ల విరేచనాలు అనే అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఓరల్ డీ హైడ్రేషన్ థెరపీ చిన్న పిల్లలను నీళ్ల విరేచనాలను నుంచి చక్కగా రక్షిస్తుందన్నారు. పిల్లలకు రోజు మొత్తంలో మూడుసార్లు కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనం అయితే డయేరియా లేదా అతిసార అయి ఉంటుందన్నారు. నీళ్ల విరేచనాలు సాధారణంగా తల్లి అపరిశుభ్రత వల్ల గానీ, పోతపాలు పట్టే వాళ్లలో పాల పీక, లేక పాలసీసా వల్లగానీ హెచ్చు అయ్యే అవకాశం ఉందన్నారు. పిల్లలకు డీ హైడ్రేషన్ కలిగినప్పుడు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సమరం, మారు పాల్గొన్నారు.

పిన్నమనేని రోడ్డులో డ్రెయిన్ నిర్మాణం షురూ



మొగల్రాజపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో అలంకార్ స్వీట్స్ వద్ద నుంచి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం ప్రారంభం అయింది. 2015లో టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఈ రోడ్డును వెడల్పు చేసి దక్షిణం వైపు డ్రెయిన్లు పూర్తిచేశారు. ఉత్తరం వైపు మాత్రం అప్పటి నుంచి ముక్కలు ముక్కలుగా నిర్మాణం చేసినా పూర్తి చేయలేదు. ఇపుడు అలంకార్ స్వీట్స్ నుంచి మైనేని జంక్షన్ వరకు నిర్మాణం చేస్తున్నారు. భారీ వర్షం కురిసినపుడు మదర్ తెరెస్సా జంక్షన్ నుంచి వచ్చే వర్షం నీరు పిన్నమనేని రోడ్డు నుంచి మైనేని జంక్షన్‌కు వస్తోంది. పాత డ్రెయిన్ సరిగా లేకపోవడంతో రోడ్డు ముంపునకు గురవుతోంది. ఈ భాగం డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే సమస్య కొంత వరకు తగ్గుతుంది.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పటమట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ డిస్ట్రిక్ -3020 ఆధ్వర్యంలో కృష్ణలంక ఏపీఎస్ ఆర్ఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) డి. చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ దృశ్యం ఐకేర్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలతో పాటు ఉచితంగా కళ్లజోడును అందించే బృహత్తర కార్యక్రమం ప్రారంభించినందుకు సంస్థలోని ప్రతీ ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వి. శ్రీదేవి ప్రసాద్, బోర్డు డైరెక్టర్ జి. రశ్మిలు మాట్లాడుతూ వీఎంసీ పరిధిలోని 29 ఉన్నత పాఠశాలలు, రెండు జెడ్పీ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలతో పాటు ఉచిత కళ్ల జోళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్ డాక్టర్ లీలా ప్రసాద్, పట్టాభిరామయ్య, రామకృష్ణ ప్రసాద్, సిల్వెస్టర్, హిలీలు పాల్గొన్నారు.





ఓపెన్ హౌస్‌లో ప్రదర్శించిన ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

సాయుధం.. ఆయుధం

ఏఆర్ గ్రౌండ్స్‌లో పోలీసు ఓపెన్ హౌస్

- ప్రదర్శనలో పోలీసు ఆయుధ సంపత్తి
- హాజరైన విద్యార్థులు
- అలరించిన డాగ్‌షో
- ఆసక్తిగా తిలకించిన భావిపౌరులు

ఏకే 47... 9ఎంఎం కోల్ట్... లేజర్ గన్... బాంబు లాంచర్... పోలీసుల అమ్ములపొదిలో ఉన్న ఆయుధ సంపద ఇది. నిత్యం కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉండే ఈ ఆయుధాలు ఏడాదిలో ఒక్కసారి మాత్రమే బయటకు వస్తాయి. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ఓపెన్ హౌస్‌లో కొలువు దీరతాయి. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన ఓపెన్‌హౌస్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ప్రారంభించారు. ఆయన వెంట డీసీపీలు గౌతమీషాలి, తిరుమలేశ్వరరెడ్డి, మురళీకృష్ణనాయుడు, ఉదయరాణి, ఏడీసీపీ జి.రామకృష్ణ ఉన్నారు. నగరంలోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

\- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఉగ్రదాడులకు అవకాశం ఉందన్న సమాచారంతో వాటినెలా ఎదుర్కోవాలన్న ఆలోచనలతో ఆక్టోపస్ కొత్త ఆవిష్కరణ చేసింది. ముంబైలో ఉగ్రదాడులు నేర్పిన పాఠాలు, నాడు బలగాలు వైపున కనిపించిన లోపాలను బేరీజు వేసుకుని ఆక్టోపస్‌లోని శాట్ కాంబోట్ వింగ్ ఈ నూతన ఆవిష్కరణ చేసింది. దీనికి కస్టమైజ్డ్ పవర్ వీల్ చైర్ అని నామకరణం చేసింది. ఉగ్రవాదులు దాడులకు వ్యూహాలు రచిస్తున్నప్పుడు ఆ సమాచారాన్ని నిఘా వర్గాలు రాష్ట్ర పోలీసు విభాగానికి అందజేస్తాయి. దాడులకున్న భవనాలను, ప్రాంతాలను ఈ వీల్ చైర్ ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తారు. ఇందుకోసం ఆక్టోపస్ ముందుగా అమెరికా నుంచి 360 డిగ్రీల కోణంలో వీడియో రికార్డింగ్ చేసే కెమెరాలు కొనుగోలు చేసింది. దీన్ని అమర్చడానికి ఒక వీల్ చైర్‌ను సొంతంగా ఆక్టోపస్ తయారు చేసుకుంది. బ్యాటరీ ఆధారంగా నడిచే వీల్ చైర్‌కు వీడియో రికార్డింగ్ కెమెరాలున్న స్టాండ్‌ను అమర్చారు. ఆక్టోపస్‌లోని సిబ్బంది కుర్చీలో కూర్చుని ముందుకెళ్తూ భవనం మొత్తాన్ని రికార్డింగ్ చేస్తుంది. దానికున్న ప్రవేశ ద్వారాలు, బయటకున్న మార్గాలను రికార్డు చేస్తుంది. తద్వారా బ్లూ ప్రింట్ తీసుకొని త్రీడీ ఫొటోలను రూపొందిస్తారు. వాటిని ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందికిస్తారు. రెస్క్యూ ఆపరేషన్ జరిగినప్పుడు వాటిని పరిశీలిస్తూ కమ్యూనికేషన్ సిబ్బంది వ్యూహాలను అందజేస్తుంది. ఇందులోని కెమెరాలు భవనం ఉన్న వీధుల్లో సైతం గూగుల్ మ్యాప్‌ను ఇస్తాయి. ఆపరేషన్‌కు ముందు మాత్రమే ఈ కస్టమైజ్డ్ పవర్ వీల్ చైర్‌ను ఉపయోగిస్తారు. దేశంలో ఇలాంటి పరికరం ఆక్టోపస్ వద్ద మాత్రమే ఉంది.



ఆందోళనకారులపై 'వాటర్ ఫైరింగ్'



ఆందోళనకారులు భారీగా గూమిగూడినప్పుడు వారిని చెదర గొట్టడానికి పోలీసులు వేర్వేరు వ్యూహాలను అనుసరిస్తారు. అందులో టియర్ గ్యాస్ ఒకటి, వాటర్ ఫైరింగ్ రెండు. నిరసనలు, ఆందోళనల సమయంలో రహదారులపైకి వారిని చెదరగొట్టడానికి ముందుగా వాటర్ ఫైరింగ్ చేస్తారు. అయినా ఆందోళనకారులు రహదారులపైనే ఉంటే టియర్ గ్యాస్ ప్రయోగిస్తారు. పోలీసు ఓపెన్ హౌస్‌లో వాటర్ ఫైరింగ్‌ను ప్రదర్శించారు. ఇది విద్యార్థులను బాగా ఆకట్టుకుంది. వాటర్ ఫైరింగ్ జరుగుతున్నంత సేపు విద్యార్థులు అరుపులు, కేకలు వేసి ఎంజాయ్ చేశారు.

ఆక్టోపస్ 'నేత్ర'

నేత్ర వీ3 ప్లస్. ఆక్టోపస్‌లోకి కొత్తగా ప్రవేశించిన డ్రోన్ ఇది. ఉగ్రదాడులను ఎదుర్కోవడానికి ఆక్టోపస్ ఉపయోగిస్తున్న టెక్నాలజీలో ఇది అధునాతన పరికరం. ముంబైలోని ఐడియా ఫోర్జ్ సంస్థ తయారు చేసిన ఈ నేత్ర డ్రోన్‌ను ఆక్టోపస్ ఈ ఏడాది మార్చిలో రూ.30లక్షలకు కొనుగోలు చేసింది. ఇది 6 కిలోల పేలోడ్‌ను తీసుకెళ్లగలదు. గంటకు 5కిలోమీటర్ల దూరం, 500 మీటర్ల ఎత్తుకు ఎగర గలదు. దీనికి 10 కిలోల బరువున్న వస్తువులను మోసే సామర్థ్యం ఉంది. దీనికున్న జీపీఎస్ పనిచేయలేని పక్షంలో సిగ్నల్స్ అందజేయడానికి ప్రత్యేకంగా ఒక యాంటీనా ఉంటుంది. ప్రస్తుతం ఈ నేత్రను నిఘా కోసం ఆక్టోపస్ ఉపయోగిస్తోంది.

ఆకట్టుకున్న డాగ్ షో



నేరగాళ్లను ట్రాక్ చేయడానికి, అనుమానాస్పద వస్తువులను గుర్తించడానికి పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను ఉపయోగిస్తారు. సీఎస్ డబ్ల్యూ (సిటీ సెక్యూరిటీ వింగ్)లో మొత్తం 11 డాగ్స్ ఉన్నాయి. వాటిలో ఐదింటితో ఓపెన్ హౌస్‌లో విన్యాసాలు చేయించారు. ట్రైనర్స్‌తో కలిసి మార్చ్ చేశాయి. అధికారులకు సెల్యూట్ చేసి, పూలబొకేలను అందజేశాయి. ఈ షోను విద్యార్థులు ఉల్లాసంగా తిలకించారు.

ఆక్టోపస్‌లో 'ఎమ్మార్వో'

ఉగ్రదాడులకు పరిధులుండవు. టార్గెట్ చేసుకున్న ప్రాంతంలో విధ్వంసం సృష్టించాలనుకున్నప్పుడు బాంబులు అమర్చుతారు. ఈ బాంబులు ఏ ప్రదేశంలో ఎక్కడ పెట్టారో వారికి తప్ప మిగిలిన వారికి తెలియదు. ఈ బాంబులను వెలికి తీయడానికి ఆక్టోపస్ ఎమ్మార్వోను ఉపయోగిస్తుంది. కెనడా నుంచి రూ.1.57కోట్లతో మినీ రిమోట్లీ ఆపరేట్ వెహికల్‌ను కొనుగోలు చేశారు. ఈ ఎమ్మార్వోలో కమాండ్ కంట్రోల్ యూనిట్, రోబోట్ ఉంటాయి. కమాండ్ కంట్రోల్ యూనిట్ ఇచ్చిన ప్రోగ్రాంను బట్టి రోబోట్ నడుచుకుంటుంది. దీనికి వాహనాల మాదిరిగా గేర్లు ఉంటాయి. మొదటి గేర్‌లో రోబోట్ గంటకు 1.5 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. రెండో గేర్‌లో మూడు, మూడో గేర్‌లో గంటకు 8కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. రోబోట్‌లో ఉన్న కెమెరాలు ఆ ప్రదేశాలను కమాండ్ కంట్రోల్ యూనిట్ మానిటర్‌లో చూపిస్తాయి. దాని ప్రకారం కమాండర్ కమాండ్స్ ఇస్తారు. ఈ రోబోట్ భూమిలో పాతిపెట్టిన బాంబులను వెలికి తీయగలదు. గుర్తించిన బాంబులను సురక్షిత ప్రదేశంలో పడేస్తుంది. ఎక్కడైనా సూట్‌కేస్‌లో బాంబు ఉన్నట్టు గుర్తిస్తే దాన్ని పట్టుకుని తీసుకెళ్తుంది. రోబోట్ తీసుకెళ్లే వస్తువులను పట్టుకోవడానికి వేర్వేరు చిన్న పరికరాలున్నాయి. ఇది భూమిపై నడవడమే కాకుండా మెట్లు ఎక్కగలదు. ఈ రోబోట్ పై తుపాకీని అమర్చుకునే సదుపాయం ఉంది. ఉగ్రవాదులు ఒక ఇంట్లో గుంపుగా ఉన్నప్పుడు తుపాకీని అమర్చి రోబోట్‌ను పంపితే కాల్పులు చేసే సామర్థ్యం ఈ ఎమ్మార్వోకు ఉంది. ఈ అత్యాధునిక ఆయుధాన్ని దేశంలో తొలుత కొనుగోలు చేసిన విభాగం ఆక్టోపస్. తరువాత ఇటీవల ప్రధానమంత్రి భద్రతను పర్యవేక్షించే ఎస్ఎస్‌జీ కొనుగోలు చేసింది. ఏకే 47, 9ఎంఎం కోల్ట్, ఎంపీ 5ఏ3, ఎస్పీఏఎస్ (స్పెషల్ పర్పస్ ఆటోమేటిక్ షార్ట్‌గన్) వంటి ఆయుధాలను ఈ రోబోట్ ఆపరేట్ చేస్తుంది. దీనికి ఒకసారి చార్జింగ్ పెడితే 4 గంటలు పనిచేస్తుంది. 14వాట్స్ బ్యాటరీతో ఈ మొత్తం పరికరం కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఉగ్రవాదులు చేతుల్లో బందీలుగా ఉన్నవారి వద్దకు ఈ రోబోట్ వెళ్లినప్పుడు కమాండర్ మాటలు వినిపించడానికి దానిలో ఒక స్పీకర్ ఉంటుంది. అక్కడున్న పరిస్థితులను బందీలుగా ఉన్నవారు చెప్పే మాటలు ఈ స్పీకర్ ద్వారా కమాండర్‌కు వినిపిస్తాయి.

విద్యార్థులకు అన్ని విషయాలను వివరిస్తాం
ఎస్వీ రాజశేఖర్‌బాబు, పోలీసు కమిషనర్



ఏఆర్ గ్రౌండ్స్‌లో రెండు రోజులపాటు ఓపెన్ హౌస్‌ను నిర్వహిస్తున్నాం. ఈ రెండు రోజుల్లో పోలీసుల వద్ద ఉన్న ఆయుధాలు గురించి వివరిస్తాం. ఆక్టోపస్, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లోని ఆయుధాలు చూపిస్తాం. అన్నింటికంటే ఆక్టోపస్ వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయి. వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలి. అలాగే సైబర్ క్రైం గురించి అవగాహన కల్పిస్తారు. రహదారి భద్రత విషయాలను ట్రాఫిక్ పోలీసులు చెబుతారు.




అవగాహన పెంచుకుంటే.. సైబర్‌కే డర్

పెట్టుబడులు పెట్టి లక్షలు కోల్పోయారు కొందరు. డిజిటల్ అరెస్టు అనగానే హడలిపోయి డబ్బులు డిపాజిట్ చేశారు కొందరు. సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌కు నిత్యం వస్తున్న కేసులివి. ఓపెన్ హౌస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ పోలీసులు స్టాల్‌కు వచ్చిన విద్యార్థులకు 16 రకాల సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్ నేరాలకు సంబంధించి టాల్‌మ్యాన్ షో ఆకట్టుకుంది. సైబర్ నేరగాడిని పోలీసులు సంకెళ్లు వేసి తీసుకెళ్తున్నట్టుగా ప్రాంగణం మొత్తం తిరిగారు.

లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి భూమి అప్పగించండి

- సీఎం చంద్రబాబుకు ఎంపీ చిన్ని విజ్ఞప్తి



అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి ఆసక్తి చూపిన స్థలాన్ని కేటాయించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఎంపీ చిన్ని కలిసి, ఎన్‌హెచ్ఏఐకి స్థలం అందజేయడానికి ఏపీసీఆర్‌డీఏకు అవసరమైన భూమిని అప్పగించాల్సిందిగా ఏపీజెన్‌కోను ఆదేశించాలని కోరారు. అలాగే విజయవాడలోని పాత రాజరాజేశ్వరిపేటలో రైల్వేశాఖకు చెందిన స్థలంలో నివాసముంటున్న నివాసితులు 15 రోజుల్లో ఖాళీ చేయాలని రైల్వే అధికారులు చాటింపు వేయించారని, తమ ఇళ్ల ను కూల్చివేసి, ఖాళీ చేయిస్తారని బాధితులు ఆందోళన చెందుతున్నారని సీఎంకు ఎంపీ వివరించారు. తక్షణం కూల్చివేత చర్యలను నిలిపేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారు.

ఫిడే రేటింగ్ చెస్ క్లాసిక్, ర్యాపిడ్ విజేతలు వీరే

- ఓవరాల్‌గా తమిళనాడు ప్లేయర్స్ సత్తా



విజేతలతో రాష్ట్ర పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ, ఇతర అతిథులు

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠగా జరుగుతున్న బీఎన్‌కేయూ తొలి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్‌లో 9 రౌండ్ల పూర్తయ్యేసరికి శనివారం నాటికి ఓపెన్ విభాగంలో నీలాష్ సాహా (8 పాయింట్లు, పశ్చిమ బెంగాల్) విజేతగా అవతరించాడు. రన్నరప్‌గా కౌత్సవ్ కుందు (7.5 పాయియింట్లు, పశ్చిమ బెంగాల్), మూడో స్థానంలో వెంకటేష్ ఎంఆర్ (7.5 పాయింట్లు, తమిళనాడు) నిలిచారు. రేటింగ్ క్యాటగిరి (1650-1900)లో ఎస్ సిద్ధాంత్ (మహారాష్ట్ర), ప్రణవ్ ఏజే (కర్నాటక), సాయికత్ నాథ్ (ఢిల్లీ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. రేటింగ్ క్యాటగిరి (1400-1649)లో మల్లిఖార్జునరావు (ఆంధ్రప్రదేశ్), దినేష్ కేపీ (తమిళనాడు), అంజన ఏ (తమిళనాడు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను వశం చేసుకున్నారు. బెస్ట్ అన్‌రేటెడ్ కేటగిరిలో సుదర్శన్ బాలాజీ (తమిళనాడు), మాంగ్య పి (తెలంగాణ), శ్రీ కృష్ణ గణేషన్ (తమిళనాడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వశం చేసుకున్నారు. ఫిడే బ్లిట్జ్ రేటింగ్ చెస్‌లో 524 మంది తలపడాల్సిన లీగ్ పద్ధతిలో 9 రౌండ్లు పోటీలు నిర్వహించగా, ఓపెన్ విభాగంలో గ్రాండ్ మాస్టర్ లక్ష్మణ్ ఆర్ఆర్ (తమిళనాడు), ఇంటర్నేషనల్ మాస్టర్ రవితేజ (ఏపీ), ఇంటర్నేషనల్ మాస్టర్ శర్వాన కృష్ణన్ (తమిళనాడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వశం చేసుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పన్నులశాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ హాజరుకాగా, ప్రత్యేక అతిథిగా చైర్మన్ వీవీఐపీ కాలేజ్ చైర్మన్ వాసిరెడ్డి వెంకటాద్రి విద్యాసాగంర్, ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కే రాజేంద్ర, ఐకాన్ స్కూల్ చైర్మన్ వై పార్థసారథి, టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీమ్, బీఎన్‌కేయూ టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల కుమార్, ట్రెజరర్ నరేష్, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్

నగరంలోని కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి కృష్ణా ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఎను ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్టు టోర్నీ సెక్రటరీ వీ రవికాంత తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభిస్తారని, ఎస్‌జీఎఫ్ అండర్-19 ప్రెసిడెంట్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారన్నారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి!

- ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్



మాట్లాడుతున్న ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన ప్రతిఒక్కరూ శాసనమండలిలో పట్టభద్రుల ప్రతినిధిగా మంచి నేతను ఎన్నికునేందుకు ఓటరుగా నమోదు కావాలని ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో అసోసియేషన్ హాల్‌లో శనివారం జరిగిన పశ్చిమ కృష్ణాజిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాలూకా కేంద్రంలోని ఎన్జీవో హోమ్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులొచ్చినా సహాయక కేంద్రాల్లో పరిష్కరించుకోవాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిలను త్వరలో చెల్లించాలని, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. రూ.20వేల కోట్లకు పైగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఇంకా బకాయిల చెల్లింపుల కోసం ఆందోళన చేస్తున్న వారిపై 4వేల కేసులను బనాయించిందన్నారు. పెన్షనర్లకు అదనపు క్వాంటం పెన్షన్‌ను 2018లో ప్రభుత్వం మంజూరు చేస్తే గత ప్రభుత్వం కోత విధించిందన్నారు. సీఎం చంద్రబాబు ఉద్యోగులపై పెట్టిన కేసులను సమీక్షించి ఎత్తివేస్తామని అసెంబ్లీలో ప్రకటించారన్నారు. ఇప్పుడు ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్‌లు వస్తున్నాయని, సాధ్యమైనంత త్వరలో ఉద్యోగుల బకాయిలను చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ఈలోగా మధ్యంతర భృతిని ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ రెడ్డి, అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

సైబర్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్

విజయవాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన తరకటూరి అనురాగ్ ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు పంపిన లింక్‌లో లాగిన్ అయి పెట్టుబడి పెట్టాడు. మొత్తం రూ.1.79కోట్లను సైబర్ నేరగాళ్లు జమ చేయించుకున్నారు. పెట్టుబడి పెట్టడం తప్ప రిటర్న్స్ లేకపోవడంతో మోసపోయానని గుర్తించిన అనురాగ్ పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. దీనిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సైబర్ క్రైం పోలీసులకు ఆదేశాలిచ్చారు. ఇన్‌స్పెక్టర్ గుణరాము జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యాక జీరో ఎఫ్ఐఆర్ నమోదు ఇదే ప్రథమమని పోలీసులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంపై ప్రజల్లో ఆసక్తి: ఎంపీ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

విద్యాధరపురం, అక్టోబరు 26 (ఆంధ్ర్యజ్యోతి): చంద్రబాబు పాలన చూసి టీడీపీలో సభ్యులుగా చేరేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవటం ఎంతో గౌరవప్రదమని వారు భావిస్తున్నారన్నారు భవానీపురం 40వ డివిజన్‌లో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్ పాల్గొన్నారు. తొలుత వీరు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి గతంలో రూ.2లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచటం హర్షదాయకమని, నేతలు, కార్యకర్తలు ఇందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. సభ్యత్వ రూ.100ల సభ్యత్వంతో కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తిస్తుందని, ఇదే సమయంలో సభ్యుల కుటుంబాల్లో విద్య, వైద్యం, ఉపాధి కోసం టీడీపీ అండగా ఉంటుందన్నారు. సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి చనిపోయినట్టయితే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు అందజేస్తారన్నారు. పార్టీ 40వ డివిజన్ అధ్యక్షుడు చిన సుబ్బయ్య, నేతలు నారాయణ, శివశర్మ, సురభి బాలు పాల్గొన్నారు.

సోనోవిజన్‌లో రూ. లక్ష వరకు నగదు బహుమతులు

ఆటోనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోనోవిజన్ దీపావళి సేల్ సందర్భంగా సోనోవిజన్ కొనుగోలుదారులు ఎంతగానో అభిమానించే స్క్రాచ్ కార్డు మళ్లీ ప్రారంభించినట్టు సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి. భాస్కరమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రూ.2వేలు కొనుగోలుపై స్క్రాచ్ కార్డు వస్తుందన్నారు. రూ.100 నుంచి రూ.లక్ష వరకు తక్షణ నగదు బహుమతి అందుకునే అవకాశం ఉందన్నారు. ఎస్.బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై రూ.10వేల వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చన్నారు. ఫైనాన్స్ కొనుగోలుదారులకు రూ.22,500 వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్లు అందిస్తున్నట్టు తెలిపారు. అన్ని క్రెడిట్ కార్డు స్వైపింగ్‌పై టీవీలకు, వాషింగ్ మిషన్లకు, రిఫ్రిజిరేటర్స్‌పై 22.5శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నామన్నారు. ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై ఒక ఈఎంఐ రిఫండ్ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. లోకల్ అడ్రస్ ప్రూఫ్ అవసరం లేకుండా కొనుగోలుదారులు వస్తువులను కొనుగోలు చేయొచ్చన్నారు. మెరుగైన సేవలందిస్తామని సోనోవిజన్ టీం తరుఫున హామీ ఇస్తున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు.



నవలోకం

కొత్తరూపు సంతరించుకున్న నవలంక

- వరదల అనంతరం మరింత అబ్బురపరుస్తున్న ఇసుక తిన్నెలు
- పోటెత్తుతున్న ప్రకృతి ప్రేమికులు

ఆంధ్రజ్యోతి - అవనిగడ్డ: చిన్నచిన్న ఇసుక తిన్నెలతో ఉండే నవలంక నేడు పర్యాటక ప్రేమికులే ఆశ్చర్యపోయేలా సరికొత్త అందాలను సంతరించుకుంది. కృష్ణాజిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఒకటైన నాగాయలంకకు ఇటీవల వచ్చిన భారీ వరదల సమయంలో కృష్ణమ్మ గర్భం నుంచి సరికొత్త అందాలతో నవలంక పునరుద్భవించింది. ఉదయించే సూర్యకిరణాల వెలుగులో జిగెలుమనిపించే మెరిసే గడ్డిపూలు, కాసేపట్లో అస్తమించే సూర్యబింబం ముందు మనల్ని పలకరించేందుకు వస్తున్నాయా అన్నట్టుండే సముద్రపు పక్షుల గుంపు మనల్ని చూపుతిప్పుకోనివ్వవు. ముఖ్యంగా సూర్యాస్తమ మనోహర దృశ్యాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే నాగాయలంక శ్రీ రామపాదక్షేత్రం సమీపంలోని ఈ నవలంక దీవి ఉంది. ప్రకృతి రమణీయ అందాలతో తులతూగే నవలంకను సందర్శించాలంటే ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి అవనిగడ్డ మీదుగా నాగాయలంక ప్రతి అర గంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. కరకట్ట ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కితే విజయవాడ, రామలింగేశ్వర నగర్ దాటిన దగ్గర నుంచి పులిగడ్డ వరకు దాదాపు 60 కిలోమీటర్ల పొడవున వివిధ పంటలతో లంక భూములు కనువిందు చేస్తాయి. పచ్చని చెట్లతో ఆకాశానికి కప్పు వేశారా అన్నట్లు కరకట్ట పొడవునా ఇరువైపులా కనిపించే చెట్లు పర్యాటకులకు కొత్త అనుభూతులు మిగులుస్తున్నాయి. కరకట్ట ప్రయాణంతో అవనిగడ్డ మీదుగా నాగాయలంక చేరుకొంటే బస్సు దిగిన దగ్గర నుంచి కేవలం అర కిలోమీటరు దూరంలోనే శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వస్తుంది. ఈ ఘాట్ వద్ద నుంచి స్థానిక మత్స్యకారులు తమ పడవల్లో పర్యాటకులను నది మధ్యలో అందంగా కనిపించే నవలంకకు తీసుకెళ్తారు. ఇందు కోసం వారు రూ.300-400 వరకు చార్జ్ చేస్తారు. అయితే నవలంక అందాలు పూర్తిస్థాయిలో ఆస్వాధించాలంటే సాయంత్రం 4 గంటల సమయం దాటితేనే కాని కుదరదు. కాబట్టి ఈ అంతకంటే ముందు ఈ ప్రాంతానికి వస్తే మాత్రం అవనిగడ్డ లంకమ్మ అమ్మవారిని, శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని (గాలిగోపురంగుడి) ద ర్శించుకుని సాయంత్రం సూర్యాస్తమ సమయానికి నాగాయలంక చేరుకుని నవలంక అందాలు ఆస్వాదించవచ్చు. పులిగడ్డ వద్ద కృష్ణానది రెండుగా చీలి ఒక పాయ హంసలదీవి సమీపంలో సాగరంలో సంగమిస్తే, మరో పాయ వేణీ నదిగా మారి నాగాయలంక దిగువన సాగురుడితో సంగమిస్తుంది. అందుకే నాగాయలంక శ్రీరామపాదక్షేత్రాన్ని వేణీ సంగమ క్షేత్రంగా పిలుస్తారు. ఇక్కడ నది అంచున నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, కనకదుర్గమ్మవారి ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయం, రాముల వారి ఆలయం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, పునర్నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో ఆధ్యాత్మిక ఆరాధికులను ఆకట్టుకుంటాయి.



గడ్డిపూలతో ఆడుకుంటున్న చిన్నారి

కొత్త సోయగాలతో..



ఇటీవల వచ్చిన వరదల అనంతరం కొత్తగా ఏర్పడిన ఇసుక తిన్నెల అందాలను వీక్షించేందుకు చుట్టు పక్క ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. ప్రభుత్వ స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే మరింత మంది ఇక్కడికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది.

మండవ బాలవర్ధిరావు, మాజీ సర్పంచ్

ప్రకృతి సిగలో.. ఆధ్యాత్మిక శోభ



శ్రీరామపాదక్షేత్రం ఘాట్ ప్రకృతి సోయగాలకు, ఆధ్యాత్మిక శోభకు ఆలవాలం. ఇక్కడ సూర్యాస్తమయ సమయంలో ఆకాశం కొత్తకొత్త అందాలను ఆవిష్కరిస్తుంది. ఇక్కడి ఆలయాలు భక్తులకు ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయి.

ఆలూరి శ్రీనివాసరావు, చైర్మన్, శ్రీరామపాదక్షేత్రం అభివృద్ధి కమిటీ

సెలవులు వచ్చాయంటే పర్యాటక కళ



సెలవులొస్తే చుట్టుపక్క ప్రాంతాల నుంచి వచ్చేవారితో పాటు ఈ ప్రాంతం గురించి పరిచయం ఉన్నవారితో శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ కళకళలాడుతుంది. వరదల అనంతరం నవలంక ఇసుక మేటలతో ఎత్తు పెరిగింది. ఈ ఇసుక తిన్నెలు చూసేందుకు, అందులో ఆడుకునేందుకు వచ్చే యువత ఎక్కువ.

నాగిడి పోతురాజు, స్థానిక మత్స్యకారుడు

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
ఆదివారం • 27 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



ఇదొక రియల్ హీరో కథ

'సాయిపల్లవి పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన వీడియో చూసినప్పుడే సినిమా విజయంపై నమ్మకం ఏర్పడింది. ఇదొక రియల్ హీరో స్టోరీ. యాక్షన్‌తోపాటు ఎమోషన్స్ ఉన్న చిత్రమిది. కమల్‌హాసన్ నిర్మించేందుకు ముందుకు వచ్చారంటేనే ఈ సినిమా ఎంత ప్రత్యేకమైనదో అర్థం చేసుకోవచ్చు' అని తమిళ హీరో శివకార్తికేయన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రమిది. కమల్‌హాసన్ నిర్మాణంలో రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. సాయిపల్లవి కథానాయిక. ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'మేజర్ ముకుంద వరదరాజన్, ఇందు రెబకా అనే దంపతుల కథ ఇది. సైనికుల త్యాగాలు ఎలా ఉంటాయో రాజ్‌కుమార్ 'అమరన్'లో అద్భుతంగా చూపించారు. ప్రేక్షకులు తప్పక ఆదరించాలి' అని కోరారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'నా ప్రతి సినిమా ప్రేక్షకులకు నచ్చాలనే అంకితభావంతో పనిచేస్తాను. అమరన్ సినిమాలో నా పాత్రను దర్శకుడు అద్భుతంగా మలిచారు. ఈ సినిమా మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.

సందీప్ సరసన రీతూ



త్రినాధరావు దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది. 20 రోజుల లెన్తీ షెడ్యూల్‌లో యాక్షన్ బ్లాక్స్‌తోపాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా, మేకర్స్ ఇంట్రస్టింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన రీతూ వర్మ నటిస్తున్నారు.

సందీప్ కిషన్- రీతూ వర్మ హ్యామరస్ అనౌన్స్‌మెంట్ వీడియో ఆకట్టుకుంటోంది. ఇందులో రీతూ వర్మ పెళ్లి దుస్తుల్లో అందంగా కనిపించారు.





'రాజీనామా'తో మొదలైన
రాజీలేని ప్రయాణం

తన నట జీవితంలోని తొలి మైలురాయిని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. కాలేజ్ రోజుల్లో నటుడిగా రంగస్థలంపై అడుగుపెట్టినప్పటి అరుదైన జ్ఞాపకాన్ని శనివారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. కాలేజ్ రోజుల్లో తొలి నాటకంతోనే ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న ఫొటోను షేర్ చేశారు. '1974లో నరసాపురం వై.ఎన్.ఎం కాలేజ్‌లో డిగ్రీ చదువుతున్నా. అప్పుడే తొలిసారి 'రాజీనామా' అనే నాటకంలో ఓ వేషం వేశాను. నటుడిగా నాకది తొలి గుర్తింపు. ఆ ఏడాది కాలేజీ తరపున ఇచ్చే ఉత్తమ నటుడి పురస్కారం నాకు దక్కడం ఎనలేని ప్రోత్సాహాన్ని ఇచ్చింది. 1974 నుంచి 2024 వరకూ 50 ఏళ్ల పాటు సాగిన నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్నిచ్చింది' అని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చిరు పేర్కొన్నారు. రాజీనామాతో మొదలైన రాజీలేని ప్రయాణం అయనదని మెగాభిమానులు కామెంట్స్ పెడుతున్నారు.



యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన 'పొట్టేల్' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ మధ్య కాలంలో ఇంత పాజిటివ్ టాక్ ఏ చిత్రానికీ రాలేదని, ప్రతి థియేటర్‌లో సినిమాకు స్టాండింగ్ ఓవేషన్ వస్తోందని దర్శకుడు సాహిత్ మోత్కూరి చెప్పారు. తన నటనకు అందరి నుంచి అభినందనలు వస్తున్నందుకు యువచంద్ర కృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. సినిమా చూశాక అందరూ తనని బుజ్జమ్మా అని పిలుస్తున్నారని అనన్య చెప్పారు. మంచి సినిమా తీశామని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని నిర్మాత తెలిపారు.

రిలీజ్ డేట్ ఫిక్స్



అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అశోక్ గల్లా, వారణాసి మానస హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. సోమినేని బాలకృష్ణ నిర్మాత. సంగీతం భీమ్స్ సిసిరోలియో. నవంబరు 14న విడుదలవుతోంది. చిత్రం వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్‌ను శంక్ పిక్చర్స్ దక్కించుకుంది. సినిమాలో అశోక్ గల్లా మాస్, యాక్షన్-ప్యాక్డ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే మొదటి రెండు పాటలు హిట్ అయ్యాయి.

ఇన్ ప్రోగ్రెస్

'సారంగో సారంగా...'



ప్రియదర్శి, రూపా కొడువాయుర్ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. డిసెంబరు 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రంలోని మొదటి సాంగ్ 'సారంగో సారంగా... అమ్మాయి అవునంది ఏకంగా' అంటూ సాగే ప్రణయ గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు.

డివోషనల్ ఎంటర్టైనర్



వరుస ప్రాజెక్ట్‌లతో టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నారు నిర్మాత టీ.జీ. విశ్వప్రసాద్. ఆయన నిర్మించబోయే ఓ నూతన చిత్రాన్ని.. శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత టీ.జీ.విశ్వప్రసాద్ మాట్లాడుతూ "రణమండల అంజనేయ స్వామి సన్నిధిలో ఈ చిత్రాన్ని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. టైటిల్ 'రణమండల'. రెండేళ్లుగా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. హనుమంతుని నేపథ్యంలో సాగే ఈ సినిమా భారీ యాక్షన్ డివోషనల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనుంది' అన్నారు.

సమాజం కోసం సూపర్ హీరోగా...



'లక్కీ' ఫేమ్ డాక్టర్ సూరి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'బఘీరా'. 'ఉగ్రమ్' ఫేమ్ శ్రీ మురళీ, ప్రకాశ్‌రాజ్, రుక్మిణీ వసంత్ కీలక పాత్రలు పోషించారు. ప్రశాంత్ నీల్ కథ అందించారు. విజయ్ కిరగందూర్ నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు సూరి మీడియాతో ముచ్చటించారు. 'కేజీఎఫ్' షూటింగ్ టైమ్‌లో శ్రీమురళి కోసం ప్రశాంత్ నీల్ ఈ కథ చెప్పారు. కథ నచ్చడంతో డెవలప్ చేశాను. ఓ సాధారణ వ్యక్తి.. సమాజం కోసం సూపర్ హీరోగా మారాడనేది ఈ సినిమా కథాంశం. ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచే చిత్రమిది. ఇందులో ప్రతీ పాత్రా కీలకమే. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. అజనీష్ లోకనాథం ఇచ్చిన సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. సినిమా ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

విభిన్నమైన ప్రేమకథ



షెరాజ్ మెహదీ లీడ్ రోల్‌లో నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షీ హెగ్డే, కృతి వర్మ హీరోయిన్లు. సురీందర్ కౌర్ నిర్మిస్తున్న ఈ ప్రేమ కథా చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. త్వరలోనే సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో, దర్శకుడు షెరాజ్ మెహదీ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. విభిన్నమైన ప్రేమకథగా రాబోతోంది" అని చెప్పారు. "ఇందులో నేను పోషించిన పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. కమర్షియల్ అంశాలతో పాటు ఆలోచింపజేసే సందేశం ఉన్న సినిమా ఇది" అని హీరోయిన్ విహాన్షీ హెగ్డే అన్నారు.

బిజినెస్

అదానీ గూటికి ఐటీడీ సిమెంటేషన్

46.64% వాటా రూ.3,204 కోట్లకు కొనుగోలు

ఓపెన్ ఆఫర్ ద్వారా మరో 26 శాతం వాటాను రూ.2,553 కోట్లకు దక్కించుకోనున్న గ్రూప్



న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ కొనుగోళ్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ మధ్యనే ఓరియంట్ సిమెంట్‌ను టేకోవర్ చేస్తున్నట్లు ప్రకటించిన గ్రూప్.. తాజాగా మరో కంపెనీని చేజిక్కించుకుంది. ఇంజనీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఐటీడీ సిమెంటేషన్ ఇండియా ప్రమోటర్‌కు చెందిన 46.64 శాతం వాటాను రూ.3,204 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు దుబాయ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అదానీ గ్రూప్ కంపెనీ రెన్యూ ఎక్సిమ్ డీఎంసీసీ శనివారం వెల్లడించింది. కంపెనీ ప్రమోటరైన ఇటాలియన్-థాయ్ డెవలప్‌మెంట్ పబ్లిక్ కంపెనీ లిమిటెడ్ (ఐటీడీ) నుంచి ఒక్కో షేరు రూ.400 చొప్పున కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. అలాగే, బహిరంగ మార్కెట్లో ఐటీడీ సిమెంటేషన్ పబ్లిక్ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలు చేసేందుకు సెబీ నిబంధనల ప్రకారం ఓపెన్ ఆఫర్ సైతం ప్రకటించింది. ఓపెన్ ఆఫర్‌లో భాగంగా ఒక్కో షేరుకు రూ.571.68 చొప్పున చెల్లించనుంది. 26 శాతం వాటా కొనుగోలుకు మొత్తం రూ.2,553 కోట్లు వెచ్చించనుంది. అంటే, మొత్తం 72.64 శాతం వాటాను రూ.5,757 కోట్లకు దక్కించుకోనుంది. విమానాశ్రయాలు, రహదారులు, మెట్రో ప్రాజెక్టు విభాగాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో సివిల్ ఇంజనీరింగ్ సామర్థ్యాలను పెంచుకునేందుకు అదానీ గ్రూప్‌నకు ఐటీడీ సిమెంటేషన్ కొనుగోలు దోహదపడనుంది.

బీఎస్ఈలో ఐటీడీ సిమెంటేషన్ షేరు ధర శుక్రవారం రూ.532.80 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,152 కోట్లుగా ఉంది. గడిచిన ఏడాది కాలంలో కంపెనీ షేరు 180 శాతానికి పైగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఐటీడీ సిమెంటేషన్ రూ.7,542 కోట్ల ఆదాయంపై రూ.274 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

ఈప్యాక్ డ్యూరబుల్‌తో హైసెన్స్ ఒప్పందం

శ్రీసిటీలో ప్లాంట్ ఏర్పాటు

దేశీయంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్ల తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల సంస్థ హైసెన్స్.. భారత్‌కు చెందిన కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ (ఈడీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా హైసెన్స్‌కు చెందిన ఎయిర్ కండీషనర్లు, గృహోపకరణాలను ఈప్యాక్ డ్యూరబుల్ దేశీయంగా ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం ఈప్యాక్ డ్యూరబుల్ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్రత్యేకంగా అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. 2025 జూన్ నాటికి ఈ ప్లాంట్‌లో రిఫ్రిజిరేటర్లు, ఏసీలు సహా వాషింగ్ మెషిన్ల వంటి పలు గృహోపకరణాల ఉత్పత్తిని ప్రారంభించనుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 లక్షల యూనిట్లకు చేర్చనుంది. శ్రీసిటీ ప్లాంట్‌లో తయారు చేయనున్న ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌కు మాత్రమే సరఫరా చేయకుండా కీలకమైన అంతర్జాతీయ మార్కెట్లకు వీటిని ఎగుమతి చేసే అవకాశాలను హైసెన్స్ పరిశీలించనుంది. ఈప్యాక్‌తో ఒప్పందంతో దేశీయ మార్కెట్లో గట్టి పట్టును చేజిక్కించుకోవటమే కాకుండా వచ్చే ఐదేళ్లలో 100 కోట్ల డాలర్ల ఆదాయం అదనంగా వస్తుందని హైసెన్స్ అంచనా వేస్తోంది.

ఎన్‌విడియా నం.1



ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరణ

రెండో స్థానానికి జారిన యాపిల్

న్యూయార్క్: అమెరికన్ ఏఐ చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా యాపిల్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. శుక్రవారం ట్రేడింగ్‌లో ఎన్‌విడియా షేర్లు రికార్డు స్థాయికి వృద్ధి చెందడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 3.53 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. ఆ సమయంలో యాపిల్ మార్కెట్ క్యాప్ 3.52 లక్షల కోట్ల డాలర్లుగా నమోదైంది. కంపెనీ సూపర్ కంప్యూటింగ్ ఏఐ చిప్‌లకు భారీగా డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడింది. ఈ నెలలో ఇప్పటివరకు ఎన్‌విడియా షేరు 18 శాతం పెరిగింది. కాగా, ఈ జూన్‌లోనూ ఎన్‌విడియా స్వల్పకాలం పాటు ప్రపంచ నం.1 కంపెనీగా ఎదిగినప్పటికీ.. యాపిల్, మైక్రోసాఫ్ట్‌లు మళ్లీ కంపెనీని అధిగమించేశాయి.

బజాజ్‌కు బైబై.. జియోకు హలో!

భారత్‌లో కొత్త భాగస్వామ్యం ఏర్పాటు యత్నాల్లో అలియాంజ్

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ఆర్థిక సేవలు, బీమా రంగ దిగ్గజం అలియాంజ్ ఎస్ఈ.. భారత్‌లో బజాజ్ గ్రూప్‌తో భాగస్వామ్యానికి స్వస్తి పలికి ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో జతకట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. బజాజ్ ఫిన్‌సర్వ్, అలియాంజ్ ఎస్ఈ రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి భాగస్వామ్యం (జేవీ)లో జీవిత, సాధారణ బీమా వ్యాపారాలను ఏర్పాటు చేశాయి. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌లో బజాజ్ 74 శాతం, అలియాంజ్ 26 శాతం వాటా కలిగి ఉన్నాయి. అయితే, ఈ జేవీల్లో తన వాటాను పెంచుకునేందుకు బజాజ్ అంగీకరించని నేపథ్యంలో అలియాంజ్ పూర్తిగా వైదొలగాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో అలియాంజ్‌తో కలిసి బీమా రంగ జేవీ ఏర్పాటు కోసం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.11,746 కోట్లు

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఐసీఐసీఐ బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14.5 శాతం వృద్ధితో రూ.11,746 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.10,261 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.40,697 కోట్ల నుంచి రూ.47,714 కోట్లకు ఎగబాకగా.. వడ్డీ ఆదాయం రూ.34,920 కోట్ల స్థాయి నుంచి రూ.40,537 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 9.5 శాతం వృద్ధితో రూ.20,048 కోట్లుగా నమోదు కాగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 4.53 శాతం నుంచి 4.27 శాతానికి తగ్గింది. మరిన్ని విషయాలు..

- సెప్టెంబరు చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.97 శాతానికి తగ్గాయి. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి 2.48 శాతంగా నమోదయ్యాయి. కాగా, నికర ఎన్‌పీఏలు 0.43 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గాయి.
- గత నెల చివరి నాటికి బ్యాంక్ డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 15.6 శాతం వృద్ధి చెంది రూ.14,28,095 కోట్లకు చేరుకున్నాయి.
- గడిచిన మూడు నెలలకు ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 18.8 శాతం వృద్ధితో రూ.12,948 కోట్లకు, ఏకీకృత ఆస్తుల విలువ 18.4 శాతం పెరుగుదలతో రూ.25,16,512 కోట్లకు చేరుకున్నాయి.

యెస్ బ్యాంక్ లాభంలో 147% వృద్ధి

సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో యెస్ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 147 శాతం వృద్ధి చెంది రూ.566.59 కోట్లకు చేరుకుంది. మొండి బాకీల నష్టాలను పూడ్చుకునేందుకు జరిపే కేటాయింపులు తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. క్రితం ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.228.64 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ జూన్ త్రైమాసికంలో రూ.516 లాభాన్ని ఆర్జించింది. గత మూడు నెలలకు బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 14.3 శాతం పెరిగి రూ.2,200 కోట్లకు చేరుకోగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.4 శాతానికి మెరుగుపడింది. ఈ సెప్టెంబరు చివరినాటికి బ్యాంక్ మొండి బకాయిలు 1.6 శాతానికి తగ్గాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,290 ▲	73,600 ▲	1,07,000 ▼
ముంబై	78,015 ▼	71,462 ▼	95,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	123
కరీంనగర్	120	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	126
కర్నూలు	120	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		

వాణిజ్య అవసరాలకు భవనాలను అద్దెకు ఇస్తుంటే?



రాంబాబు గొండాల

హరి ఒక ప్రభుత్వ ఉద్యోగి. తాను పొదుపు చేసిన డబ్బుతో ఒక మంచి ఏరియాలో కొంతం స్థలం కొనుగోలు చేశాడు. కొన్నేళ్లలో ఆ ప్రాంతం మంచి వాణిజ్య కేంద్రంగా రూపుదిద్దుకుంది. దాంతో తాను కొన్న స్థలంలో ఒక భవనాన్ని నిర్మించి ఒక కార్పొరేట్ కంపెనీకి అద్దెకు ఇచ్చాడు. దీని అద్దె సంవత్సరానికి రూ.20 లక్షలు దాటుతుందని అనుకుందాం. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వాణిజ్య భవనాలకు 18 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. అలాగే అద్దె రూ.20 లక్షలు దాటుతుంది కాబట్టి హరికి రిజిస్ట్రేషన్ పొందటానికి కానీ, పన్ను చెల్లించటానికి కానీ ఎలాంటి వినహాయింపు లేదు.

అయితే, హరికి జీఎస్‌టీలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ లేదు. జీఎస్‌టీ గురించి ఎలాంటి అవగాహన లేదు. మరి దీని కోసం హరి జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవాలా? ఈ సమస్య ఒక్క హరికే కాదు చాలా మందికి ఉంటుంది. ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ చట్టంలో కొన్ని మార్పులు చేసింది.

దీని ప్రకారం జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ లేని వ్యక్తి తన వాణిజ్య భవనాన్ని లేదా వాణిజ్య సముదాయాన్ని లేదా అందులో భాగాన్ని ఏదేనీ కంపెనీకి లేదా వ్యాపార సంస్థకు అద్దెకి ఇచ్చి ఉంటే.. సదరు వ్యాపార సంస్థకు లేదా కంపెనీకి జీఎస్‌టీలో రిజిస్ట్రేషన్ ఉంటే.. ఆ అద్దెపై జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత అద్దె చెల్లించే సంస్థదే. అంటే పై ఉదాహరణలో హరికి జీఎస్‌టీలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు కాబట్టి సదరు కార్పొరేట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ ఉన్నట్లయితే, సంబంధిత జీఎస్‌టీ చెల్లించాల్సిన బాధ్యత ఆ కార్పొరేట్ కంపెనీదే. దీనినే రివర్స్ చార్జ్ మెకానిజం అంటారు. మరి, ఆ కంపెనీకి ఆ మేరకు నష్టం కదా అంటే, ఎంత మాత్రం నష్టం ఉండదు. ఎందుకంటే ఆ మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కింద తీసుకోవచ్చు. అంటే, ఉదాహరణకు నెలకు రూ.2 లక్షలు అద్దె అనుకుంటే, ఇంతకుముందు కంపెనీ హరికి రూ.2 లక్షలు, దానిపైన జీఎస్‌టీ రూ.36,000 కలిపి చెల్లించేది. హరి రూ.2 లక్షలు తాను ఉంచుకుని ప్రభుత్వానికి రూ.36,000 చెల్లించేవాడు. కంపెనీ తాను చెల్లించిన రూ.36,000 మొత్తాన్ని ఐటీసీ రూపేణా తీసుకునేది. అయితే ఇందులో కొంత క్లిష్టత ఉండేది. హరి తొలుత రిజిస్ట్రేషన్ పొందాలి. నెలవారీ రిటర్నులు దాఖలు చేయాలి. తాను పొందిన అద్దెను సక్రమంగా చూపుతూ ప్రభుత్వానికి సంబంధిత జీఎస్‌టీ సరిగా చెల్లించాలి. అంటే హరి విధి విధానాలను సరిగా పాటించకపోతే సదరు కంపెనీ ఐటీసీ పొందలేదు.

ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్త విధానంలో హరి రిజిస్ట్రేషన్ పొందాల్సిన అవసరం లేదు. అలాగే కంపెనీ కూడా ఐటీసీ పొందటం సులువు. మరి ఇలా ఒక కంపెనీకి కాకుండా హరి తన భవనాన్ని ఒక 10 షాపుల కింద విభజించి 10 మందికి అద్దెకు ఇచ్చాడనుకుందాం. అప్పుడు అద్దెకు తీసుకున్న అందరికీ రిజిస్ట్రేషన్ ఉంటే, రివర్స్ చార్జ్ మెకానిజం కింద అద్దెకు తీసుకున్న వ్యక్తులు అందరూ వస్తారు. అందరు వారి వారి అద్దెలకు సంబంధించి జీఎస్‌టీ చెల్లిస్తారు.

మరి అందులో కొందరికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ లేకుంటే? అప్పుడు బిల్డింగ్ యజమానికి ఎంత అద్దె వస్తుందో చూడాలి. ఒకవేళ అద్దె మొత్తం రూ.20 లక్షలు దాటితే అప్పుడు భవన యజమాని రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఎప్పుడైతే రిజిస్ట్రేషన్ తీసుకుంటాడో, అప్పుడు రివర్స్ చార్జ్ మెకానిజం వర్తించదు. అంటే, అన్ని షాపులకు భవన యజమాని జీఎస్‌టీ చెల్లించాలి. అద్దెకు తీసుకున్న వ్యక్తులకు జీఎస్‌టీ ఉన్నా లేకున్నా.. క్లుప్తంగా చెప్పాలంటే వాణిజ్య భవనాల అద్దెకు సంబంధించి రివర్స్ చార్జ్ అనేది యజమానికి రిజిస్ట్రేషన్ లేకుండా.. అద్దెకు తీసుకున్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ ఉన్నప్పుడే అమలవుతుంది. అయితే, రిజిస్ట్రేషన్ తీసుకోవటానికి కేవలం అద్దె మాత్రం కాకుండా ఇతర ఆదాయాన్ని కూడా చూడాలి. అలాగే విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ మన దేశంలో వాణిజ్య భవనాలను అద్దెకు ఇచ్చే వ్యక్తులకు కూడా ఈ విధానం చాలా ఉపయోగకరం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్



12 ఏళ్లు.. 18 వరుస టెస్టు సిరీస్ విజయాలు. ఇదీ సొంతగడ్డపై టీమిండియా ట్రాక్ రికార్డు. 2012 నుంచి ఎంతటి ప్రత్యర్థి వచ్చినా మైదానాల్లో మనోళ్ల ఆటకు బెంబేలెత్తి 'పోయారు'. కానీ మన ఆధిపత్యానికి చెక్‌పెడుతూ ఈసారి న్యూజిలాండ్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఇటీవలే శ్రీలంక చేతిలో వైట్‌వాష్, కెప్టెన్ రాజీనామా.. సీనియర్ బ్యాటర్ కేన్ గాయపడడంతో పాటు లాథమ్, సౌథీలకు తప్ప పెద్దగా ఎవరికీ టెస్టు అనుభవమే లేదు. అసలిక్కడ వారు టెస్టు గెలిచి 36 ఏళ్లయ్యింది. ఇన్ని సమస్యలను అధిగమిస్తూ కివీస్ జట్టు సమష్టి ఆటతీరుతో భారత్‌పై విరుచుకుపడింది. స్పిన్నర్ శాంట్నర్ 13 వికెట్లతో భారత పతనాన్ని శాసించిన వేళ.. రెండో టెస్టులో అద్భుత విజయాన్ని దక్కించుకున్న కివీస్ మరో మ్యాచ్ విగిలుండగానే సిరీస్‌ను దక్కించుకుంది.



12 ఏళ్లలో తొలిసారి సొంతగడ్డపై భారత్‌కు పరాభవం

రెండో టెస్టులోనూ ఓటమి



సీన్ రివర్స్ సిరీస్ గల్లంతు

శాంట్నర్‌కు ఆరు వికెట్లు ● పోరాడిన జైస్వాల్ ● 2-0తో కివీస్‌కు తిరుగులేని ఆధిక్యం



జడేజా (42)

పుణె: స్వదేశంలో భారత క్రికెట్ జట్టు తిరుగులేని ఆధిపత్యానికి గండి పడింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో 18 సిరీస్‌ల విజయానికి న్యూజిలాండ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో కివీస్ 113 పరుగులతో ఘనవిజయం సాధించింది. ఇప్పటికే తొలి టెస్టును గెలిచిన ఈ జట్టు మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ దక్కించుకుంది. భారత్‌లో టెస్టు సిరీస్ గెలవడం కివీస్‌కిదే తొలిసారి. కాగా, 2012-13లో ఇంగ్లండ్ చేతిలో చివరిసారి భారత్ ధోనీ కెప్టెన్సీలో ఇక్కడ సిరీస్ కోల్పోయింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, స్పిన్నర్ శాంట్నర్ మొత్తంగా 13 వికెట్లతో భారత్‌కు ఓటమి రుచి చూపించాడు. 359 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 245 రన్స్‌కు ఆలౌటైంది. ఓపెనర్ జైస్వాల్ (77), జడేజా (42) మాత్రమే రాణించారు. శాంట్నర్ 6, ఎజాజ్ 2 వికెట్లు తీశారు. అంతకుముందు శనివారం మూడోరోజు కివీస్ రెండో ఇన్నింగ్స్ గంటలోనే ముగిసింది. జడేజా (3/72) టెయిలెండర్ల పని బట్టడంతో కివీస్ 255 రన్స్‌కు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్), బ్లండెల్ (41) ఆకట్టుకున్నారు. సుందర్‌కు 4, అశ్విన్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 259, భారత్ 156 రన్స్ చేశాయి. ఆఖరి టెస్టు వచ్చేనెల 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

ఆరంభం బాగున్నా..: భారీ ఛేదనను భారత్ దూకుడుగా ఆరంభించింది. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ 6,4 బాదాడు. అటు శాంట్నర్ చేతిలో రోహిత్ (8) అవుటైనా.. గిల్ (23), జైస్వాల్ ఎదురుదాడికి దిగారు. వీరి పోటాపోటీ బౌండరీలతో లంచ్ సెషన్ ముగిసేసరికి జట్టు 12 ఓవర్లలోనే 81/1 స్కోరు సాధించింది. కానీ సజావుగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు శాంట్నర్ చెక్ పెడుతూ గిల్ వికెట్ తీయడంతో రెండో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అంతే.. ఇక్కడి నుంచి భారత్ వికెట్ల పతనం సాగింది. జైస్వాల్ అవుటయ్యే దాకా ఓవర్‌కు ఆరు పరుగుల రన్‌రేట్‌తో సాగిన ఛేదన ఆ తర్వాత పూర్తిగా నెమ్మదించింది. రెండో సెషన్‌లోనే ఆరు కీలక వికెట్లు కోల్పోయి జట్టు పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆఖర్లో జడేజా, అశ్విన్ (18) పోరాటం కివీస్ బౌలర్లను పరీక్షించింది. అటు భారత్ విజయంపై ఆశలు రేపినా ఫలితం లేకపోయింది. మరోసారి శాంట్నర్ కివీస్‌కు ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తూ అశ్విన్‌ను అవుట్ చేశాడు. ఈ సమయంలో జడ్డూ భారీ షాట్లతో అలరించాడు. అయితే స్పిన్నర్ ఎజాజ్.. ఆకాశ్ (1), జడ్డూ వికెట్లను తీయడంతో కివీస్ విజయం అందుకుంది.

ఏదీ ఆ నైపుణ్యం?

కోహ్లీ, రోహిత్, జడేజా, అశ్విన్ వంటి సూపర్ స్టార్లు ఉండీ.. అదీ స్వదేశంలో.. అందునా స్పిన్ వికెట్‌పై భారత జట్టు ఘోర పరాభవాన్ని దేశ క్రికెట్ ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ మేటి క్రికెటర్లకు వయస్సు మీరినందున స్పిన్ బౌలర్లనూ సమర్థంగా ఎదుర్కోలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అశ్విన్‌కు 38 ఏళ్లు, రోహిత్ వయస్సు 37 సంవత్సరాలు, కోహ్లీ, జడేజా కూడా 36కి సమీపిస్తున్నారు. ఈనేపథ్యంలో వారిలో బ్యాటింగ్, బౌలింగ్‌లో గత నైపుణ్యాలు కొరవడ్డాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వయస్సు తరుముకొస్తుండడం నిజమే. కానీ స్వదేశంలో మన బ్యాటర్లు బ్యాటింగ్ చేసే విధానంలోనే లోపముంది. కొంతకాలంగా టెస్ట్ మ్యాచ్‌ల తొలి ఇన్నింగ్స్‌లో మనోళ్లు చాలినన్ని పరుగులు చేయలేకపోతున్నారు. 450 పరుగులు చేసినంత సమయం క్రీజులో ఉంటేనే పిచ్ నలిగి స్పిన్నర్లకు తోడ్పడుతుంది. కానీ మన టాపార్డర్ బ్యాటర్లు అంతసేపు బ్యాటింగ్ చేస్తే కదా! పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేయడం టెస్ట్ క్రికెట్‌లో ముఖ్యం. పైగా..స్పిన్నర్లను తిప్పికొట్టాలంటే చక్కని డిఫెన్సివ్ నైపుణ్యాలుండాలి. దిగ్గజాలు సచిన్, ద్రవిడ్, లక్ష్మణ్, గంగూలీ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొన్నారంటే ఓపిక, డిఫెన్స్ నైపుణ్యాలే కారణం. ప్రస్తుత ఐపీఎల్, టీ20 ఎరాలో యువ బ్యాటర్లే కాదు సీనియర్లలోనూ ఎక్కువ సమయం క్రీజులో ఉండాలనే ధోరణి కనిపించడంలేదు. పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ తీరును మార్చుకోకపోవడమే న్యూజిలాండ్‌తో తొలి రెండు టెస్ట్‌ల ఘోర పరాజయానికి కారణమనేది సుస్పష్టం. ఇక బీసీసీఐ ఏరికోరి తెచ్చుకున్న గంభీర్ చీఫ్ కోచ్‌గా అటు బ్యాటింగ్ ఇటు బౌలింగ్ విభాగాల్లో భారత్ బోల్తాపడడం గమనార్హం. గత జూలైలో శ్రీలంకపై ఆ దేశంలో టీ20 సిరీస్ గెలవడం ద్వారా గంభీర్ కోచింగ్ ప్రస్థానం ఘనంగా ప్రారంభమైంది. కానీ ఆ జట్టుతో వన్డే సిరీస్‌లో స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత జట్టు డొల్లతనం బయటపడింది. అసలంక, వెల్లలగే, హసరంగ, వాండర్సేతో కూడిన లంక స్పిన్‌ను రోహిత్, కోహ్లీ వంటి మహామహులతో కూడిన టీమిండియా ఎదుర్కోలేక వన్డే సిరీస్‌ను కోల్పోయింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'పోస్ట్‌మార్టం అవసరం లేదు'

మా ఆటతీరును పోస్ట్‌మార్టం చేయాలనుకోవడం లేదు. ఇదే బ్యాటర్లు గతంలో సిరీస్ విజయాలు అందించిన విషయం గుర్తుంచుకోవాలి. అయితే, 20 వికెట్లు సాధించినా బ్యాటర్లు కూడా పరుగులు చేయాల్సి ఉంది. కానీ అదే జరగలేదు. ఫలితం అనుభవించాం. ఇది సమష్టి వైఫల్యం. - రోహిత్ శర్మ

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259; భారత్ తొలి ఇన్నింగ్స్: 156

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లండెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; శాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌథీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; ఓరోక్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 69.4 ఓవర్లలో 255 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183, 6-231, 7-237, 8-238, 9-241, 10-255. **బౌలింగ్:** అశ్విన్ 25-2-97-2; సుందర్ 19-0-56-4; జడేజా 19.4-3-72-3; బుమ్రా 6-1-25-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) శాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 23; కోహ్లీ (ఎల్బీ) శాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) శాంట్నర్ 9; జడేజా (సి) సౌథీ (బి) ఎజాజ్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) శాంట్నర్ 18; ఆకాశ్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 60.2 ఓవర్లలో 245 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-34, 2-96, 3-127, 4-127, 5-147, 6-165, 7-167, 8-206, 9-229, 10-245. **బౌలింగ్:** సౌథీ 2-0-15-0; ఓరోక్ 1-0-5-0; శాంట్నర్ 29-2-104-6; ఎజాజ్ 12.2-0-43-2; ఫిలిప్స్ 16-0-60-1.

1 సొంతగడ్డపై ఓ క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ టెస్టు పరుగులు (1084), సిక్సర్లు (33) బాదిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. గుండప్ప విశ్వనాథ్ (1979లో 1047)ను అధిగమించాడు.

టెస్టుల్లో రెండుసార్లు విరాట్ కోహ్లీని అవుట్ చేసిన తొలి లెఫ్టామ్ స్పిన్నర్‌గా శాంట్నర్.

2 స్వదేశంలో ఎక్కువ టెస్టు ఓటములు (4) పొందిన రెండో కెప్టెన్‌గా కపిల్, అజరుద్దీన్‌తో సమంగా నిలిచిన రోహిత్. మన్సూర్ అలీఖాన్ (9) టాప్‌లో ఉన్నాడు. జట్టు కోహ్లీ కెప్టెన్సీలో రెండుసార్లు ఓడగా.. ధోనీ సారథ్యంలో మూడుసార్లు ఓడింది.

డబ్ల్యూటీసీ ఫైనల్ కష్టమే..

కివీస్ చేతిలో రెండు టెస్టుల ఓటమితో భారత జట్టు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతానికి 62.82 విజయాల శాతంతో జట్టు టాప్‌లోనే ఉన్నా ఫైనల్‌కు చేరాలంటే మాత్రం మిగిలిన ఆరు టెస్టుల్లో ఐదు గెలిచి, ఒకటి డ్రా చేసుకోవాలి. అంటే.. ఆఖరి టెస్టులో కివీస్‌పైనే కాకుండా ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల్లో నాలుగైనా గెలిస్తే నేరుగా తుది పోరుకు అర్హత సాధిస్తుంది. కానీ అదంత సులువు కాదు, కాబట్టి కనీసం రెండైనా గెలిచి నాలుగు డ్రా చేసుకున్నా, మిగతా జట్ల ఫలితాలపై ఆధారపడవచ్చు. అటు ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) జట్లు భారత్‌కు సవాల్ విసురుతున్నాయి.



హాకీ కుర్రాళ్లకు కాంస్యం

జొహర్ (మలేసియా): సుల్తాన్ జొహర్ కప్ అండర్-21 హాకీ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకం గెలుపొందింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో మనోళ్లు షూటౌట్‌లో 3-2తో న్యూజిలాండ్‌ను ఓడించి మూడో స్థానంలో నిలిచారు. ఇక ఫైనల్లో బ్రిటన్ 3-2తో ఆస్ట్రేలియాను కంగుతినిపించి విజేతగా నిలిచింది.

టైటాన్స్‌కు హ్యాట్రిక్ ఓటములు



హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్‌కు వరుసగా మూడో ఓటమి ఎదురైంది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 37-41తో దబాంగ్ ఢిల్లీ చేతిలో చిత్తయింది. పవన్ సెహ్రావత్ 18 పాయింట్లతో చెలరేగినా టైటాన్స్‌ను గెలిపించలేక పోయాడు. ఢిల్లీ తరఫున నవీన్, అషు మాలిక్ చెరో 15 పాయింట్లు సాధించారు. కాగా, యు ముంబా, బెంగాల్ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్ 31-31తో టైగా ముగిసింది.

సిరీస్ పాకిస్థాన్‌దే

రావల్పిండి: స్పిన్నర్లు నోమన్ అలీ (6/42), సాజిద్ ఖాన్ (4/69) ఇంగ్లండ్‌ను తిప్పేయడంతో ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్ 9 వికెట్లతో విజయం సాధించింది. దాంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 24/3తో శనివారం, మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 112 రన్స్‌కే కుప్పకూలింది. అనంతరం 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పాక్ 37/1 స్కోరు చేసి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 267, పాకిస్థాన్ 344 రన్స్ చేశాయి. పాక్ జట్టు స్వదేశంలో టెస్ట్ సిరీస్ నెగ్గడం 2021 తర్వాత ఇదే తొలిసారి.

ఆంధ్ర 295/6


విశాఖపట్నం (స్పోర్ట్స్): హిమాచల్ ప్రదేశ్‌తో శనివారం మొదలైన రంజీ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర భారీ స్కోరు దిశగా సాగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర.. మొదటిరోజు ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 295 రన్స్ చేసింది. కెప్టెన్ రషీద్ (69), విహారి (66), కేఎస్ భరత్ (65) అర్ధ శతకాలతో ఆదుకొన్నారు. మనీష్ గోలామారు (31), విజయ్ (20) క్రీజులో ఉన్నారు. రిషి ధవన్, దివేశ్ చెరో 2 వికెట్లు తీశారు. ఇక, పుదుచ్చేరితో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలిరోజు ఆట ముగిసేసరికి మొదటి ఇన్నింగ్స్‌లో 290/1 స్కోరు చేసింది.


మహిళల రెండో వన్డే నేడు
భారత్ X న్యూజిలాండ్
మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

ఆదివారం

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
డిప్లొమాట్ 2	వెబ్‌సిరీస్	అక్టోబర్ 29
టైమ్ కట్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 30
ది మాన్‌హట్టన్ ఏలియన్ అబ్‌డక్షన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 30
అమెజాన్ ప్రైమ్		
జోకర్	హాలీవుడ్ చిత్రం	అక్టోబర్ 29
జియో సినిమా		
సమ్‌బడీ సమ్‌వేర్ 3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 28
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
విజర్డ్స్ బియాండ్ వేవర్లీ ప్లేస్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 30
తంగలాన్	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 31
లబ్బర్ పందు	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 31
కిష్కిందకాండ	మలయాళ చిత్రం	నవంబర్ 01
జీ 5		
మిథ్య: ది డార్క్ ఛాప్టర్	హిందీ చిత్రం	నవంబర్ 01
ఆహా...		
అంజామై	తమిళ చిత్రం	అక్టోబర్ 29

సైకలాజికల్ థ్రిల్లర్



2019లో విడుదలై ఆస్కార్ పురస్కారాలు అందుకున్న 'జోకర్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందింది 'జోకర్: ఫోలీ అ దూ'. ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌కు టాడ్ ఫిలిప్స్ దర్శకత్వం వహించాడు. జోక్విన్ ఫీనిక్స్ టైటిల్ పాత్రను పోషించారు. లేడీగాగా కీలకపాత్ర పోషించారు. టీవీషోలో ముర్రే ఫ్లాంక్లిన్‌ను జోకర్ చంపిన రెండున్నర ఏళ్ల తర్వాత కథ మొదలవుతుంది. అతనిపై మోపిన నేరాన్ని రుజువుచేసి ఉరిశిక్ష పడేలా చేసేందుకు కోర్టులో లాయర్లు ప్రయత్నిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో అతను జైలు నుంచి ఎలా బయటపడ్డాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది.

పండుగ రోజూ నిద్రపోవాలి

పండుగలు వచ్చాయంటే బంధువులు, స్నేహితులు వస్తారు. సరదాగా బయటకు వెళ్తారు. వీటన్నింటి వల్ల ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తాయి. నిద్ర వేళలు అటూ ఇటూ అవుతాయి. దీని ప్రభావం పండుగ తర్వాత కూడా ఉంటుంది. ముఖ్యంగా నిద్ర లేకపోవటం వల్ల చిరాకుగా కూడా ఉంటుంది. అందువల్ల పండుగ సమయంలో నిద్రను నియంత్రించటానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

- రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం. పండగలలో ఈ నిద్ర గంటలు గణనీయంగా తగ్గిపోతాయి. అందువల్ల వీలైనంత వరకు ఈ నిద్ర గంటలు తగ్గకుండా చూసుకోవాలి. దీని వల్ల



  పండుగ మర్నాడు ఫ్రెష్‌గా ఉండగలుగుతారు.
- వీలైనంత వరకు విందు భోజనాలను మధ్యాహ్నమే చేస్తే మంచిది. రాత్రి పూట చేస్తే సరిగ్గా నిద్ర పట్టదు. అంతే కాకుండా పండగ రోజుల్లో పనుల్లో పడిపోయి తక్కువ నీళ్లు తాగుతారు. అలా కాకుండా పండగ రోజుల్లో కనీసం రెండు లీటర్ల నీళ్లు తాగటాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలి. అప్పుడు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు.
- బంధుమిత్రులను కలిసిన ఉత్సాహం వల్ల ఎక్కువ ఉత్సుకతకు లోనవుతూ ఉంటారు. దీని వల్ల ఆలోచనలపై నియంత్రణ ఉండదు. పండగ రోజుల్లో నిద్ర పట్టకపోవటానికి ఇది కూడా ఒక కారణం. అందువల్ల పడుకొన్నే ముందు కొంత సేపు ధ్యానం వంటివి చేస్తే త్వరగా నిద్ర పడుతుంది.
- కొందరు మధ్యాహ్నం సమయం చిక్కినప్పుడు నిద్ర పోతారు. దీని వల్ల రాత్రి నిద్ర వేళల్లో మార్పు వస్తుంది. అందువల్ల మధ్యాహ్నం నిద్రపోకుండా ఉంటే మంచిది.



తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొద్దిరోజుల్లోనే స్టార్‌నటిగా గుర్తింపు పొందారు మీనాక్షి చౌదరి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' చిత్రంతో తెలుగు సినిమారంగ ప్రవేశం చేసిన ఆమె ప్రస్తుతం టాలీవుడ్ స్టార్‌హీరోల సరసన నటిస్తోంది. 'గోట్' సినిమాలో దళపతి విజయ్‌తో కలిసి ఆడిపాడింది. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి సినీనటిగా రాణిస్తున్న హర్యానా భామ **మీనాక్షి చౌదరి** గురించి మరిన్ని విశేషాలు ఇవి...

ఎప్పటికీ గుర్తుండిపోవాలి

'డాక్టర్ కావాలనుకున్నాను కానీ యాక్టర్ అయ్యాను' అని నటీనటులు చెబుతుండటం వింటూనే ఉంటాం. కానీ ఈ నటి మాత్రం డాక్టర్ చదివి నటిగా మారారు. హర్యానాలోని పంచకులలో జన్మించిన మీనాక్షిచౌదరి నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఇన్ డెంటల్ సర్జరీ పూర్తి చేశారు. మోడలింగ్‌పై మక్కువతో అటువైపు అడుగులు వేశారు. అంతేకాదు మీనాక్షి రాష్ట్రస్థాయి స్విమ్మర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కూడా. ఆమె తండ్రి బి.ఆర్ చౌదరి ఆర్మీలో కల్నల్‌గా పనిచేశారు.

సినిమాలతో బిజీ బిజీ

మీనాక్షి కాలేజీ చదివే రోజుల్లోనే మోడలింగ్‌పై ఆసక్తి పెంచుకున్నారు. 2018లో ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ టైటిల్ గెలుచుకున్నారు. ఈ విజయంతో ఆమెకు మోడలింగ్‌లోనూ, సినీ రంగంలోనూ అవకాశాలు వెల్లువెత్తాయి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ తరువాత రవితేజతో కిలాడీ, అడవిశేష్‌తో హిట్ సినిమాలో నటించారు. గుంటూరు కారం సినిమాలో మహేష్‌బాబు సరసన చేసే అవకాశం రావడంతో స్టార్‌నటీమణుల జాబితాలో చేరారు. దళపతి విజయ్‌తో 'గోట్' సినిమాలో జత కట్టడంతో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ప్రస్తుతం 'లక్కీబాస్కర్', 'మట్కా' వంటి పలు సినిమాలతో బిజీగా ఉన్నారు మీనాక్షి. మెగాస్టార్ మూవీ 'విశ్వంభర'లోనూ నటిస్తున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా అవకాశం రాకముందు 'అవుటాఫ్ లవ్' అనే వెబ్‌సిరీస్‌లో నటించారామె.

మిస్ ఇండియా టైటిల్‌తో...

2017లో ఇండియన్ మిలిటరీ అకాడమీ ఆటం బాల్ నైట్‌లో జరిగిన అందాల పోటీల్లో 'మిస్ ఐఎమ్‌ఏ'గా గెలవడంతో మీనాక్షి కెరీర్ ప్రారంభమైంది. మిలిటరీ కేడెట్స్‌ల శిక్షణ ముగిసిన అనంతరం వారి గౌరవార్థం ఈ ఈవెంట్‌ని నిర్వహిస్తారు. ఈ టైటిల్‌ను గెలుచుకున్న తరువాత పాటియాలాలో ఫ్యాషన్ బిగ్‌బజార్ స్పాన్సర్ చేసిన 'క్యాంపస్ ప్రిన్సెస్ 2018' పోటీల్లో పాల్గొని ఒక రీజనల్ రౌండ్‌లో విజేతగా నిలిచారు. తరువాత ఫెమినా మిస్ హర్యానా 2018 టైటిల్‌ను గెలుచుకున్నారు మీనాక్షి. ఆ తరువాత భారత్‌లో జరిగే బిగ్గెస్ట్ బ్యూటీ కాంటెస్ట్‌గా గుర్తింపు పొందిన ఫెమినా మిస్ ఇండియా 2018 కిరీటాన్ని గెలుచుకున్నారు. ఈ విజయంతో అదే ఏడాది మయన్మార్‌లోని యాంగాన్‌లో జరిగిన మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీలకు భారత్ తరపున ప్రాతినిధ్యం



> సమయం ఎవ్వరికోసం ఆగదు. అది సినిమా ఇండస్ట్రీకి మాత్రమే కాదు. అన్ని రంగాలకూ వర్తిస్తుంది. నా తల్లిదండ్రుల నుంచి ఆ విషయాన్ని నేర్చుకున్నాను

వహించే అందుకున్నారు. మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీల్లో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు.

ట్రావెలింగ్ ఇష్టం

షూటింగ్స్ బిజీగా ఉండే మీనాక్షి ఖాళీ సమయం దొరికితే ట్రావెలింగ్‌కు వెళ్లడాన్ని ఇష్టపడతారు. "కొత్త ప్రదేశాలను చుట్టి రావడమంటే చాలా ఇష్టం. నాకు కొత్త కొత్త సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మా నాన్న ఆర్మీ ఉద్యోగి కాబట్టి ట్రావెలింగ్ అనేది నా జర్నీలో ఒక భాగంగా మారింది. మిస్ ఇండియా టైటిల్ గెలుచుకున్నాక దక్షిణ కొరియాతో పాటు నాకిష్టమైన మరికొన్ని దేశాలు తిరిగొచ్చాను" అని అంటారు మీనాక్షి చౌదరి. అందాల పోటీల్లో విజేతగా నిలిచాక మోడలింగ్ రంగంలో, సినీ రంగంలో అవకాశాలు తలుపుతట్టాయి. వచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ సినీ రంగంలో ప్రముఖ నటిగా స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. "టైటిల్ గెలుచుకున్నాక నాపై ఎన్నో బాధ్యతలు వచ్చి చేరాయి. ఆ సమయంలో నా తల్లిదండ్రులు, స్నేహితులు నాకు సపోర్టుగా నిలిచారు. కాస్త తీరిక దొరికినా ఫోన్ చేసి వాళ్లతో మాట్లాడుతూ ఉంటాను" అని చెబుతారు మీనాక్షి. అవకాశాలు వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలన్న సూత్రాన్ని ఆమె బాగా వంటబట్టించుకున్నారు. "సమయం ఎవ్వరికోసం ఆగదు. అది సినిమా ఇండస్ట్రీకి మాత్రమే కాదు. అన్ని రంగాలకూ వర్తిస్తుంది. నా తల్లిదండ్రుల నుంచి ఆ విషయాన్ని నేర్చుకున్నాను" అని అంటారు మీనాక్షి. టైమ్స్ 50 మోస్ట్ డిజైరబుల్ వుమెన్ ఇన్ ఇండియా 2018 జాబితాలో మీనాక్షి చౌదరి రెండో స్థానంలో నిలిచారు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఒక ఇంటర్నెట్ సర్వేను నిర్వహించి ఈ జాబితాను వెలువరించింది. "ప్రతి సినిమాకు నా నటనను మెరుగుపరుచుకుంటున్నాను. సినిమా ఇండస్ట్రీలో అనుష్కశెట్టి, నయనతార, త్రిష వంటి నటీమణులు నాకు ఆదర్శం. ఇండస్ట్రీలో వాళ్లు చాలా కాలం ప్రేక్షకులను అలరించారు. వాళ్లలా నేనూ గుర్తింపు తెచ్చుకోవాలి. అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకునే సినిమాల్లో నేనూ భాగం కావాలి. నాకు ఆటలంటే ఇష్టం. ఎప్పటికైనా స్పోర్ట్స్ రిలేటెడ్ మూవీలో నటించాలని ఉంది. ఒక డెంటిస్ట్‌ను కాబట్టి ఆన్‌స్క్రీన్‌లో డాక్టర్ రోల్ కూడా చేయాలని ఉంది" అని తన డ్రీమ్‌రోల్స్ గురించి చెబుతారు మీనాక్షి చౌదరి.

హృదయమున్న అందం

మిస్ ఇంటర్నేషనల్

అందం, తెలివి, సామాజిక బాధ్యత... వీటన్నిటి కలబోత రాచెల్ గుప్తా. పద్దెనిమిదేళ్లకే వ్యాపార రంగంలో అడుగుపెట్టిన ఈ జలంధర్ బ్యూటీకి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక మిలియన్‌కు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. తాజాగా 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్'గా నిలిచి, ఆ టైటిల్ పొందిన తొలి భారతీయురాలుగా ఘనత సాధించిన రాచెల్ దాతృత్వంలోనూ ముందుంటుంది.

రాచెల్ గుప్తాకు అస్సలు నచ్చని విషయం... పదిమందిలో ఒకరుగా మిగిలిపోవడం. "ప్రతివారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటనేది అందరికన్నా వాళ్ళకే బాగా తెలుస్తుంది. దాన్ని ఉపయోగించుకున్నవారే రాణిస్తారు" అంటుంది రాచెల్. ఈనెల 25న థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్-2024' పోటీల్లో టైటిల్ గెలిచిన ఆమె... ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలుగా, మూడవ ఆసియన్‌గా చరిత్రకెక్కింది. ఫిలిప్పీన్ సుందరికి, రాచెల్‌కు మధ్య హోరాహోరీ పోటీ నడిచింది. కానీ ప్రశ్నోత్తరాల రౌండ్‌లో రాచెల్‌దే పైచెయ్యి అయింది. "ప్రపంచంలో ఈ రోజు పరిష్కరించాల్సిన అత్యంత తీవ్రమైన సమస్య ఏదని మీరనుకుంటున్నారు? వాటికి మీరే పరిష్కారాలు సూచిస్తారు?"... ఇది ప్రతి ఫైనలిస్ట్‌నూ న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్న. దానికి రాచెల్ బదులిస్తూ "ఈ రోజు అత్యంత క్లిష్టమైన సమస్య పేదరికం. దీనికి అధిక జనాభా, వనరులు పరిమితంగా ఉండడం కారణం. అంతర్జాతీయంగా జనాభా నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ప్రతి ఒక్కరికీ తగినన్ని వనరులు అందేలా చూసే బాధ్యతను ప్రపంచ నేతలు తీసుకోవాలి. నేను భారతదేశం నుంచి వచ్చాను. అక్కడ ప్రతి ఒక్కరికీ ఆహారం, నీరు, విద్య, మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవు. ప్రపంచంలో



చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందనేది వాస్తవం. పరస్పరం పోరాడుకోవడం ఆపేసి, ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఈ భూమి మీద ప్రతి ఒక్కరికీ తగినన్ని వనరులు సమకూరేలా చూడాల్సిన సమయం ఇది" అని చెప్పిన మాటలు న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాయి. ఆమెను విజేతగా నిలబెట్టాయి.

ఈ విజయం స్ఫూర్తితో...

పంజాబ్‌లోని జలంధర్‌లో రాచెల్ పుట్టి పెరిగింది. ఆమె తండ్రి రాజేశ్ గుప్తా వ్యాపారవేత్త. కళలంటే ఆమె తల్లితండ్రులకు ఎంతో ఇష్టం. రాచెల్‌ను, ఆమె సోదరి నిర్ఝర్‌ను ఆ దిశగా ప్రోత్సహించారు. స్కూల్లో చదువుతున్నప్పుడే సాంస్కృతిక కార్యక్రమాల్లో రాచెల్ చురుగ్గా పాల్గొనేది. మరోవైపు వ్యాపార దక్షత కూడా ఆమెకు కుటుంబ వారసత్వంగా వచ్చింది. 2022లో... పద్దెనిమిదేళ్ళకే- సౌందర్య సేవలను అందించే 'ది గ్లామ్ బార్' పేరిట సెల్ఫ్‌కేర్ సెలూన్ ప్రారంభించింది. ఫిలాసఫీలో డిగ్రీ చేస్తూనే... మోడల్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2022లో పారిస్‌లో జరిగిన 'మిస్ సూపర్ టాలెంట్ ఆఫ్ ది వరల్డ్' కాంపిటిషన్‌లో టైటిల్ గెలుచుకోవడంతో అంతర్జాతీయ ఫ్యాషన్ రంగంలో ఆమె పేరు మారుమోగింది. ఈ ఏడాది ఆగస్టులో జైపూర్‌లో జరిగిన 'మిస్ గ్రాండ్ ఇండియా-2024'లో విన్నర్‌గా నిలిచి, ప్రతిష్టాత్మకమైన 'మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్-2024'లో భారత్ తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ పోటీలో 68 దేశాల ప్రతినిధులను ఎదుర్కొన్న రాచెల్... భారత్‌కు తొలిసారిగా ఈ టైటిల్ అందించింది. "సంతోషంతో నాకు నోట మాట రావడం లేదు. ఈ విజయం స్ఫూర్తిగా... మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ తరఫున ప్రపంచ శాంతికి, సుస్థిరతకు నిబద్ధతతో పని చేస్తాను" అంటూ రాచెల్ స్పందించింది.

ఇష్టమే ప్రేరణగా....

సోషల్ మీడియాలో రాచెల్ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు పదిలక్షల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇంగ్లీష్, హిందీ, పంజాబీ ధారాళంగా మాట్లాడే



రాచెల్... పోటీల కోసం థాయిలాండ్ వెళ్ళినా తన సామాజిక బాధ్యతను మరచిపోలేదు. బ్యాంకాక్‌లోని ఫౌండేషన్ ఫర్ స్లమ్ చిల్డ్రన్ కేర్‌ను సందర్శించి, పదివేల థాయి భాట్స్ విలువైన సామగ్రిని అందజేసింది. ఆమె సేవా, దాతృత్వ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనడమే కాదు... ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తుంది. ఇంతకీ మోడలింగ్, బిజినెస్, సోషల్ సర్వీస్... రాచెల్ వీటిలో దేన్ని ఎక్కువగా ఇష్టపడుతుంది? "నేను మోడలింగ్ చెయ్యాలనుకుంటున్నానని చెప్పినప్పుడు... నా తల్లితండ్రులు దిగ్భ్రాంతి చెందారు. నా నిర్ణయాన్ని మార్చుకొనేలా ఒప్పించడానికి ప్రయత్నించారు. కానీ నా భవిష్యత్తు విషయంలో నాకు స్పష్టమైన ప్రణాళిక ఉంది. నేను రాణించేది వ్యాపార రంగంలోనేనని నాకు తెలుసు. అందులోనే స్థిరపడతాను కూడా. కానీ ఫ్యాషన్ రంగం, మోడలింగ్ నాకు చాలా ఇష్టం. కాబట్టే ఇటువైపు వచ్చాను. ఆ ఇష్టమే ఫ్యాషన్ షోలలో, అందాల పోటీల్లో పాల్గొనడానికి ప్రేరణనిచ్చింది. ప్రస్తుతానికి అదే నా ప్రధానమైన కెరీర్. ఇక 'సామాజిక సేవ అందరి బాధ్యత' అనే భావన కూడా మా కుటుంబం చేసే సేవా కార్యక్రమాల ద్వారానే నాలో బలపడింది. అది ఎప్పటికీ కొనసాగుతుంది అంటోంది రాచెల్.

బొప్పాయితో బోలెడు ఆరోగ్యం


అంత తియ్యగా కాకుండా ప్రత్యేకమైన రుచితో ఉండే బొప్పాయి పండుని ఇష్టపడనివారుండరు. ఉదయాన్నే పరగడుపున తినదగ్గ పండ్లలో బొప్పాయి ఒకటి. ఇది శరీరాన్ని డీటాక్స్ చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఏడాది పొడవునా దొరికే బొప్పాయి పండు అందించే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- ఉదయాన్నే ఒక కప్పు బొప్పాయి పండు ముక్కలు తింటే ఇందులోని ఫైబర్ వల్ల తొందరగా ఆకలి అనిపించదు. పొట్ట చుట్టూ పేరుకున్న క్రొవ్వు కరగడంతో పాటు అధిక బరువును నివారిస్తుంది. జీర్ణ క్రియను మెరుగుపరచి కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది.
- బొప్పాయిలో ఉండే కెరోటినాయిడ్స్, లైకోపీన్ తదితర యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి క్యాన్సర్ కణాలను అడ్డుకుంటాయి. అల్జీమర్స్, మధుమేహం, కాలేయ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలను నివారిస్తాయి. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రాకుండా చేస్తాయి. ఈ పండులోని బీటా కెరోటిన్ పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్‌ను నిరోధిస్తుంది.
- ఒక గ్లాస్ బొప్పాయి పండు జ్యూస్‌లో కొంచెం నిమ్మరసం కలిపి రోజుకి రెండు లేదా మూడు సార్లు తాగితే డెంగ్యూ జ్వరం, మలేరియాల నుంచి బయటపడవచ్చు. బొప్పాయి చెట్టు ఆకుల రసాన్ని పూటకి ఒక చెంచా చొప్పున తాగితే రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతుంది.



- బాగా పండిన బొప్పాయిలో కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలకు బలానిస్తుంది. ఇందులో లభించే సి విటమిన్ వల్ల దంతాలు, చిగుళ్ల సమస్యలు; బి విటమిన్ వల్ల నోటి పూత, పెదాల పగుళ్లు; ఎ విటమిన్ వల్ల కంటి జబ్బులు తొలగిపోతాయి.
- బొప్పాయి పండును తరచూ తినడం వల్ల ఇందులోని ఇ విటమిన్ చర్మం ముడుతలు పడకుండా నివారిస్తుంది. చర్మం మీద మృత కణాలను తొలగించి మెరిసేలా చేస్తుంది. కాలిన గాయాలను త్వరగా తగ్గిస్తుంది.
- ప్రతి రోజూ అల్పాహారంలో బొప్పాయి పండు ముక్కలు తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులోని న్యూట్రియెంట్స్, పొటాషియం, మెగ్నీషియం, ఇతర మినరల్స్ రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయి. ఈ పండులో సుగర్ చాలా తక్కువగా ఉంటుంది. అందుకే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉండి గుండె జబ్బులు రాకుండా చేస్తుంది..

పండుగ వేళ మురిపించే జుంకాలు



దీపావళి వచ్చేస్తోంది. పండుగ రోజున ప్రత్యేకంగా కనిపించాలని మహిళలంతా కోరుకొంటారు. ప్రత్యేకించి లక్ష్మీపూజకి చక్కని చీర, నగలతో ముస్తాబవుతారు. చీరకు తగ్గట్టు జుంకాలు కూడా పెట్టుకుంటే ముఖం దేదీప్యమానంగా మెరిసిపోతుంది. పండుగ రోజున అలా మురిపించే జుంకాలు మీకోసం...

ముత్యాల జుంకాలు

- తెల్లని ముత్యాలు వరుసగా పేర్చిన జుంకాలు, ఒక పెద్ద సైజు ముత్యం వేలాడేలా ఉండే బుట్టలు యువతులకు బాగా నప్పుతాయి. నీలం, గులాబీ, ఎరుపు వంటి ముదురు రంగు పట్టుచీరలు కట్టుకున్నపుడు ముత్యాల చోకర్‌తోపాటు వీటిని ధరిస్తే చాలా అందంగా కనిపిస్తారు. వెడల్పాటి గుండ్రని ముఖం ఉన్నవారికి ఇవి అద్భుతంగా సూటవుతాయి. కొంచెం ఛాయ తక్కువగా ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా వీటిని పెట్టుకోవచ్చు. సన్నని ముత్యాలతో కూడిన చెంపస్వరాలు అదనపు అందాన్నిస్తాయి.

చాంద్‌బాలీలు

- గోల్డ్ బాల్స్ లేదా ముత్యాలు వేలాడేలా అర్ధచంద్రాకారంలో రూపొందించిన చాంద్‌బాలీలను ఇష్టపడని మగువలు ఉండరు. ఇవి రెండు, మూడు వరసల్లో కూడా లభ్యవుతాయి. రంగు రంగుల బీడ్స్‌తో రూపొందించిన చాంద్‌బాలీలు అన్ని చీరలమీదికి సూటవుతాయి. కోలముఖం ఉన్నవారికి ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి.



పోల్కీ డ్రాప్స్

- వజ్రాలు, అమెరికన్ డైమండ్స్, పగడాలతో రూపొందించిన పోల్కీ డ్రాప్స్ మధ్య వయసు మహిళలకు బాగా నప్పుతాయి. చక్కగా కొప్పు పెట్టుకొని వీటిని ధరిస్తే హుందాగా కనిపిస్తారు.

టెంపుల్ జుంకాలు

- ప్రస్తుతం టెంపుల్ జువెలరీకి అత్యధికంగా ఆదరణ ఉంది. దేవతా మూర్తులు, హంసలు, నెమళ్లు, లతలు, పూలతో రూపొందించిన పెద్ద సైజు బుట్టలు గ్రాండ్‌గా కనిపిస్తాయి. వీటికి ముత్యాలు, కెంపులు, పచ్చలు వేలాడేలా కూడా తయారు చేస్తున్నారు. ఈ జుంకాలు పట్టుచీరలమీద రిచ్‌లుక్‌ని ఇస్తాయి.



రెడ్ బీడ్ జుంకాలు

- ఎరుపు రంగు బీడ్స్ అమర్చిన పెద్ద సైజు బుట్టలు అమ్మాయిలకు ఆకర్షణీయంగా ఉంటాయి. ముత్యాలు, కెంపులు కూడా చేర్చి రిచ్‌గా కనిపించేలా వీటిని రూపొందిస్తున్నారు. పండుగవేళ అమ్మవారికి ఇష్టమైన ఎరుపు రంగు జుంకాలు పెట్టుకోవడం శుభప్రదం.



కాలం చెల్లడంతో రోజు రోజుకూ బస్సుల సంఖ్య కుదిస్తూ వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ.. క్రమంగా ప్రయాణికులకు దూరమవుతోంది! ఆర్టీసీని ఆదరించే ప్రయాణికులు, కష్ట పడే కార్మికులకు కొదవ లేకపోయినా బస్సుల సంఖ్య ఏటా తగ్గుముఖం పడుతుం డటం ఆందోళన కలిగిస్తోంది. డీజిల్ ధరల భారం, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ఒక్క కొత్త బస్సు కొనకపోవడం, డొక్కు బస్సులు ఎక్కడికక్కడ ఆగిపోవడం, ప్రైవేటు అక్రమ రవాణా లాంటివన్నీ ఆర్టీసీ వెన్ను విరుస్తున్నాయి. విద్యార్థులు మొదలుకుని.. సామాన్యుల వరకు ఆర్టీసీపైనే ఎక్కువగా ఆధారపడినా.. ఇప్పుడు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు సేవా భావంతో నడిచే రోడ్డు రవాణా సంస్థ ఇప్పుడు ఉనికి కోల్పోకుండా ఉండేందుకు దిక్కులు చూస్తోంది!!

ఆర్టీసీ.. నీ రూటు ఎటు?

ప్రజలకు దూరంగా ప్రజా రవాణా!

- బస్సులు లేక రూట్లు, సర్వీసులు రద్దు
- ఐదేళ్లలో ఒక్క బస్సూ కొనని వైసీపీ సర్కారు
- రివర్స్ టెండరింగ్‌తో అద్దె బస్సులు రాంరాం
- నానాటికీ తీసికట్టుగా ఏపీఎస్ ఆర్టీసీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రతి గ్రామానికీ బస్సు నడపాలి.. మారుమూల ప్రజల ప్రయాణ సమస్య తీర్చాలి.. ఇదీ ప్రభుత్వ లక్ష్యం! కానీ.. ఆదాయం వచ్చే రూట్లలోనే బస్సులు నడుపుదాం.. నష్టాలు వచ్చే రూట్లలో రద్దు చేద్దాం.. అంటోంది ప్రజా రవాణా సంస్థ!! ఫలితంగా రాష్ట్రంలోని పల్లెలకు క్రమంగా బస్సులు తగ్గుతున్నాయి. బస్సు సర్వీసులతోపాటు రోజు వారీ తిరిగే కిలోమీటర్ల దూరం గడచిన ఆరేళ్లలో 45లక్షల నుంచి 38లక్షల కిలోమీటర్లకు పడిపోయింది. దీంతో ప్రజా రవాణా సంస్థ మనుగడే కష్టమవుతోంది. ఒకప్పుడు ఆసియా ఖండంలోరు అతి పెద్దదిగా పేరు తెచ్చుకున్న ఏపీఎస్ఆర్టీసీ ఇప్పుడు ఆంధ్రాలో అపసోపాలు పడుతోంది. రాష్ట్ర విభజన(2014 జూన్) నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో 12,250 బస్సులున్న ప్రజా రవాణా సంస్థకు ఇప్పుడు 26జిల్లాల్లో అద్దె బస్సులతో కలిపి 10వేలు కూడా లేవంటే సంస్థ ఏ స్థాయిలో కునారిల్లుతోందో అర్థం చేసుకోవచ్చు. కొత్తగా 1,489 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించిన ఆర్టీసీ ఎండీ ఈ ఏడాది ఏప్రిల్ నాటికి కూడా కొత్త బస్సులు తీసుకు రాలేక పోయారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి కొత్త బస్సుల రాక మొదలైనా నాలుగు నెలల్లో వచ్చింది 630మాత్రమే. ఇక, ఎన్డీఏ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీ నెరవేర్చాలంటే సుమారు 4వేల కొత్త బస్సులు కావాలి. సాధ్యం కాకపోతే సగమైనా కొని వాటికి తోడు అద్దె బస్సులు తెచ్చుకోవాలి. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆర్టీసీలో ప్రవేశ పెట్టిన రివర్స్ టెండరింగ్ విధానంతో అద్దె బస్సులకు టెండర్లు రావట్లేదు.. వచ్చినా గిట్టుబాటుగాక రద్దు చేసుకొంటున్నారు.

విద్యార్థుల అవస్థలు

ప్రతి నెలా కొన్ని బస్సులను తగ్గిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం.. ఉన్న బస్సుల్లోనూ కొన్ని ట్రిప్పులు తగ్గిస్తోంది. ఒక బస్సు రోజుకు సరాసరి 376కి.మీ తిరగాలి. దూర ప్రాంత బస్సులు 500కి.మీ వరకూ వెళితే పల్లె వెలుగు బస్సులు డిపో పరిధిలో దగ్గరి రూట్లలో 250కి.మీ వరకూ(8నుంచి 12 సింగిల్స్) తిరుగుతాయి. అయితే ఉదయం సాయంత్రం వేళల్లో మాత్రమే తిప్పుతూ మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు సింగిల్స్ రద్దు చేస్తున్నారు. ఈ పరిస్థితి పల్లెల్లోకే కాకుండా విజయవాడ-గుంటూరు మధ్యలో, కర్నూలు-నంద్యాల మధ్య, విశాఖపట్నం-అనకాపల్లి వంటి రూట్లలోనూ ఉంది. నష్టాల పేరుతో ఆర్టీసీ యాజమాన్యం బస్సులను తగ్గిస్తుండటంతో ప్రధానంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు



లను ఆశ్రయించే విద్యార్థులు వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలో 10లక్షల మంది విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇచ్చామని ఆర్టీసీ చెబుతున్నా, అందుకు తగ్గట్టు విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా పల్లెల నుంచి పట్టణాలకు బస్సులు తిప్పడం లేదన్నది విద్యార్థి సంఘాల ఆరోపణ. గత్యంతరం లేక విద్యార్థులు సైకిళ్లు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

కరుగుతున్న కార్మిక శక్తి

ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ సిబ్బంది 1.19 లక్షలుండగా విభజన తర్వాత మన రాష్ట్రానికి 58శాతం మంది వచ్చేశారు. ఆర్టీసీ పూర్తిగా విభజన అయ్యే నాటికి ఏపీలో 62వేల మంది ఉండగా ప్రస్తుతం వారి సంఖ్య 47,500 మాత్రమే. అంటే ఓ వైపు బస్సులు తగ్గిస్తూ మరోవైపు కార్మికులను తగ్గిస్తూ ఆర్టీసీని యాజమాన్యం ఎటువైపు తీసుకెళుతోందన్నది అర్థంకాని ప్రశ్న!. 2016లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 126 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ ఆపరేషన్ పరిధి ఉండేది. అదిప్పుడు 119 కోట్ల కన్నా తక్కువకు పడిపోయింది. ప్రతి రోజూ సరాసరి 375 కి.మీ. తిరిగే బస్సు ప్రస్తుతం 365కి.మీ. పడిపోయింది. బస్సు సిబ్బంది నిష్పత్తి సంఖ్య తగ్గిపోయింది. పదవీ విరమణ పొందిన



సిబ్బంది స్థానంలో కొత్తగా నియామకాల్లేక పోవడం, ఉన్న సిబ్బందిని తగ్గించే చర్యలు యాజమాన్యం చేపట్టడం, టిమ్స్ పెంచి డ్రైవర్లపై పనిభారం పెంచడం, సింగిల్ క్రూ డ్యూటీలు, గ్రౌండ్ బుకింగ్ లాంటి చర్యలతో కార్మిక శక్తి కరిగిపోతోంది.

కొత్త బస్సులు కొనాలి.. సిబ్బంది పెరగాలి



సంస్థకు వస్తున్న నష్టాలకు కారణాలను విశ్లేషించి ఉత్పాదకత పెంచుకునే ప్రయత్నం చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు సూచిస్తున్నారు. 'కార్మికులను తగ్గిస్తే సంస్థకు భారం తగ్గుతుందనే ఆలోచనే సరికాదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే డీజిల్ పొదుపులో ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లే అవార్డులు తీసుకొంటున్నారు. లూబ్రికెంట్ ఆయిల్, టైర్ల అరుగుదల, పనిగంటలు అన్నింట్లోనూ కార్మికులు శక్తిమేర పని చేస్తున్నారు. అన్నిటి కన్నా ముందు అక్రమ రవాణా అరికట్టాలి. ఉద్యోగ సంఘాలతో కలిసి రూట్ సర్వే చేపట్టాలి. కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నడపాలి. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకలో కొత్తవి కొంటూనే ఉన్నారు. ఏపీలోనూ కొత్త బస్సులు కొని సిబ్బంది ఖాళీలు పూర్తి చేయాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన ప్రయాణ సేవలు అందుతాయి' అని కార్మిక సంఘాలు, ఉద్యోగ అసోసియేషన్ల నేతలు సూచిస్తున్నారు.

పూర్తిస్థాయి ఎండీ ఇంకెప్పుడు?

పది వేల బస్సులు.. 130డిపోలు.. 47వేల మందికి పైగా సిబ్బందితో రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలకు ప్రయాణ సేవలందిస్తున్న ఏపీఎస్ఆర్టీసీకి పూర్తి స్థాయి ఎండీ లేకపోవడం లోటుగా కనిపిస్తోంది. నాలుగు నెలల క్రితమే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు రాష్ట్ర డీజీపీగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయనకే ఆర్టీసీ ఎండీ అదనపు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి ఎండీని ఇప్పటి వరకూ నియమించలేదు. దీనికితోడు ఇటీవల ఈడీల బదిలీల్లో ఆర్ఎంలను తీసుకొచ్చి ఎఫ్ఏసీలుగా ఇచ్చారు. సంస్థ సజావుగా నడవాలంటే పూర్తిస్థాయి ఎండీని నియమించాల్సి ఉంది.

'ఇరుముడి'తోనే విమాన ప్రయాణం

- స్వాములకు ప్రత్యేక వెసులుబాటు: రామ్మోహన్

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప మాల ధరించే స్వాములకు పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తీపికబురు చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కేరళలోని శబరిమలకు మాలధారులు ఇరుముడితోనే విమానాల్లో ప్రయాణించవచ్చని తెలిపారు. అయ్యప్ప భక్తుల వినతితో ఈ మేరకు నిబంధనలను సడలించినట్టు చెప్పారు. అందుకు అనుగుణంగా పౌరవిమానయాన భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. శ్రీకాకుళంలోని క్యాంపు కార్యాలయం నుంచి మంత్రి శనివారం ఓ వీడియో సందేశం విడుదల చేశారు. భద్రతా కారణాల రీత్యా విమానంలో కొబ్బరికాయతో కూడిన ఇరుముడిని ఇన్నాళ్లూ అనుమతించలేదన్నారు. దీంతో స్వాములు రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేదని తెలిపారు. ఈ క్రమంలో అయ్యప్ప భక్తుల విజ్ఞప్తి మేరకు నిబంధనలు సడలించామని, ఈ సౌలభ్యం మకరజ్యోతి దర్శనం ముగిసే వరకు(జనవరి 20) అందుబాటులో ఉంటుందని తెలిపారు. తాజా ఉత్తర్వులతో ఎయిర్‌పోర్టు సిబ్బంది స్కానింగ్ చేసిన తర్వాత భక్తులు నేరుగా ఇరుముడితో విమానాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.

కొల్లేరు ఆక్రమణలతోనే బుడమేరుకు వరద

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ఆక్రమణలతోనే బుడమేరు వరద సమస్య తలెత్తిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శనివారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొల్లేరు ఆక్రమణపై గతంలో తాము పోరాటాలు చేశామని, సమస్యను అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. అప్పట్లో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ లవ్ అగర్వాల్‌ను మాఫియా టార్గెట్ చేసిందని చెప్పారు. కొల్లేరు ఆక్రమణలపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించాలని నారాయణ కోరారు. ఆక్రమణలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వానికి జారీచేసిన కోర్టు ధిక్కరణ నోటీసులను సీరియస్‌గా పరిగణించాలన్నారు. కొల్లేరును పరిరక్షించడం వల్ల ఏపీకి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. కొల్లేరు సరస్సును పరిరక్షించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు తాను లేఖ రాశానని తెలిపారు.

కర్నూలు యార్డులో ఉల్లి లోడింగ్‌కు చర్యలు

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఈ-నామ్'లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించి, మార్కెట్ యార్డుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను శనివారం ఆదేశించారు. కర్నూలు యార్డులో ఉల్లి పంటను తెచ్చిన రైతులకు.. ఈ-నామ్‌లో సాంకేతిక సమస్యతో టెండరు ప్రక్రియలో జాప్యం జరిగి, కాటాలు, లోడింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందన్న విషయం మంత్రి దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన మంత్రి.. కర్నూలు యార్డులో ఉల్లి లోడింగ్‌కు ఎక్కువ వాహనాలు ఏర్పాటు చేయాలని, రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

దాడిశెట్టి రాజాపై 20 కేసులున్నాయి

- హత్య కేసులో ఆయనకు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టులో సీనియర్ న్యాయవాది పోసాని

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' విలేకరి సత్యనారాయణ హత్య కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే దాడిశెట్టి రామలింగేశ్వరరావు(రాజా) హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో నవంబరు 5న నిర్ణయం వెల్లడిస్తామని కోర్టు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి ముందు ఇంప్లీడ్ పిటిషన్ వేసిన మృతుడి సోదరుడు కె. గోపాలకృష్ణ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. 'పిటిషనర్‌ను కేసులో నిందితుడిగా చేరుస్తూ 2019, అక్టోబరు 15న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2023లో చార్జిషీట్ దాఖలు చేసినా, దానిలో రాజా పేరు తొలగించారు. పిటిషనర్‌కు పూర్వ నేరచరిత్ర ఉంది. ఆయనపై 20కి పైగా కేసులున్నాయి. ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడు' అని విన్నవించారు. దాడిశెట్టి రాజా తరఫున సీనియర్ న్యాయవాది ఒ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. "పోలీసులు పిటిషనర్‌ను అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయండి" అని కోరారు.

కేంద్ర స్కూల్ ఎడ్యుకేషన్ అదనపు కార్యదర్శిగా ఏకే సింఘాల్

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఏపీ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌ను పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగానికి అదనపు సెక్రటరీగా కేంద్రం నియమించింది. ప్రస్తుతం ఆయన ఏపీలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ల బదిలీ!

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ వైద్య కాలేజీలు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్ల బదిలీకి ప్రభుత్వం సిద్ధమైంది. మార్కాపురం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.ఎన్. రాజమన్నార్‌ను నెల్లూరు కాలేజీ ప్రిన్సిపాల్‌గా, పులివెందుల కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవిని నంద్యాల కాలేజీ ప్రిన్సిపాల్‌గా, మదనపల్లి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమునను ఒంగోలుకు బదిలీ చేయనుంది.

అనంతలో ఘోర రోడ్డు ప్రమాదం

- టైరు పేలి లారీని ఢీకొట్టిన కారు
- ఘటనా స్థలంలోనే ఆరుగురి మృతి
- మృతులంతా ఇస్కాన్ భక్తులు
- గవర్నర్, సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి
- తిరుపతి జిల్లాలో మరో ప్రమాదం
- లారీని వెనుక నుంచి ఢీకొన్న కంటైనర్
- కంటైనర్ డ్రైవర్ సజీవ దహనం

శింగనమల, పెళ్లకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో టైరు పేలడంతో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టి నుజ్జునుజ్జయ్యింది. కారులో ఉన్న ఆరుగురు ఇస్కాన్ భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అనంతపురం జిల్లా శింగనమల మండలం నాయనిపల్లి క్రాస్ వద్ద శనివారం జరిగిందీ ఘటన. మృతులను బాలుగొండ శ్రీనివాసులు అలియాస్ శ్రీధర్ (34), సంతోష్ (34), బొట్టా షణ్ముగ్ (21), జిల్లే వెంకటేష్(వెంకీ) (20), కర్ల ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి (14), యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి (29)గా గుర్తించారు. పోలీసులు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి.. లారీ కింద ఇరుక్కున్న కారును బయటకు లాగించారు. సుమారు గంటపాటు శ్రమించి కారులో ఇరుక్కున్న మృతదేహాలను బయటకు తీశారు. మృతుల కుటుంబ సభ్యులను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించి ధైర్యం చెప్పారు.

గృహప్రవేశానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

తాడిపత్రి పట్టణంలో ఓ భక్తుడి గృహ ప్రవేశం సందర్భంగా శ్రీకృష్ణుడి సంకీర్తనలు పాడేందుకు అనంతపురం నుంచి వీరంతా శనివారం ఉదయం కారులో వెళ్లారు. సాయంత్రం అదే కారులో తిరుగుపయనమవగా ఈ ప్రమాదం జరిగింది.

ఇస్కాన్ సేవలో తరిస్తూ..

అనంతపురంలోని బ్రాహ్మణ వీధికి చెందిన గంగాధర్ కుమారుడు సంతోష్.. చిన్నప్పటి నుంచి ఇస్కాన్ ఆలయానికి వెళుతుండేవాడు. నాలుగేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల కుమార్తె ఉంది. అనంతపురం కమలానగర్‌కు చెందిన వెంకటేష్ పన్నెండేళ్లుగా ఇస్కాన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. 15 సంవత్సరాలుగా ఇస్కాన్ ఆలయంలో సేవ చేస్తున్నాడు. అనంతపురం పాతూరులోని భాగ్యనగర్‌కు చెందిన పెద్దారెడ్డి, చంద్రలేఖ దంపతుల కుమారుడు కర్ల ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి హైదరాబాద్‌లోని స్వామి నారాయణ విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. తాడిపత్రి నుంచి వస్తూ తిరిగిరాని లోకాలకు తరలివెళ్లిపోయాడు. అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు (శ్రీధర్ ప్రభు) ఇక్కడి కలెక్టరేట్ సమీపంలోని ఇస్కాన్ గోశాల ఆవరణలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నాడు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడపల్లికి చెందిన షణ్ముగ్ (22) అనంతపురం సాయినగర్‌లో ఉంటూ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూనే.. కియా కార్ల పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా ఇస్కాన్ సంకీర్తనలలో పాల్గొంటున్నాడు.



అనంతపురం జిల్లా నాయనపల్లి క్రాస్ వద్ద అదుపు తప్పి లారీని ఢీకొన్న కారు



గవర్నర్, సీఎం దిగ్ర్భాంతి

కారు ప్రమాద ఘటనలో ఆరుగురి మృతిపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సీఎం చంద్రబాబు అధికారులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

డ్రైవర్ సజీవ దహనం

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పూతలపట్టు నుంచి రాజమహేంద్రవరానికి మాజా కూల్ డ్రింక్స్ లోడ్‌తో వెళ్తున్న లారీని, కర్ణాటకలోని హోసూరు నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కొరియర్ కంటైనర్ శనివారం తెల్లవారుజామున 4 గంటలకు ఢీకొట్టింది. దీంతో కంటైనర్‌లో ఉన్న విఎనీ గ్యాస్ సిలిండర్ పగిలి మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన క్లీనర్ మెహబూబా కిందకు దూకి ప్రాణాలను కాపాడుకోగా సీట్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ సర్ఫరాజ్ అలియాస్ ఫిరోజ్ (18) మంటల్లో సజీవదహనమైపోయాడు. స్థానిక పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అష్టకష్టాలు

- రోజుకు 20 గంటలు పని.. మూడునెలల్లోనే అనారోగ్యం
- తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మహిళ దీనావస్థ
- మంత్రి లోకేశ్‌కు ఎక్స్‌లో బాధితురాలి భర్త మొర
- స్వదేశానికి రప్పిస్తానని మంత్రి హామీ
- రంగంలోకి ఏపీ ఎన్ఆర్‌టీఎస్ బృందం
- బాధితురాలు, భర్త, ఏజెంట్‌లతో సంప్రదింపులు



నామాడి ప్రమీల

అనపర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లిన ఓ మహిళ వెట్టిచాకిరీతో అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. మూడు నెలల్లోనే అనారోగ్యంపాలై నరకయాతన అనుభవిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన నామాడి ప్రమీల కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేందుకు కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బాబీ అనే ఏజెంట్‌ను ఆమె భర్త సంప్రదించగా, అతను ప్రసాద్ అనే మరో ఏజెంట్‌కు అప్పగించాడు. నెలకు రూ.52వేల జీతం, రోజుకు ఎనిమిది నుంచి పది గంటల పని ఉంటుందని చెప్పి ప్రసాద్ ఆమెను ఆగస్టు 10న కువైట్‌కు పంపించారు. అక్కడ రోజుకు 20 గంటలు పనిచేయించడంతో మూడు నెలల్లోనే ఆమె అనారోగ్యం పాలయ్యారు. ఆమెను స్వదేశానికి రప్పించాలని భర్త రాజాప్రసాద్ కోరగా, కుదరదని, రూ.90 వేల వరకు ఖర్చవుతుందని ప్రసాద్ తేల్చిచెప్పాడు. ఇప్పటికే అప్పులు చేసి కువైట్‌కు పంపామని, ఇక చెల్లించలేమని రాజాప్రసాద్ వాపోతున్నారు. ఏజెంటును ఎంతగా వేడుకున్నా ప్రయోజనం లేకపోవడంతో రాజాప్రసాద్ ఎక్స్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు తమ కష్టాలు తెలిపారు. వెంటనే స్పందించిన లోకేశ్ అధైర్యపడొద్దని ఎక్స్‌లో భరోసా ఇచ్చారు. ప్రమీలను ఇంటికి చేర్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఏపీ ఎన్ఆర్‌టీఎస్ బృందాన్ని రంగంలోకి దింపారు. అటు ప్రమీలతోనూ, ఇటు భర్త రాజాప్రసాద్, ఏజెంట్ ప్రసాద్‌తోనూ ఏపీ ఎన్ఆర్‌టీఎస్ బృందం సంప్రదింపులు జరుపుతోంది. ప్రమీల రాక కోసం భర్త రాజాప్రసాద్, అత్త నాగమణి, ఎనిమిదేళ్ల కుమార్తె ఎదురుచూస్తున్నారు. తన భార్యను క్షేమంగా ఇంటికి చేరిస్తే లోకేశ్‌కు రుణపడి ఉంటామని రాజాప్రసాద్ చెప్పారు.

ఏపీ జెన్కో, నెడ్‌క్యాప్‌లకు ఐఎస్‌వో గుర్తింపు

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్కో, నెడ్‌క్యాప్‌లకు ఐఎస్‌వో 9001:2015 గుర్తింపు రావడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఏపీజెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబును అభినందించారు. పునరుత్పాదక ఇంధన వనరులపై సీఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఏపీజెన్కో, నెడ్‌క్యాప్‌లకు ఐఎస్‌వో గుర్తింపు అంశం చర్చకు వచ్చింది.

కొండపల్లి ఖిల్లా... వదిలేశారిలా!



'విజయవాడలో ఏం చూడొచ్చు?' ఈ ప్రశ్న గూగుల్‌ను అడిగితే... కనకదుర్గమ్మ గుడి, ఉండవల్లి గుహలు, కొండపల్లి ఖిల్లాతోపాటు మరిన్ని ప్రదేశాలతో ఓ జాబితా ప్రత్యక్షమవుతుంది! 'వావ్... విజయవాడలో కోట ఉందా! అది కూడా ఆరు కిలోమీటర్లు ఘాట్ రోడ్డులో ప్రయాణించాలా! సూపర్' అనుకుని కొండపల్లికి బయలుదేరారంటే... పలురకాల సమస్యలు స్వాగతం చెబుతాయి! దీనిని ఇలా వదిలేశారేమని ఉసూరుమంటారు. గత ఐదేళ్లపాటు ఖిల్లా దారి నిర్వహణను వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ సమస్యలు పరిష్కరించాలని పర్యాటకులు, ట్రెక్కర్స్ కోరుతున్నారు.



ఇదీ 'ప్రవేశం'

విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి నుంచి కొండపల్లి కోట దారిలోకి మలుపు తిరగ్గానే కనిపించే దృశ్యమిది! మట్టి, బూడిద, గోతులు!



టిప్పర్లతో తిప్పలు

థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చే బూడిదను కొండపల్లికి వెళ్లే దారి పక్కనే ఉన్న చెరువులో (యాష్‌పాండ్) కలిపేస్తారు. ఈ బూడిదను తీసుకెళ్లేందుకు వచ్చే టిప్పర్ల హోరు, గందరగోళాన్ని దాటుకుని 'కోట దారి' పట్టడం అంత ఈజీ కాదు.



ధూళితో డేంజర్

కొండపల్లి కోటకు వెళ్లాలంటే ఈ బూడిదను భరించాల్సిందే. బూడిద చెరువు పక్కనే ఉన్న ఈ దారంతా ధూళి లేస్తూ ఉంటుంది. కారులో ఉన్న వాళ్లకు ఫర్వాలేదుకానీ... ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాళ్లకు 'బూడిద' మేకప్ తప్పదు.

మూసుకుపోయిన దారి



అసలే ఘాట్ రోడ్డు మలుపులు... అటువైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించవు. దీనికి తోడు రోడ్డును అటూ ఇటూ మూసేస్తూ పెరిగిన చెట్లూ, పొదలు! కొండపల్లి పైన టీవీ టవర్ ఉంది. గతంలో దూరదర్శన్ వారే ఈ రోడ్డు నిర్వహణ చూసుకునేవారు. ఇప్పుడు ఆ టవర్‌తో పనిలేదు. దూరదర్శన్ సిబ్బందీ అక్కడికి రావడంలేదు. దీంతో ఖిల్లా దారిని ఎవరూ పట్టించుకోవడంలేదు.

అవును... పురాతనమే!

ఖిల్లాలోని విశేషాలు చూడాలంటే టికెట్ కొనాలి! ఇదే ఆ టికెట్ కౌంటర్! తుప్పు పట్టిన బోర్డు, గ్రిల్స్‌తో 'పురాతన' ఛాయలు ఇక్కడే కనిపిస్తాయి. ఇక సీసీ కెమెరాలు 'కళ్లు మూసుకుని' దిక్కుకొకటిగా చూస్తుంటాయి.



20 లక్షల ఉద్యోగాల కల్పనపై
కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

» చైర్మన్‌గా మంత్రి లోకేశ్

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్రానికి భారీస్థాయిలో పెట్టుబడులు తీసుకువచ్చి, పెద్దఎత్తున పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా అభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు విధివిధానాలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని చేరుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు, అవసరమైన సూచనలు చేసేందుకు ఆరుగురు మంత్రులతో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మంత్రుల బృందానికి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేశ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి దుర్గేశ్, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలమంత్రి కొండపల్లిశ్రీనివాస్ సభ్యులుగా ఉంటారు.

ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్లు

వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిద్వారా నూతనంగా ప్రారంభించిన ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమండ్రి, విజయనగరం, పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టనున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ సీటు రూ.12లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీటు ఫీజు రూ.20 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో బీ-కేటగిరీ సీటు ఫీజు రూ.13.20 లక్షలు, సీ-కేటగిరీ సీటుకు ఫీజు రూ.39.60 లక్షలుగా పేర్కొంది. 26న సాయంత్రం 7గంటల నుంచి 28న ఉదయం 11గంటల వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది. ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపడతారు.

నేడు, రేపు బోరుగడ్డ అనిల్ విచారణ

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న వైసీపీ సానుభూతిపరుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌ను పోలీసులు గుంటూరుకు తరలించారు. శనివారం మధ్యాహ్నం రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద కస్టడీలోకి తీసుకున్న పోలీసులు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు పూర్తయ్యే సరికి చీకటి పడడంతో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు అనిల్‌ను విచారించనున్నట్టు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. 2019లో గుంటూరులోని ఏఈఎల్‌సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబు ప్రకాశ్ అనే వ్యక్తిని బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన నేరంపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో స్థానిక కోర్టు అనిల్‌కు రిమాండ్ విధించింది. దీంతో ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే, కేసు విచారణలో భాగంగా పోలీసులు కస్టడీకి అనుమతి కోరడంతో గుంటూరులోని ఐదవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు కస్టడీకి అనుమతించింది. దీంతో బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి నుంచి గుంటూరుకు తీసుకువచ్చారు.





హైదరాబాద్‌లో శనివారం జరిగిన డీజీపీ ద్వారకా తిరుమలరావు కుమార్తె గాయత్రి సోనాక్షి వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' చానల్ డైరెక్టర్ భానుప్రకాశ్

తిరగబడండి

(మొదటి పేజీ తరువాయి)

వెనక్కి తగ్గలేదు. ఎవరూ జెండా వదల్లేదు. చాలామంది ప్రాణాలు, ఆస్తులు సైతం కోల్పోయారు"



పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

ఎవరు దందా చేసినా తిరగబడండి..

"నాలుగోసారి సీఎం అయిన నేను ఇంతటి అస్తవ్యస్త పరిస్థితులను ఎప్పుడూ చూడలేదు. విధ్వంసం నుంచి బయటపడేసి రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే సమయం పడుతుంది. గత పాలకుల విచ్చలవిడి తప్పులతో ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నాం. నాసిరకం, సొంత బ్రాండ్లతో మద్యం సరఫరా చేసి నాడు ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారు. అందుకే నూతన మద్యం పాలసీ తెచ్చాం. మనం వచ్చిన తర్వాత ఉచిత ఇసుక పాలసీని తెచ్చి.. సీనరేజ్, లోడింగ్ చార్జీలను రద్దు చేశాం. వైసీపీ నేతలు రూ.30కే ఇసుక తోడతామని టెండర్లు వేశారని, ఇసుక పాలసీపై తప్పుడు సంకేతాలు పంపాలని ప్రయత్నిస్తున్నారు. ఇసుక విషయంలో ఎవరు దందా చేసినా తిరుగుబాటు చేయండి. ఇందులో మనవాళ్లు తప్పు చేసినా ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుంది. మద్యం ఎమ్మార్పీ రేట్ల కంటే ఎవరు ఎక్కువ అమ్మినా చర్యలు తీసుకుంటాం"

సమపాళ్లలో అభివృద్ధి-సంక్షేమం...

"జాబ్ ఫస్ట్ విధానం కోసం ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. అధికారంలోకి రాగానే రూ.4 వేలు పెన్షన్ అమలు చేశాం. దీపావళి నుంచి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పథకాన్ని ప్రారంభిస్తున్నాం. చెత్త పన్ను రద్దు చేశాం. స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. గౌడలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం. అర్చకులకు జీతాలు రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచాం. దేవాలయాల కమిటీల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు కొత్తగా స్థానం కల్పించాం. డిసెంబర్ నెల నుంచి పూర్తి స్థాయిలో రాజధాని పనులు ప్రారంభమవుతాయి. రెండేళ్లలో పోలవరం మొదటి దశ పూర్తి చేస్తాం. ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సమస్యలను పరిష్కరించి భూమి కేటాయించాం. అమరావతికి కొత్త రైల్వేలైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వబోతున్నాం. ప్రజల కోసం మనం కష్టపడుతున్నాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది. నా చుట్టూ కాకుండా నేతలు...ప్రజలు, కార్యకర్తల చుట్టూ తిరగాలి. పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు ఉంటుంది"

ఈసారి రాజకీయ పాలనే..

"నేను 1995 సీఎంనేగానీ, 2024 సీఎంను కాదు. ఈసారి కచ్చితంగా రాజకీయ పాలనే చేస్తా. కేడర్ నుంచి వస్తున్న విమర్శలను అర్థం చేసుకోగలను"

సామాన్యులకు చేరువగా అధికారాన్ని తెచ్చాం

"ఈ రోజు పవిత్రమైన దినం. పార్టీ పెట్టిన తొలినాళ్లలో రూపాయి సభ్యత్వం ఉండేది. కార్యకర్తల మనోభావాలను గౌరవించే పార్టీ మనది. టీడీపీని స్థాపించక ముందు కొన్ని కుటుంబాలకే అధికారం పరిమితమై ఉండేది. మనం వచ్చాక సామాన్యులకు చేరువగా అధికారాన్ని తెచ్చాం. చదువుకున్న యువతకు రాజకీయ అవకాశాలు కల్పించాం. బలహీనవర్గాలను ప్రోత్సహించాం. టీడీపీ ఓ రాజకీయ విశ్వవిద్యాలయం. ఈ విశ్వవిద్యాలయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది నేతలు తయారయ్యారు. రెండు రాష్ట్రాల్లో ఏ ముఖ్య నాయకుడిని చూసినా వారి మూలాలు టీడీపీ తోనే ప్రారంభమయ్యాయి. దేశంలోనే మొదటిసారి కార్యకర్తల కోసం బీమా విధానాన్ని తీసుకొచ్చాం. రూ.100 కట్టి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా అందించబోతున్నాం. ప్రమాదాలు, రాజకీయ కక్షల్లో భాగంగా మరణించిన కార్యకర్తల కుటుంబాల్లోని పిల్లలను చదివిస్తున్నాం. కార్యకర్తల కోసం రూ. కోట్లు వెచ్చిస్తున్నాం"

- చంద్రబాబు

టీడీపీని నమ్ముకున్న వారికి సాయం

» వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా కూడా సభ్యత్వం: పల్లా

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీ రామారావు పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీని నమ్ముకున్నవారికి, కష్టకాలంలో అండగా ఉన్నవారికి టీడీపీ చేతనైన సాయం చేస్తూ అండగా ఉంటోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్ అన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదును పార్టీ అధినేత చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలను దృష్టిలో పెట్టుకుని, వారి సంక్షేమం కోసం సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా కూడా సభ్యత్వం నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. "ఎన్టీఆర్ తెలుగు జాతికి గుర్తింపు తెచ్చారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారు. ప్రజల జీవితాలు మార్చడానికి, రాష్ట్రం అభివృద్ధి చేయడానికి రాజకీయ పార్టీలు నడపాలి. పేదవాడి కళ్లలో సంతోషం చూసే వాడే రాజకీయ నాయకుడు. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ రూ.43 వేల కోట్లు దోచుకున్నారు. వైసీపీని అవినీతి మూలాలపై స్థాపించారు. అలాంటి పార్టీలు కచ్చితంగా కూలిపోతాయి. ప్రజల్ని ఒక్కసారే మోసం చేయగలరు. అన్నివేళలా మోసం చేయలేరనడానికి 2024 ఎన్నికలే నిదర్శనం" అని అన్నారు.

రోడ్లు వేస్తుండగానే పక్కా తనిఖీ

» అన్ని జిల్లాల్లో మొదలైన నాణ్యతా పరిశీలన

» సిమెంట్‌రోడ్ల నిర్మాణంలో ఇప్పటికే దూకుడు

» క్వాలిటీపైనా దృష్టి పెట్టిన కూటమి సర్కారు



అన్నమయ్య జిల్లా కలికిరి మండలం పటేగడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 30 వేల సిమెంట్ రోడ్లను మంజూరుచేసిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటి నిర్మాణాల విషయంలో ఇప్పటికే దూకుడు పెంచింది. కొత్తగా వేస్తున్న సిమెంట్‌రోడ్లు నాణ్యతతో నిర్మించాలని, 30 ఏళ్లు మన్నికగా రోడ్లు ఉండేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా అవి నాణ్యతగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని భావించారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు రోడ్ల తనిఖీలు చేపట్టారు. రోడ్డు పూర్తి అయిన తర్వాత క్వాలిటీ తనిఖీలు చేయడం కంటే రోడ్డు నిర్మాణం సమయంలోనే తనిఖీలు చేపడితే రోడ్లను నాణ్యతతో నిర్మించే అవకాశముంటుందని భావిస్తున్నారు. సిమెంట్‌రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం ఇంజనీర్లను వేధించిన విషయం విదితమే. టీడీపీ హయాంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేసినప్పుడు ఆ పనులన్నింటికీ ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. ఆ బిల్లులు చెల్లించాలని కోర్టుకెళ్లిన కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెట్టేందుకు విజిలెన్స్ తనిఖీలకు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు అప్పట్లో పలు సిమెంట్‌రోడ్లను రద్దు చేయడం, తిరస్కరించడం, ఇంజనీర్లపై చర్యలు తీసుకునేలా సిఫారసులు చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీర్లు బెంబేలెత్తిపోయారు. ఈ నేపథ్యంలో ఇంజనీర్లు తిరిగి సిమెంట్‌రోడ్ల నిర్మాణం అనగానే వెనుకడుగు వేసే పరిస్థితి. ముందుగానే క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్లు తనిఖీలు చేపడుతుండటాన్ని వారంతా స్వాగతిస్తున్నారు. దీనివల్ల తమ పని సులువైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు శనివారం సిమెంట్‌రోడ్లను తనిఖీ చేశారు. ప్రతి జిల్లాలో మూడు క్వాలిటీ కంట్రోల్ టీంలున్నాయి. సాధారణంగా సిమెంట్‌రోడ్ల నిర్మాణం తర్వాత 21 రోజుల క్యూరింగ్ పీరియడ్ తర్వాతనే బిల్లులు చేసేందుకు ఇంజనీర్లు సిద్ధమవుతారు. అయితే ఆ తర్వాత క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ముందే తనిఖీలు చేస్తే పనులు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ ఇచ్చేందుకు క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఇబ్బందులుండవు.

కుమిలిపోతున్న అమ్మ!

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. శనివారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. జగన్‌కూ .. తనకూ మధ్య ఏర్పడిన ఆస్తుల వివాదం మీడియా ప్రస్తావించగానే.. షర్మిల కన్నీరు పెట్టుకున్నారు. "అన్నగా జగన్ ఆదేశించిన వెంటనే ఆనాడు పాదయాత్ర చేశాను. సమైక్యాంధ్ర కోసం పోరాటం చేశాను. కానీ, నాకు ఒక్క మేలైనా జగన్ చేశాడా? " అని గద్గద స్వరంతో ప్రశ్నించారు. జగన్ కోసం అమ్మ ఎంతో చేశారని, మోకాళ్ల నొప్పులు ఉన్నా .. జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడం కోసం ఆ నొప్పులకు ఐస్ రుద్దుకుని మరీ తిరిగారని గుర్తు చేశారు. అలాంటి అమ్మ మీద ఆస్తి కోసం జగన్ కేసు పెట్టారని ఆగ్రహించారు. "నాకు మా అన్న అంటే ఎంతో ఇష్టం. అందుకే ఆయన ఆదేశించగానే పాదయాత్ర చేశాను. సమైక్య ఆంధ్రప్రదేశ్ కోసం పోరాడాను. జగన్ కోసం నేను ఏదైనా చేసేందుకు సిద్ధపడ్డాను. జగన్ ఆదేశిస్తే చనిపోతానని తెలిసినా సూర్యుడిని తాకేదానిని. నాకు ఏం మేలు చేశాడో జగన్ చెప్పాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

వైవీ ప్రమాణం చేయగలరా?

ఆస్తుల వ్యవహారానికి సంబంధించి వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులకు రాసిన లేఖలో ఉద్దేశపూర్వకంగానే, బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పేర్లు రాశానని షర్మిల అన్నారు. "జగన్ మోచేతి నీళ్లు తాగుతున్నారని తెలిసే ఆ లేఖలో వైవీ పేరు ప్రస్తావించాను. నా లేఖకు వైవీ స్పందించిన తీరుతోనే ఆయన నైజం .. నిజస్వరూపం అమ్మకు తెలిసిపోయాయి. నేను చెబుతున్నదంతా నిజమని నా పిల్లలపై ప్రమాణం చేసి చెబుతున్నాను. సుబ్బారెడ్డి ప్రమాణం చేయగలరా? నా పిల్లలు సుబ్బారెడ్డి కళ్ల ముందే పెరిగారు. కనీసం వారిపై మమకారం లేదా? వైవీ, ఆయన కుమారుడు.... జగన్ వల్ల లబ్ధి పొందారు" అని షర్మిల విమర్శించారు. జగన్ పేరిట ఆస్తులున్నందునే ఆయన జైలుకు వెళ్లారని వైవీ అంటున్నారని .. అదే నిజమనుకుంటే .. తన పేరు మీద ఇవే ఆస్తులు ఉన్న భారతీ ఎందుకు జైలుకు వెళ్లలేదని షర్మిల ప్రశ్నించారు. ఆస్తులున్నందుకు ఎవరూ జైలుకు వెళ్లరని, చేసిన పనుల వల్ల వెళతారని ఆమె వ్యాఖ్యానించారు. ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా అని వైవీ సుబ్బారెడ్డిని నిలదీశారు. ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నదని అర్థమన్నారు. దీనికి వైవీ సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

నాన్న ముందే అన్న చెప్పాడు...

ఆస్తుల బదలాయింపు జరగకపోవడంపై ఒకరోజు జగన్‌ను తన తండ్రి రాజశేఖర రెడ్డి పిలిచి ఆరా తీశారని షర్మిల తెలిపారు. "నాన్నకు అప్పుడు మూడు అడుగుల దూరంలోనే జగన్ ఉన్నారు. 'నీ తరువాత పాప (షర్మిల) మేలు కోరేది నేనే' అని నాన్నతో జగన్ చెప్పారు.

చార్జీల భారం సర్కారే భరించాలి: షర్మిల



అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల భారం రూ.6,072 కోట్లను ప్రభుత్వమే భరించాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియాతో మాట్లాడారు. ఇసుక ధరలను నియంత్రించాలని కూటమి ప్రభుత్వాన్ని ఆమె కోరారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గయ్యపేటలో ఇథనాల్ పరిశ్రమ వెదజల్లుతున్న కాలుష్య సమస్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేత శివాజీ ఆమరణ దీక్ష చేపడుతున్నారు. దీక్ష విరమించాల్సిందిగా శివాజీని షర్మిల కోరారు. ఇప్పటికే పదిమంది కాలుష్యానికి బలై మరణించిన ఈ ఘటనపై సర్కారు ఇప్పటికీ స్పందించకపోతే .. తానే దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

పీక్స్‌కు చేరిన ఫోన్ పిచ్చి!

కడపకు చెందిన ఆ కుర్రాడి వయసు 11 సంవత్సరాలు. కొవిడ్ సమయంలో సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడటం అలవాటైంది. అది వ్యసనంగా మారింది. సరిగా అన్నం తినకపోవడం, స్కూలుకు పొమ్మంటే తిరగబడటం, నిద్రలో కలవరింతలు, చేతులు నొక్కుకోవడం, ఉలిక్కిపడి లేవడం వంటి సమస్యలు మొదలయ్యాయి. చేతిలోంచి ఫోన్ తీసుకుంటే గొడవపడే స్థాయికి వచ్చాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో.. పిల్లాడిపై ఎక్కువ శ్రద్ధ పెట్టలేకపోయారు. పరిస్థితి విషమిస్తుండడంతో చికిత్స చేయించారు. సైకోథెరపీ, బిహేవియర్ థెరపీతో ఆ పిల్లాడు దారికి వచ్చాడు.

(మొదటి పేజీ తరువాయి)

అతికించేయడమే! ఇంట్లో కూర్చున్నా, ప్రయాణం చేస్తున్నా, లిఫ్టు ఎక్కినా, రోడ్డుమీద నడుస్తున్నా... ఫోన్‌పైనే ధ్యాస! చిన్నపిల్లలు గేమ్స్ ఆడుతుండగా... టీనేజ్, మధ్య వయస్కులు సోషల్ మీడియాలో మునిగిపోతున్నారు. మరి కొందరు యూట్యూబ్, ఓటీటీ సినిమాలు చూస్తూ గడిపేస్తున్నారు. కొంత మందికి అవసరం లేకపోయినా సరే మొబైల్‌ను చూడకపోతే ఏదో కోల్పోయినట్లుగా ఫీలవుతున్నారు. ఆఫీసుల్లోనూ సగం మంది గంటకోసారైనా సోషల్ మీడియాలోకి తొంగిచూస్తున్నారు. డైలీ 1, 2, 3 జీబీ ప్లాన్‌లు... ఇళ్లు, కార్యాలయాల్లో వైఫైలతో నిత్యం 'నెట్'తో కనెక్ట్ అయ్యే ఉంటున్నారు. గంటల కొద్దీ ఫోన్ వదలకపోవడంతో కంటిచూపు దెబ్బతింటోంది. మెడ నొప్పి, ఇతర శారీరక సమస్యలతోపాటు... మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటోంది.

విశాఖపట్నంలో నగరంలో ప్రతినెలా 200 మందికిపైగా 'ఫోన్ బాధితులు' సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను సంప్రదిస్తున్నారు. వీరి స్క్రీన్‌టైమ్ రోజుకు పది గంటలకుపైగానే అని చెబుతున్నారు.

స్మార్ట్‌ఫోన్‌కు అలవాటుపడుతున్న 29-40ఏళ్లలోపు వారిలో 70%మంది మహిళలే. యూట్యూబ్ చానెల్స్‌లో వస్త్రాలు, వంటలు, ఆభరణాలు, హోమ్‌టూర్ వీడియోలు చూస్తున్నారు. ఇతరుల సామాజిక, ఆర్థిక స్థితితో పోల్చుకుంటూ కుటుంబంలో అలజడికి కారణమవుతున్నారు. ఈ తరహా గొడవలతో మానసిక నిపుణులు వద్దకు వస్తున్న దంపతులు సంఖ్య పెరుగుతోంది.

స్వీయ నియంత్రణే మందు..

మొబైల్ వినియోగం విషయంలో స్వీయ నియంత్రణ అవసరమని సైబర్ నిపుణులు చెబుతున్నారు. రోజుకు ఇంత సమయం మాత్రమే సోషల్ మీడియా ఫాలో కావాలనే నిబంధన పెట్టుకోవాలని సూచిస్తున్నారు. కొన్ని సోషల్ మీడియా యాప్స్‌లో 'టైమ్ కంట్రోల్' కూడా ఉంటుంది. 15 నిమిషాలు లేదా అరగంట కాగానే... 'మీ పరిమితి రీచ్ అయ్యారు' అనే అలర్ట్ వస్తుంది. ఇక... పిల్లలకు అరగంటకు మించి ఫోన్ ఇవ్వొద్దని నిపుణులు సూచిస్తున్నారు. అల్లరి వ మా న్పిం చే ం దు కో ం, ఆహారం పెట్టేందుకు ఫోన్ అలవాటు చేయొద్దని... వారిని ఇది ఫోన్‌కు 'అడిక్ట్' చేస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఇలా బయటపడొచ్చు...

కౌన్సెలింగ్, థెరపీల ద్వారా ఫోన్ అడిక్షన్‌ను దూరం చేయవచ్చు. వీలైనంత వరకు ఫోన్‌కు దూరంగా ఉండేలా చేయడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. యోగా, మెడిటేషన్, మ్యూజిక్ వినడం వంటి యాక్టివిటీస్ ద్వారా ఫోన్ అడిక్షన్ నుంచి నుంచి బయటపడవచ్చు.

- డాక్టర్ పూజిత, సైకాలజిస్టు, విశాఖపట్నం

ఇవీ లక్షణాలు..

పెద్దల్లో అయితే... పనిపై దృష్టిసారించలేకపోవడం, ఎదుటి వారి జీవితాలతో పోల్చుకోవడం!

విద్యార్థులు రూమ్‌కు పరిమితమై ఉండడం, ఆహారం, నిద్రలో తేడా రావడం, ఇతరులతో కలవకపోవడం.

అతిగా వినియోగిస్తే అనర్థమే



ఐదేళ్ల పిల్లల నుంచి పెద్ద వాళ్ల వరకు... వయసుతో సంబంధం లేకుండా అనేక మంది మొబైల్ ఫోన్‌కు అడిక్ట్ అవుతున్నారు. ఇలా మొబైల్ ఫోన్‌కు బానిసలైన వారు సరిగా చదవకపోవడం, చిన్న విషయాలకే చికాకు పడటం, నిద్రపోకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలా అడిక్ట్ అయినవారికి కడప ఆసుపత్రిలో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మరీ ముదిరిపోతే వారం పదిరోజులు మెడిసిన్‌తోపాటు సైకో బిహేవియర్ థెరపీతో చికిత్స ఇస్తున్నాం. ట్రీట్‌మెంట్ సమయంలో వారి ఆలోచనలను ఇతర అంశాల పైకి మళ్లిస్తాం.

- డాక్టర్ వంశీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మానసిక వ్యాధుల ఆసుపత్రి, కడప

ఈ-ఎడిక్షన్... మానసిక వ్యాధే



సెల్‌ఫోన్‌ను అతిగా వాడుతూ దానికి బానిసగా మారడాన్ని వైద్య శాస్త్రం ప్రకారం మానసిక వ్యాధిగానే పరిగణిస్తారు. సెల్‌ఫోన్, ఇతర సామాజిక మాధ్యమాలతో అతిగా గడపడాన్ని శాస్త్రీయంగా ఈ-ఎడిక్షన్ అని పిలుస్తారు. మానసిక వ్యాధుల విభాగంలో ఈ జబ్బును బిహేవియల్ ఎడిక్షన్ లో చేర్చారు. ఆరేళ్ల కిందట వరకు ఈ-ఎడిక్షన్‌ను మానసిక జబ్బుగా పరిగణించాలా? లేదా? అనే అంశంపై మీమాంశ ఉండేది. ఇటీవల ఇంటర్నేషనల్ సైకియాట్రిస్ట్ సొసైటీ, ఈ-ఎడిక్షన్‌ను బిహేవియల్ ఎడిక్షన్ కేటగిరిలో చేర్చింది. రోజుకు రెండు గంటలకు పైగా సెల్‌ఫోన్ వినియోగిస్తుంటే అది ఎడిక్షన్ కిందకు వస్తుంది. 20 శాతం విద్యార్థులు ఎడిక్షన్ బాధితులే. కరోనా సమయం నుంచి సోషల్ మీడియా, యూట్యూబ్, వాట్సాప్ తదితర వినియోగం భారీగా పెరిగినట్లు పరిశీలకులు చెబుతున్నారు.

- (గుంటూరు మెడికల్)

సెల్‌ఫోన్ అతి వినియోగాన్ని తగ్గించేందుకు ఉదయమే వ్యాయామం, వాకింగ్, యోగా వంటివి చేయాలి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఎక్కువగా గడపాలి.

- డాక్టర్ కోట సురేశ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ సైకియాట్రిస్ట్ సొసైటీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కాటూరి వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి

'సరస్వతీ' భూముల్లో సర్వే

» డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

» పల్నాడు జిల్లాలో అధికారుల పరిశీలన

» 4 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్టు తహశీల్దార్ గుర్తింపు

» నేడు, రేపు కొనసాగనున్న సర్వే



పల్నాడు జిల్లా తంగెడ, చెన్నాయపాలెం గ్రామాల మధ్య అటవీ భూముల్లో సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

దాచేపల్లి, మాచవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా పరిధిలో మాజీ సీఎం జగన్ కుటుంబానికి చెందిన సరస్వతీ పవర్ సంస్థ భూములను అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పరిశీలించారు. శనివారం దాచేపల్లి, మాచవరం మండలాల్లో అధికారులు పర్యటించారు. మాజీ సీఎం జగన్, ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మధ్య సరస్వతీ పవర్ సహా ఆస్తుల వ్యవహారంలో రగడ జరుగుతున్న సంగతి తెలిసిందే. సరస్వతీ పవర్ భూముల్లో వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే సమాచారం వెలుగు చూడటంతో పరిశీలించాల్సిందిగా అధికారులను పవన్ ఆదేశించారు. ఇందులో అటవీ శాఖ భూములు ఉన్నాయా? ఉంటే ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో దాచేపల్లి, మాచవరం మండలాల్లోని తంగెడ, చెన్నాయపాలెం గ్రామాల పరిధిలోని అటవీ భూములను అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. దాచేపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి (డీఆర్వో) విజయలక్ష్మి, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు హద్దురాళ్లను గుర్తించి రికార్డులను పరిశీలించారు. తంగెడ, వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల్లో 2010లో సరస్వతీ పవర్ సంస్థ సుమారు 1600 ఎకరాలు సేకరించింది. ఈ భూముల్లో వాగులు, వంకలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. తంగెడ, చెన్నాయపాలెం గ్రామాల మధ్య సుమారు 6 కి.మీ.లో అధికారులు హద్దురాళ్లను గుర్తించారు. సమగ్ర సమాచారం కోసం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన రైతుల సహకారాన్ని అటవీ శాఖాధికారులు తీసుకున్నారు. రేగులగడ్డ రాములవారి ఆలయ భూములు ఉన్నాయని, అదే గ్రామానికి చెందిన బొడ్డు కోటమ్మకు చెందిన కుంట కూడా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే కుంటలు, దేవాలయ భూముల కొనుగోళ్ల విషయంపై పూర్తిస్థాయి సమాచారం లేదు. సరస్వతీ పవర్ సంస్థ కొనుగోలు చేసిన భూముల్లో అటవీ భూములకు సంబంధించి ఆధారాలు లభించలేదని డీఆర్వో విజయలక్ష్మి తెలిపారు. అటవీ శాఖాధికారులు మరో రెండు రోజులు హద్దు రాళ్లను గుర్తించి సర్వే కొనసాగించనున్నారు.

4 ఎకరాల ప్రభుత్వ భూములు

సరస్వతీ యాజమాన్యం కొనుగోలు చేసిన భూముల్లో నాలుగు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్టు గుర్తించినట్లు మాచవరం తహశీల్దార్ క్షమారాణి తెలిపారు. 821 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, ఇంకా 258 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం సరస్వతీ సంస్థ కొనుగోలు చేసిన భూముల రికార్డులను పరిశీలించామన్నారు. సోమవారం సాయంత్రం నాటికి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తుది నివేదిక ఇస్తామని చెప్పారు.

ఫ్యాక్టరీ లేదు.. ఉద్యోగాలు లేవు

ఫ్యాక్టరీ కట్టే వరకు భూముల్లో సాగు చేసుకోవచ్చని 2010లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ రామాంజనేయులు హామీ ఇచ్చినా దానిని యాజమాన్యం అమలు చేయలేదని రైతులు తెలిపారు. చెప్పినట్లుగా యాజమాన్యం ఫ్యాక్టరీని నిర్మించలేదని, ఉద్యోగాలూ ఇవ్వలేదన్నారు.

‘ఏఐ’తో రాష్ట్రాభివృద్ధి

ప్రజా పాలనలోనూ పారదర్శకత

- ప్రతి వంద రోజులకూ లక్ష్యాలు
- పెట్టుబడులకు రాష్ట్రం సువర్ణావకాశం
- అమెరికా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శాన్‌ఫ్రాన్సిస్కోలో పారిశ్రామికవేత్తలతో భేటీ

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఉన్నట్టు మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ‘వై2కె’ బూమ్ నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో సమాచార సాంకేతిక(ఐటీ) రంగం అభివృద్ధి చెందిందని తెలిపారు. అదేవిధంగా ఏఐతో ఏపీని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించవచ్చని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న నారా లోకేశ్.. శాన్‌ఫ్రాన్సిస్కోలోని పారిశ్రామికవేత్తలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను వివరించారు. భారత్‌లో రాబోయే 25 ఏళ్లలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. ఏఐ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన, మెరుగైన, పారదర్శకమైన పాలనను అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తమలాంటి యువ నాయకత్వాన్ని మరింత ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు మంత్రి వర్గంలో 17 మంది కొత్తవారే ఉన్నారన్నారు. విభజిత ఏపీలో ఉత్పాదకరంగం, సంప్రదాయేతర ఇంధనోత్పత్తి, బయో ఎనర్జీ, ఆక్వా, పెట్రో కెమికల్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలున్నాయని తెలిపారు. పెట్టుబడిదారులకు రాష్ట్రం సువర్ణావకాశమని పేర్కొన్నారు. ప్రతి వంద రోజులకు లక్ష్యాలను నిర్దేశించుకుని ఏపీ సమగ్ర అభివృద్ధికి కృషి సల్పుతున్నామని వివరించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తెస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అందించడానికి కృషి చేస్తున్నామని, దీనివల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు సులభతరం అవుతాయని చెప్పారు. కొత్త ఆవిష్కరణల కోసం విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేజీ టు పీజీ వరకు పాఠ్యాంశాల్లో మార్పులు చేస్తున్నట్టు లోకేశ్ వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అక్కిరాజు నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. దీనిలో ఎన్‌విడియా వైస్‌ప్రెసిడెంట్ రాము అక్కిరాజు, విప్రో ప్రెసిడెంట్ నాగేంద్ర బండారు, న్యూటానిక్స్ ప్రెసిడెంట్ రాజీవ్ రామస్వామి, దేవ్‌రేవ్ సీఈవో ధీరజ్ పాండే, గ్లీన్ సంస్థ సీఈవో అరవింద్ జైన్, నెక్సస్ వెంచర్స్ ఎండీ జిష్ణు భట్టాచార్య, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవిచంద్ర, సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేశ్ రాగినేని, స్పాన్ ఐవో సీఈవో రాజా కోడూరి, ఇవాంటి చీఫ్ ప్రొడక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ ముక్కామల, హిటాచీ వంటారా సీఈవో ఆశిష్ భరత్, గుడుల్ క్లౌడ్ జనరల్ మేనేజర్ పునిపొట్టి, వెస్ట్రన్ డిజిటల్ సీఈవో శేషు తిరుమల, ఈక్వెనిక్స్ గ్లోబల్ ఎండీ జోషి, త్రీడీగ్లాస్ సొల్యూషన్స్ సీఈవో బాబు మండవ, పారిశ్రామికవేత్తలు వంశీ బొప్పన, రాజీవ్ ప్రతాప్, మంత్రిప్రగడ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


శాన్‌ఫ్రాన్సిస్కోలో వ్యాపారవేత్తల భేటీలో మాట్లాడుతున్న లోకేశ్



డ్రైవర్ లెస్ ట్రక్‌ను ప్రారంభించిన లోకేశ్

ఏపీలో పరిశ్రమల స్థాపనకు మెరుగైన ఎకో సిస్టమ్‌ను కల్పించామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సరైన ప్రతిపాదనలతో వస్తే.. వెనువెంటనే అనుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ‘ఫాల్కన్ ఎక్స్’ అనుబంధ సంస్థ బోసన్ మోటార్స్ రూపొందించిన ఇంటెలిజెంట్ ఎలక్ట్రికల్ లైట్ యుటిలిటీ వెహికల్(డ్రైవర్ లెస్ ట్రక్)ను శాన్ జోస్ మేయర్, మల్పిటాస్ మేయర్‌లతో కలిసి లోకేశ్ ప్రారంభించారు. ఏపీలో పురుడు పోసుకున్న బోసన్ మోటార్స్ అంతర్జాతీయ స్థాయికి ఎదగడంపై లోకేశ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ అయ్యారు. ఏపీలో తమ సంస్థ కార్యకలాపాల విస్తరణ వ్యూహాలను ‘ఆన్‌వ్యూ సొల్యూషన్స్’ అధినేత జోయల్ వివరించారు. ఫాల్కన్ ఎక్స్ ప్రతినిధులు.. తమ సంస్థ సిరిస్ ఏ స్టార్టప్‌లతో వివిధ రంగాల్లో ఆవిష్కరణలకు సిద్ధంగా ఉందన్నారు. డిజిసెర్ట్ సీఈవో అమిత్ సిన్హా తమ సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఆయా సంస్థల అనుబంధ విభాగాలను ఏపీలో ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు.

ధరలకు కళ్లెం!

- సామాన్యులకు ఊరట కల్పించేలా ధరల నియంత్రణకు సర్కారు సిద్ధం
- మంత్రివర్గ ఉపసంఘం నియామకం.. చైర్మన్‌గా మంత్రి నాదెండ్ల

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేసేందుకు సర్కారు నడుంబిగించింది. ధరలను నియంత్రించేందుకు అనుసరించాల్సిన విధానాలు, పర్యవేక్షణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చైర్మన్‌గా, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వాణిజ్య పన్నులశాఖల మంత్రి పయ్యావుల కేశవ్‌లను సభ్యులుగా నియమించింది. ఈ బృందాన్ని సమన్వయం చేసేందుకు పౌరసరఫరాలశాఖ కమిషనర్ జి. వీరపాండియన్‌ను సభ్యకార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

బృందం ఏం చేస్తుంది?

1 నిత్యావసర సరుకుల ధరల ధరల స్థిరీకరణకు మంత్రి వర్గ ఉపసంఘం కృషి చేస్తుంది. వినియోగదారులకు ఆయా సరుకులను సరసమైన, సహేతుకమైన ధరలకు అందించేలా ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది.

1 ఏయే సరుకులకు ఎంతెంత సబ్సిడీ ఇవ్వాలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయిస్తుంది.మార్కెట్ జోక్యాన్ని ఏ స్థాయిలో నియంత్రించాలో వెల్లడిస్తుంది. శాశ్వత ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుపై సిఫారులు చేస్తుంది. వ్యవసాయ, ఇతర వస్తువుల ధరలలో పెరుగుదలను అంచనా వేసి, కారణాలను విశ్లేషిస్తుంది.

1 ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం సులువుగా వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా సమగ్రమైన డేటా బేస్‌ను మంత్రివర్గ ఉపసంఘం రూపొందిస్తుంది. ఆహార పంటల పర్యవేక్షణ, నిత్యావసర వస్తువుల ఉత్పత్తిని పెంచడంపైనా సూచనలు చేస్తుంది.

1 ఏడాది పొడవునా నిత్యావసరాల సరఫరాలో స్వయం సమృద్ధిని సాధించడానికి అవసరమైన మార్గాలను అన్వేషిస్తుంది. సరుకుల నిల్వలు పెంచడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సంబంధించిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేస్తుంది.

1 రైతు సంఘాలు, మిల్లర్స్ అసోసియేషన్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు, ఆయిల్ డీలర్లు, ఎగుమతి, దిగుమతిదారులు, వ్యాపారులతో మంత్రివర్గ ఉపసంఘం చర్చలు జరపనుంది.

‘ఉచిత గ్యాస్’పై జీవో విడుదల.. ఎల్లుండి నుంచి బుకింగ్

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 29 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపచేయనున్నట్టు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించిన నేపథ్యంలో ఆ మేరకు విధివిధానాలను వివరిస్తూ ప్రభుత్వం శనివారం జీవో విడుదల చేసింది. మేనిఫెస్టోలో ప్రకటించిన ‘సూపర్ సిక్స్’ హామీల్లో భాగంగా రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఏడాదికి 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేయనున్నారు. 31న దీపావళిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్టు జీవోలో పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న లబ్ధిదారులకు సబ్సిడీ నిధులను ఆధార్‌తో లింకైన బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేస్తారు.

రాష్ట్రంలో చలి మొదలు

విశాఖపట్నం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శీతాకాలం ప్రవేశిస్తున్న నేపథ్యంలో రాత్రివేళ చలి మొదలైంది. రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. అదే సమయంలో పగటిపూట ఎండ తీవ్రత కొనసాగుతోంది. శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు ఎక్కువగా, రాత్రి ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. కావలిలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, ఆరోగ్యవరంలో 19 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. వాయవ్య భారతం నుంచి వీస్తున్న గాలులతో పగటిపూట ఎండ తీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. దీంతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల వర్షాలు కురిసినట్టు పేర్కొన్నారు. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయని తెలిపారు.

హాజరు ప్రకారమే జీతభత్యాలు

ఆర్టీఐ కమిషనర్ సునీల్ వ్యాజ్యంపై హైకోర్టు ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హాజరుకు సంబంధించి రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా నడుచుకుంటేనే ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్‌కు సెప్టెంబరు నెల జీతభత్యాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ సమాచార కమిషన్ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. సుజాత శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తనకు సెప్టెంబరు నెల జీతభత్యాలు చెల్లించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ చావలి సునీల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శనివారం విచారణకు రాగా సునీల్ తరఫు న్యాయవాది వై. నాగిరెడ్డి వాదనలు వినిపించారు. ఏపీ సమాచార కమిషన్, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ తరఫున న్యాయవాది రవికాంత్ వాదనలు విని పిస్తూ.. జీతభత్యాల చెల్లింపు నిలిపివేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. సమాచార కమిషన్ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బంది అందరికీ బయోమెట్రిక్, మాన్యువల్ హాజరును తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ హాజరు ఆధారంగానే జీతాల చెల్లింపు ఉంటుందని స్పష్టం చేసినట్టు చెప్పారు.



ఆ పాపం జగన్‌దే!

- సీఎంగా ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనలను ఆమోదించలేదా?
- రాష్ట్ర ప్రజలపై వేల కోట్ల భారానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది మీరే కదా!
- ఇప్పుడు వక్రభాష్యాలు ఎందుకు చెబుతారు?
- జగన్‌పై మంత్రి గొట్టిపాటి ఆగ్రహం



అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంధన సర్దుబాటు చార్జీల పాపం జగన్‌దేనని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 2022-23కు సంబంధించి రూ.8,114 కోట్లు, 2023-24కు రూ.11,826 కోట్ల సర్దుబాటు చార్జీలకు సంబంధించి ఏపీఈఆర్‌సీకి ప్రతిపాదనలు పంపాలని సీఎంగా ఉన్న సమయంలో ఆయన డిస్కమ్‌లను ఆదేశించలేదా? అని ప్రశ్నించారు. 2022-23 సంవత్సరానికిగాను రూ.6,072 కోట్ల సర్దుబాటు చార్జీలు వసూలు చేసుకునేందుకు డిస్కమ్‌లకు ఈఆర్‌సీ అనుమతి ఇవ్వడానికి సీఎంగా జగన్ చేసిన పాపాలే కారణమని మండిపడ్డారు. 2022-23లో జగన్ ఆదేశాల మేరకే డిస్కమ్‌లు రూ.8,114 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను ఆమోదించాలని ఈఆర్‌సీకి విజ్ఞప్తి చేశాయని చెప్పారు. అదేవిధంగా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 2023-24 కాలానికి రూ.11,826 కోట్ల ప్రతిపాదనలను పంపలేదా అని జగన్‌ను మంత్రి నిలదీశారు. స్వలాభం కోసం జెన్కో విద్యుదుత్పత్తి ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేసి, బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కరెంటును కొనుగోలు చేయడం వల్లే ఇప్పుడు ప్రజలపై భారం పడిందన్నారు. ‘చేయాల్సిన పాపం చేసి.. ఇప్పుడు ఆ నెపాన్ని కూటమి ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తారా?’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు, కరెంటు కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడి సంపాదించిన సొమ్మును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని అన్నారు. ఇంధన సర్దుబాటు చార్జీల పాపమెవరిదో రాష్ట్ర ప్రజలకు వివరిస్తామని చెప్పారు.


విద్యుత్ భారాన్ని నిరసిస్తూ విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

వైసీపీ పాపాలను శాపాలుగా మారుస్తున్నారు: సీపీఎం

అమరావతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాపాలను ఇప్పటి కూటమి ప్రభుత్వం ప్రజలకు శాపాలుగా మారుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.కాశీనాథ్ విమర్శించారు. జగన్ సర్కార్ దారిలోనే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం పయనిస్తోందని అన్నారు. విద్యుత్తు సర్దుబాటు చార్జీల పేరుతో రూ.6,072కోట్ల భారాన్ని ప్రజలపై వేయడానికి వ్యతిరేకంగా విజయవాడ ధర్నాచౌక్‌లోని విద్యుత్తు కార్యాలయం వద్ద సీపీఎం విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సర్దుబాటు చార్జీలను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజలపై విద్యుత్తు భారం తగదు: సీపీఐ రామకృష్ణ

ప్రజలపై విద్యుత్తు భారాలు మోపడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీడీపీ కూటమి.. ఇప్పుడు దాన్ని విస్మరిస్తూ రూ.6,072 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపుతుండటం దుర్మార్గమని మండిపడ్డారు. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకుంటే ఇతర వామపక్ష పార్టీలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సొంతానికి ‘పవర్’!

(మొదటి పేజీ తరువాయి)

దాని బైలాస్ (కంపెనీ విధివిధానాలు)లో మార్పులు చేయించారు. ఈ మేరకు జగన్ సతీమణి భారతి తీర్మానం ప్రవేశపెట్టగా రాజశేఖరరెడ్డి సతీమణి, బోర్డు సభ్యురాలిగా ఉన్న విజయలక్ష్మి బలపరిచారు. కంపెనీ వ్యాపార స్వభావాన్ని అధికారికంగా మార్చడానికి నెలరోజుల ముందే జగన్‌కు మేళ్లు చేకూర్చేలా వైఎస్ ప్రభుత్వం నాటి గనులశాఖ డైరెక్టర్‌తో 2008 జూన్ 12నే మెమో ఇప్పించింది. తర్వాత అదే మెమో ఆధారంగా సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు మైనింగ్ లీజులు కేటాయిస్తూ 2009 మే 18న గనుల శాఖతో జీవో 107ను ఇప్పించారు. నిబంధనల ప్రకారం రెండేళ్లల్లో కంపెనీ మైనింగ్ చేపట్టాలి. కానీ 2011 వరకూ ఆ కంపెనీ పని ప్రారంభించలేదు. దీంతో 2011లో సరస్వతీ కంపెనీకి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండుసార్లు (ఫిబ్రవరి, జూన్) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. నిబంధనల ప్రకారం పని ప్రారంభించనందుకు లీజులు ఎందుకు రద్దుచేయకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది. చివరకు ఆ మైనింగ్ లీజులను 2014లో రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో 98 జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ సరస్వతి కంపెనీ కోర్టును ఆశ్రయించింది. ఇవన్నీ జగన్ అధిరాకంలోకి రాకముందు జరిగిన పరిణామాలు.

జగన్ అధికారంలోకి వచ్చాక...

మైనింగ్ లీజుల సందర్భంగా సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు 2012లో ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం నీటి కేటాయింపు చేశారు. రోజుకు సగటున 0.0368 టీఎంసీ నీటి కేటాయింపునకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలని ఈసీలో ఆదేశించారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చాక ఈ నీటి కేటాయింపును 0.068 టీఎంసీలకు పెంచుకుంటూ 2019 డిసెంబరు 3న జీవో 81 జారీ చేయించారు. సహజంగా నీటి కేటాయింపు కాలపరిమితి ఐదేళ్లు ఉంటుంది. కానీ 2020 మే 15న జారీ చేయించిన జీవో 16తో జగన్ దీన్ని జీవితకాలం కేటాయింపుగా మార్చేశారు.

అమరావతి రాజధానికి సున్నం

జగన్ తన అవసరాల కోసం అమరావతి రాజధానిని కూడా వాడుకున్నారు. పనయ్యాక అమరావతికి సున్నం రాశారు. మైనింగ్ కోసం తెచ్చుకున్న పర్యావరణ అనుమతి కాలపరిమితి 2019లోనే పూర్తయింది. దీంతో మరోసారి దాని పొడిగింపు కోరతూ కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు దరఖాస్తు పెట్టుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భారీగా సిమెంటు అవసరం ఉంటుందని, అందువల్ల తన పరిశ్రమకు మరోసారి అనుమతి కొనసాగించాలని అందులో విజ్ఞప్తి చేశారు. తీరా అనుమతి వచ్చాక ‘అమరావతి వద్దు.. మూడు రాజధానులే ముద్దు’ అంటూ జగన్ మూడు ముక్కలాటకు తెర తీశారు.

కేంద్రం కళ్లకు గంతలు

సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు పర్యావరణ అనుమతులు పొందేందుకు కీలకమైన వాస్తవాలను కేంద్రం ముందు దాచిపెట్టారు. నిజాలు చెబితే అనుమతి కొనసాగించరని, అవాస్తవాలతో పనికానిచ్చారు. ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చే ముందు... ‘కంపెనీ, భూములకు సంబంధించిన కేసులు ఏమైనా కోర్టులో ఉన్నాయా? కంపెనీకి ఇచ్చిన దానిట్లో ప్రభుత్వ భూములున్నాయా? ప్రభుత్వం ఇచ్చిన జీవోలు ఉన్నాయా? వాటిపై ఏమైనా వివాదాలున్నాయా?’ అని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రశ్నించింది. దీనికి సమాధానంగా సరస్వతి కంపెనీ పచ్చి అబద్ధాలను వండివార్చింది.

జగన్ కంపెనీ దాచిపెట్టిన విషయాలివీ..

1 లీజుల రద్దుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 2014లో హైకోర్టులో వేసిన పిటిషన్ గురించి కేంద్రానికి సమాచారం ఇవ్వలేదు. పైగా ఎలాంటి వాజ్యాలు లేవని తప్పుడు సమాచారం ఇచ్చారు.

1 మైనింగ్ లీజులను రద్దుచేస్తూ ప్రభుత్వం 2014 అక్టోబరులో జీవో 98 జారీ చేసిన విషయాన్ని తొక్కిపెట్టి, ఎలాంటి జీవోలు లేవని నివేదించింది. ఈ విధంగా తప్పుడు సమాధానాలతో కేంద్రానికి బురిడీ కొట్టి 2022 మార్చి వరకు పర్యావరణ అనుమతి సాధించారు.

1 వాస్తవానికి 2014లో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై తుది విచారణ 2019 అక్టోబరు 15న జరిగింది. అందులో తమవద్ద ప్రభుత్వ భూములే లేవని, ఉన్నవన్నీ ప్రైవేటు భూములే అని సరస్వతి యాజమాన్యం వాదనలు వినిపించి న్యాయస్థానాన్ని కూడా తప్పుదోవ పట్టించింది. పర్యావరణ అనుమతి కోసం ఇచ్చిన దరఖాస్తులో మాత్రం తమవద్ద 25 ఎకరాల ప్రభుత్వ భూమి (10.028 హెక్టార్లు) ఉందని పేర్కొంది.

1 కీలక వాస్తవాలు దాచిపెట్టడంతో.. ఏ కేసులు, వివాదాలు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన జీవో 98ను హైకోర్టు నిలుపుదల చేసింది.

1 కోర్టు తీర్పు ఆధారంగా 2019 డిసెంబరు 12న జీవో 109 ద్వారా 613.476 హెక్టార్ల మైనింగ్ లీజును పునరుద్ధరిస్తూ జగన్ సర్కారు ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి పది రోజుల ముందే, ఆ మైనింగ్‌కు నీటి కేటాయింపు చేస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. పర్యావరణ అనుమతిలో పేర్కొన్న దానికి రెండురెట్లు అదనంగా నీటిని కేటాయించారు. మైనింగ్ లీజులకు సంబంధించి భ విస్తీర్ణంలోనూ మార్పులు చేసుకున్నారు. వేమవరం గ్రామంలో తొలుత కేటాయించిన 145.2 హెక్టార్ల భూమిని 202 హెక్టార్లుగా, చెన్నాయపాళెం గ్రామంలో తొలుత కేటాయించిన 202.2 హెక్టార్ల భూమిని 145.2 హెక్టార్లుగా మార్చుకుంటూ ఉత్తర్వులు ఇచ్చారు.

దాడికి ముందు సజ్జలతో భేటీ

- అప్పిరెడ్డి, రఘురాం, నందిగం, అవినాశ్ సమావేశమై మాట్లాడారు
- వారి ఆదేశాలతోనే టీడీపీ కార్యాలయంపైకి దాడికి వెళ్లాం
- అక్కడ పట్టాభి ఉంటే చంపాలనుకున్నాం
- సీఐడీ విచారణలో కీలక విషయాలు వెల్లడించిన చైతన్య!

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి ముందు వైసీపీ ఆఫీసులో సజ్జల రామకృష్ణారెడ్డితో ఆ పార్టీ నాయకులు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, నందిగం సురేష్, దేవినేని అవినాశ్ భేటీ అయ్యారని ప్రధాన నిందితుడు వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య సీఐడీ విచారణలో చెప్పినట్లు తెలిసింది. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న చైతన్యను కోర్టు మూడు రోజులు సీఐడీ కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. మొదటి రోజు చైతన్య విచారణకు సహకరించకపోగా, కేసును తప్పుదారి పట్టించేలా వ్యవహరించినట్లు తెలిసింది. కాగా రెండో రోజు దాడికి సంబంధించి కీలక విషయాలను సీఐడీ విచారణలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఆ వివరాల ప్రకారం.. టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిన రోజు మధ్యాహ్నం 3 గంటలకు తన అనుచరులు తియ్యగూర గోపిరెడ్డి, పేరూరి అజయ్, రామిశెట్టి విశాల్ తదితరులతో తాను నాజ్ సెంటర్లో ఉండగా వైసీపీ నేత నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి వెంటనే తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లాలని చెప్పాడని చైతన్య పేర్కొన్నారు. అంతేగాక అనుచరులను సిద్ధంగా ఉంచమని చెప్పాడన్నారు. ఉమామహేశ్వరరెడ్డి నాజ్ సెంటర్‌కు రాగా.. తామంతా కారులో తాడేపల్లికి వెళ్లామని తెలిపారు. ఆ సమయంలో కారులో ఉమామహేశ్వరరెడ్డితో పాటు గడ్డంతో ఉన్న మరో వ్యక్తి ఉన్నాడని, అయితే అతడు ఎవరో తనకు తెలియదని చెప్పాడు. తాము వైసీపీ కార్యాలయానికి వెళ్లిన సమయంలో సజ్జల రామకృష్ణారెడ్డితో అప్పిరెడ్డి, రఘురాం, నందిగం సురేష్, దేవినేని అవినాశ్ తదితరులు సమావేశమై ఉన్నారని పేర్కొన్నాడు. ఆ తర్వాత సమావేశంలో పాల్గొన్న నేతల నుంచి వచ్చిన ఆదేశాలతో అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న 200 మంది వరకు కార్యకర్తలతో కలిసి టీడీపీ కార్యాలయంపై దాడికి బయలుదేరామని చైతన్య వివరించాడు. జగన్‌ను దూషించిన పట్టాభి అంతు చూడాలని అనుకున్నామన్నాడు. కొంత మంది టీడీపీ ఆఫీసులో పట్టాభి ఉండే చంపేయండిరా! అంటూ కేకలు వేశారని, ఇనుప రాడ్లు, కర్రలు, రాళ్లతో అక్కడున్న వారిని కొట్టామని చెప్పినట్లు తెలిసింది. దేవినేని అవినాశ్ మరికొందరు టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చి దాడి తీరును పరిశీలించారని తెలిపారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన మంగళగిరి రూరల్ సీఐ, ఓ కానిస్టేబుల్‌పై తాను దాడి చేశానని పానుగంటి చెప్పాడు. దాడి అనంతరం ఖాజా మొహిద్దీన్, బత్తుల దేవానంద్, అచ్చాల వెంకటరెడ్డి తదితరులతో తాను ఏపీ07 బీఈ 2345 నంబరు గల కారులో తిరిగి వైసీపీ కార్యాలయం వద్దకు వెళ్లినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.